శనివారం 18-3-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 15

సంచిక: 356



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



The Perfect Life, Styled for You!

2, 3 & 4 BHK Flats
@ Centrally located in Narsingi

Starting at ₹1.7 Cr.*







2 Clubhouses - 50+ World Class Amenities

Children's Play Area | Fitness Centres | Sports Arenas
Yoga & Meditation Deck | Supermarket | Swimming Pool
Pharmacy | Spa & Salon | Party Lawn & Halls

*T&C Apply

Unflinching Commitment to Customers Delight earns us Recognition & Laurels



INDIAN ACHIEVERS AWARDS 2023

SRI YERRAM VIJAY KUMAR
CHAIRMAN & MD, VASAVI GROUP
RECEIVING THE AWARD FROM
HON'BLE MINISTER FOR ROAD TRANSPORT & HIGHWAYS IN THE GOVERNMENT OF INDIA
SRI NITIN GADKARI

- Trusted Developer of The Year 2022
- Best Ultra Luxury Apartment Ongoing Vasavi Skyla 2022
- Exemplary Contribution to Real Estate Hyderabad 2021
- Premium Affordable Project of the Year 2021
- Trusted Developer of the Year 2019

A Legacy of 3 Decades of Trust and Quality

50 Million sft. to be built in the next 5 years | **17** Commercial Projects | **310** Acres of Villa plots sold
8 Million sft. built | **4510** Apartments built till date | **30** Residential Projects

Vasavi Atlantis, Narsingi Village,
Gandipet Mandal - 500 075.
www.vasaviatlantis.com

TS RERA: P02400003398

95335 14444

Disclaimer: This Advertisement does not constitute an offer and / or acceptance / or contract / or agreement and / or transaction and / or any intention thereof and / or a disclosure under any statute of any nature whatsoever. the pictorial / other representation herein, the layout, number of buildings / towers / wings / structures, facilities and amenities are merely creative and an Architect's impression and are only indicative. Actual product may vary / differ from what is indicated herein. The photograph contained herein may be stock / standard photography used for the purpose and have been taken at a location other than the project site and are used to indicate a conceptual lifestyle. **All norms, requirements pertaining to the environment, Fire Services, HMDA Rules and Regulations have been adhered to while designing the property.**

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50 సంపుటి: 15 సంచిక: 356
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



భారత్ ఘన విజయం

ముంబైలో జరిగిన తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను భారత్ ఓడించింది. రాహుల్, జడేజా కీలకపాత్ర పోషించారు.

- వివరాలు 15లో▶



భారత వ్యతిరేకి రాహుల్: నడ్డా

భారత వ్యతిరేక టూల్‌కిట్‌లో రాహుల్ శాశ్వత భాగస్వామిగా మారాడని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఆగ్రహం వ్యక్తం చేశారు.

- వివరాలు 6లో▶

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు!

దీంతోపాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలు కూడా.. ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

- ఇప్పటివరకు నాలుగు పరీక్షలు రద్దు..
- మరో మూడు పరీక్షలపైనా కొనసాగుతున్న ఉత్కంఠ
- ఈ ఏడాది జూన్ 11న గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహిస్తామని ప్రకటన
- తర్వాత మెయిన్స్ పరీక్షలకు మరింత జాప్యం
- మిగతా పరీక్షల తేదీలను తిరిగి ఖరారు చేయని టీఎస్‌పీఎస్సీ
- మళ్లీ పరీక్షలకు సిద్ధమవడంపై అభ్యర్థుల్లో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) రద్దు చేసింది. దీనితో పాటు గత రెండు నెలల్లో నిర్వహించిన 'అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ)' పరీక్షలనూ రద్దు చేస్తున్నట్టు కమిషన్ శుక్రవారం ప్రకటించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదికపై శుక్రవారం కమిషన్ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. చైర్మన్, సభ్యులు, కార్యదర్శి పాల్గొన్న ఈ భేటీలో గ్రూప్-1 పరీక్షతో పాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలపై చర్చించి.. వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను మిగతా 2వ పేజీలో ▶



లీకేజీ కుట్ర బీజేపీదే!

- నిందితులంతా ఆ పార్టీ క్రియాశీల కార్యకర్తలే: మంత్రి కేటీఆర్ ఆరోపణ
- ఉద్యోగాలు భర్తీ అయితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసు
- బండి సంజయ్ వంటి మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని వ్యాఖ్య

- వివరాలు 2లో▶



గాంధీభవన్ వద్ద బల్మూరి వెంకట్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

లీకేజీ బాధ్యుడు కేటీఆరే!

బీఆర్ఎస్ సర్పంచ్ బిడ్డ కోసం పేపర్ లీక్ చేస్తారా: బండి
టీఎస్‌పీఎస్సీ ముట్టడికి యత్నం.. సంజయ్ అరెస్టు



గన్‌పార్కు వద్ద దీక్ష అనంతరం టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వెళ్తున్న బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు - 2లో

స్వప్నలోక్ మృతులకు రూ.5 లక్షలు

అండగా ఉంటామన్న సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాదంపై సీఎం కేసీఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలతో పాటు గాయపడిన వారికి కూడా ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రులు మహమూద్అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు కేసీఆర్ సూచించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరుస అగ్ని ప్రమాదాలు

టీపీసీసీ చీఫ్ రేవంత్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాద ఘటనలో ఆరుగురు యువత మృత్యువాత పడటం పట్ల శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దక్కన్‌మాల్‌లో జరిగిన ఘటన మరువకముందే మరో ఘటన జరగడం దారుణమని, ఎన్ని ఘటనలు జరిగినా ప్రభుత్వం మాత్రం నివారణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విశ్వనగరమని రాష్ట్ర మంత్రి కేటీఆర్ గొప్పలు చెప్పుకునేందుకే సరిపోతోందని, నగరంలో ప్రజలకు కనీస భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాద ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రేవంత్ కోరారు.

వరుస ఘటనలు కనిపించడం లేదా?

బండి సంజయ్ ధ్వజం



రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): హైదరాబాద్‌లో ఇటీవల జరుగుతున్న అగ్ని ప్రమాదాలు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు, మంత్రి కె.తారకరామారావుకు కనిపించడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజమెత్తారు. అగ్ని ప్రమాదం జరిగిన స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను శుక్రవారం బండి సంజయ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుర్ఘటనలు జరిగినపుడు ప్రభుత్వం స్పందిస్తోందని.. తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి నిర్లక్ష్య వైఖరిని చాటుకుంటోందని విమర్శించారు. వరుస ఘటనలతో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం బయటపడిందన్నారు. ఇటువంటి ఘటనలు జరగ్గానే నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. సికింద్రాబాద్ పరిసరాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్‌తో పాటు కార్పొరేటర్ కొంతం దీపిక, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, చీర శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ.6 లక్షల మేకపోతు!



సాక్షి, హైదరాబాద్: ఈ చిత్రంలో కనిపిస్తున్న మేకపోతు బరువు 110 కిలోలు, వయసు 3 ఏళ్లు. నల్లమచ్చ లేని ఈ జమునాపారి మేకపోతు రాజస్తాన్‌కు చెందినది. శంకర్ కిచర్ అనే రైతు పెంచుతున్న దీని విలువ అక్షరాలా రూ. 6 లక్షలు! ఉత్తరప్రదేశ్‌లోని మథుర సమీపంలో ఉన్న నేషనల్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ గోట్స్ (ఎన్ఎస్ఐఎఫ్ఆర్‌జీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేషనల్ గోట్ ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్'లో బరువు విభాగంలో ఈ మేకపోతు ప్రథమ బహుమతి పొందింది. దేశంలోని పలు ప్రాంతాల నుంచి గొర్రె, మేకపోతులు ఈ ప్రదర్శనకు భారీగా తరలివచ్చాయి. ఈ సందర్భంగా 'ఇండస్ట్రీ సైంటిస్ట్ ఫార్మర్స్ ఇంటర్‌ఫేస్' పేరిట నిర్వహించిన ఒకరోజు సదస్సుకు రాష్ట్రం నుంచి పలువురు గోట్‌ఫామ్స్ యజమానులు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలో జీవాల సంపద పెరిగినందున వాటిపై పరిశోధనల కోసం జాతీయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ డక్ట్‌లో షార్ట్ సర్క్యూట్

స్వప్నలోక్ అగ్నిప్రమాదానికి అదే కారణం

- అగ్నిమాపక శాఖ నిర్ధారణ.. నాలుగో ఫ్లోర్ వరకు లోలోపలే మంటలు
- ఐదో అంతస్తులో బయటకు.. ఆరు, ఏడు అంతస్తులకూ వ్యాప్తి
- భయంతో బయటకు రాకపోవడం వల్లే ఆరుగురు మృతి
- వీరంతా క్యూనెట్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులే
- అసోసియేషన్‌తోపాటు రెండు సంస్థలపై కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదానికి ఎలక్ట్రిక్ వైర్లకు సంబంధించిన డక్ట్‌లో షార్ట్ సర్క్యూటే కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు తేల్చారు. ఈ మంటలు ఐదో ఫ్లోర్‌లో బయటకు వచ్చి ఆరు, ఏడు అంతస్తులకు వ్యాపించినట్లుగా ఆధారాలు లభించాయి. ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురూ ఒకే కార్యాలయంలో పని చేస్తున్నారని, మంటలకు భయపడి బయటకు రాలేక ప్రాణాలు పోగొట్టుకున్నారని నిర్ధారించారు. శుక్రవారం పోలీసులు, క్లూస్‌టీమ్స్ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేసి ఆధారాలు సేకరించాయి. అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి కూడా ఘటనా స్థలాన్ని సందర్శించారు.



స్వప్నలోక్ కాంప్లెక్స్ నుంచి శుక్రవారం సైతం వెలువడుతున్న పొగలు

డక్ట్ నుంచి పైకి వ్యాప్తి..

ఎలక్ట్రిక్ వైర్ల డక్ట్‌లో మొదలైన మంటలు నాలుగో ఫ్లోర్ వరకు లోలోపలే విస్తరించాయి. ఐదో ఫ్లోర్‌లో డక్ట్ తెరిచి ఉండటంతో పక్కనే ఉన్న ఫ్లాట్ నం .510, 511ల్లో ఉన్న కేడియా ఇన్ఫోటెక్ లిమిటెడ్ అండ్ వికాస్ పేపర్ ఫ్లెక్సో ప్యాకింగ్ లిమిటెడ్, క్యూనెట్-విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు వ్యాపించాయి. ఆరు, ఏడు అంతస్తులకూ ఎగబాకాయి. ఇది దాదాపు రాత్రి 7.15 గంటల సమయంలో చోటు చేసుకుంది. క్యూ నెట్ కార్యాలయం నుంచి ఉద్యోగులు, టెలికాలర్లు ప్రతి రోజూ సాయంత్రం 6-7 గంటల ప్రాంతంలో వెళ్లిపోతారు. ఆ తర్వాత టీమ్ లీడర్లతో పాటు కొందరు మాత్రమే ఉంటారు. గురువారం రాత్రి అగ్నిప్రమాదం జరిగే సమయానికి అందులో దయాకర్, శ్రావణ్, పవన్ (రెస్క్యూ అయ్యారు)లతో పాటు శివ, త్రివేణి, వెన్నెల, ప్రమీల, శ్రావణి, ప్రశాంత్ (అసువులు బాశారు) ఉన్నారు. రాత్రి 7.30 గంటలకు కార్యాలయంలోకి పొగ రావడాన్ని గమనించిన మొదటి ముగ్గురూ వెనుక వైపు ఉన్న కిటికీ పగులకొట్టుకుని సజ్జపైకి దిగారు. అక్కడ నుంచే తమ ఉనికిని కింద ఉన్న అగ్నిమాపక, డీఆర్ఎఫ్ అధికారులకు తెలియజేసి ప్రాణాలు దక్కించుకున్నారు.

భయంతో బయటకు రాలేక..

మిగిలిన ఆరుగురూ భయంతో కార్యాలయం లోపలకు వరకు వెళ్లిపోయారు. దీనికి సమీపంలో ఉన్న ఒమెగా సంస్థను నిర్వహించే సుధీర్‌రెడ్డి ఈ విషయం గమనించారు. ధైర్యం చేసిన ఆయన క్యూనెట్ వరకు వెళ్లి అందులో ఉన్న వారిని తనతో రావాల్సిందిగా కోరారు. నలుగురు యువతులు ఆయనతో కలిసి కాస్త ముందుకు వచ్చినా.. అక్కడ దట్టమైన పొగ చూసి భయపడి మళ్లీ తమ కార్యాలయంలోకి వెళ్లిపోయారు. సుధీర్ మాత్రం భవనం బీ బ్లాక్ ముందు వైపునకు చేరుకుని అక్కడున్న ఖాళీ ప్రదేశంలో, పొగ ప్రభావం ఏమాత్రం లేనిచోట నిలబడ్డారు. సెల్‌ఫోన్‌లో లైట్ వెలిగించడం ద్వారా సహాయక సిబ్బంది గుర్తించేలా చేసి బయటపడ్డారు. క్యూ నెట్ కార్యాలయంలో ఉన్న నలుగురు యువతుల్లో ముగ్గురు బాత్‌రూమ్‌లోకి వెళ్లి పొగ రాకూడదనే ఉద్దేశంతో తలుపు వేసుకున్నారు. మరో యువతితో పాటు ఇద్దరు యువకులు ఆ సమీపంలోని గదిలో వేర్వేరు చోట్ల ఉండిపోయారు. అలా అక్కడే ఆగిపోయిన ఆరుగురు పొగ పీల్చుకోవడం వల్లే మరణించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

స్టెయిర్‌కేస్ గ్రిల్స్‌కు తాళం వేయడం వల్లే..

ఈ కాంప్లెక్స్‌లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలు కావట్లేదని, పైపులు ఉన్నా పని చేయట్లేదని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఇటీవలే నోటీసులు జారీ చేశామన్నారు. కాంప్లెక్స్‌కు లిఫ్ట్‌లు ఉండటంతో ఐదో అంతస్తులో ఫ్లోర్‌కు, మెట్లకు మధ్య ఉన్న ఇనుప గ్రిల్స్‌ను లాక్ చేసి ఉంచడం, అక్కడ సామాను పెట్టుకోవడం కూడా ఆరుగురు మృతి చెందడానికి ఓ కారణమైందన్నారు. ఇకపై కాంప్లెక్సుల్లో గ్రిల్స్‌కు ఇలా తాళాలు వేసి ఉంటే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

పలు సెక్షన్ల కింద కేసు

అగ్నిప్రమాదంపై కాంప్లెక్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ మహంకాళి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్వప్నలోక్ సూర్యకిరణ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అసోసియేషన్, కేడియా ఇన్ఫోటెక్ లిమిటెడ్ అండ్ వికాస్ పేపర్ ఫ్లెక్సో ప్యాకింగ్ లిమిటెడ్, క్యూ నెట్-విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలపై ఐపీసీలోని 304 పార్ట్ 2, 324, 420 సెక్షన్లతో పాటు పేలుడు పదార్థాల చట్టంలోని సెక్షన్ 9 (బి) కింద కేసు పెట్టిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆరు మృతదేహాలకు గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించారు.

క్యూ నెట్ వ్యవహారాలపై పూర్తిస్థాయి దర్యాప్తు

స్వప్నలోక్‌లో అగ్ని ప్రమాదం క్యూ-నెట్ దందాను మరోసారి తెరపైకి తెచ్చింది. ఈ ఘటనలో చనిపోయిన ఆరుగురూ ఈ సంస్థలో పనిచేస్తున్న వారిగా తేలింది. అయితే ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకే విక్రయించడం పేరుతో క్యూ నెట్ మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు తెరలేపడంపై గతంలో సీఐడీ సహా అనేక ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఇటీవలే మళ్లీ ఈ సంస్థ తమ కార్యకలాపాలు ప్రారంభించిందని, ప్రచారం కోసం సెలబ్రెటీలను వినియోగించుకుంటోందని ఈ స్కామ్‌ను వెలుగులోకి తెచ్చిన సీనియర్ ఐపీఎస్ వీసీ సజ్జనార్ ట్వీట్ చేయడం గమనార్హం. కాగా ప్రమాదానికి సంబంధించి క్యూ నెట్‌పైనా కేసు నమోదైన నేపథ్యంలో దీని వ్యవహారాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని మహంకాళి పోలీసులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

పేలుడు పదార్థాల చట్టం మొదటిసారి..

స్వప్నలోక్‌లో అగ్నిప్రమాదంపై మహంకాళి పోలీసులు ఐపీసీ 420తో పాటు పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు చేశారు. అగ్ని ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో ఇలాంటి సెక్షన్లు జోడించడం ఇదే ప్రథమం. అనుమతి లేకుండా గ్యాస్ సిలిండర్లు కలిగి ఉండటం, బాణసంచా నిల్వ చేయడం, పేలుడు పదార్థాలు, రసాయనాలు దాచి ఉంచడం వంటి వాటి వల్లా ఫైర్ యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి. స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోనూ ఇలాంటివి అక్రమంగా నిల్వ చేస్తే మోసం చేసినట్లే. ఈ కారణంగానే ఐపీసీ సెక్షన్ 420తో పాటు పేలుడు పదార్థాల చట్టంలోని సెక్షన్‌ను జోడించారు. ఈ కాంప్లెక్స్‌లో అనేక కార్యాలయాలతో పాటు గోదాములు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అగ్నిమాపక శాఖ, జీహెచ్ఎంసీతో పాటు క్లూస్ టీమ్ ఇచ్చే నివేదిక ఆధారంగా కేసులో తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

కార్ల పార్కింగ్‌తో సహాయ చర్యలు ఆలస్యం

అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక శకటాలు, బ్రోంటో స్కై లిఫ్ట్ వెహికల్ రాత్రి 8 గంటలకు అక్కడకు చేరుకున్నాయి. అయితే స్వప్నలోక్ చుట్టూ సరైన ఖాళీ లేకపోవడం, ఉన్న ప్రాంతంలోనూ కార్లు పార్క్ చేసి ఉండటంతో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించడం ఆలస్యమైంది. ఆ కార్లు తీయించి, ఉన్న దారిలో అడ్డంకులు దాటుకుంటూ ముందుకు వెళ్లి భవనం వెనుక ప్రాంతానికి చేరుకోవడానికి మరో అర్ధగంట పట్టింది.

మేం హెచ్చరించినా పట్టించుకోలేదు...

- అక్కడ ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ సక్రమంగా లేదని ఎన్నోసార్లు చెప్పాం
- ప్రమాద సమయంలో భవనంలోని ఫైర్ సేఫ్టీ పరికరాలు పనిచేయలేదు
- స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ప్రమాదంపై అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ సక్రమంగా లేదని గతంలోనే హెచ్చరించినా భవన నిర్వాహకులు పట్టించుకోలేదని అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఈ భవనంలో నిబంధనల ఉల్లంఘనలపై 2013లోనే యజమానులను విచారించినట్టు వెల్లడించారు. భవనం చుట్టూ సెట్‌బ్యాక్ (వాహనం తిరిగేంత స్థలం) ఉన్నా...ఆ ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసి ఉండడం వల్లనే ఫైర్ ఫైటింగ్ వాహనాలు వెళ్లడం కష్టమైందని వెల్లడించారు. ప్రమాద స్థలిని అగ్నిమాపకశాఖ అడిషనల్ డైరెక్టర్ జీవీ నారాయణరావు, డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌లతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడాక ప్రమాద వివరాలపై ఓ ప్రకటన విడుదల చేశారు.

షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం

గురువారం రాత్రి 7-20 గంటలకు ఫైర్ కాల్ వచ్చిన వెంటనే అగ్నిమాపకశాఖ సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకుని ఫైర్ ఫైటింగ్ ప్రారంభించారని డీజీ నాగిరెడ్డి తెలిపారు. మొత్తం 12 మందిని కాపాడగలిగామని, మరో ఆరుగురు పొగ కారణంగా మృతి చెందినట్టు తెలిపారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలిపారు. ''భవనంలో దాదాపు 400 షాప్‌కీపర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు... కానీ నిర్వహణ సరిగా జరగడం లేదు. ఐదో ఫ్లోర్‌లో ఎక్కువగా, ఏడో ఫ్లోర్‌లోనూ కొన్ని కార్యాలయాల్లో నష్టం వాటిల్లింది. గతంలోనూ జీహెచ్ఎంసీ సిబ్బందితోపాటు అగ్నిమాపకశాఖ సిబ్బంది కూడా భవనాన్ని తనిఖీ చేశారు. ఫైర్ ఫైటింగ్ సిస్టం సరిగా పెట్టుకోవాలని సూచించాం. కానీ వాళ్ల స్పందించే లోపే ఈ ప్రమాదం జరిగింది 'అని నాగిరెడ్డి పేర్కొన్నారు. డెక్కన్ మాల్‌లో అగ్ని ప్రమాదం అనంతరం అగ్నిమాపకశాఖ పరంగా యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించినట్టు చెప్పారు. ఇటీవల నిర్వహించిన సమీక్షలోనూ ఫైర్ ఆఫీసర్లు ప్రతి రోజూ వారి పరిధిలోని భవనాలు పరిశీలించి..అక్కడ ఏమైనా అగ్నిమాపక నియంత్రణ లోపాలుంటే వాటిని సరిచేసుకునేలా సూచనలు ఇవ్వాలని ఆదేశించినట్టు నాగిరెడ్డి వివరించారు.

జీవితంలో స్థిరపడేలోపే...

- యువతీయువకుల నిండు జీవితాన్ని మింగేసిన అగ్గి
- 'స్వప్నలోక్' అగ్ని ప్రమాద మృతుల్లో ఐదుగురు ఉమ్మడి వరంగల్ జిల్లావాసులే
- వారిలో ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు



ప్రశాంత్



జాటోతు ప్రమీల



శ్రావణి



శివ



వెన్నెల

సాక్షి, వరంగల్ /నర్సంపేట రూరల్ /ఖానాపూర్ / దుగ్గొండి/గూడూరు/కేసముద్రం: సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదుగురు అగ్నికి ఆహుతి అయ్యారు. వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురు.. శ్రావణి (22)...వెన్నెల (22), శివ(22) ఉండగా, మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు. ప్రశాంత్(23), ప్రమీల (23)) ఉన్నారు. మృత్యువాతపడిన ముగ్గురు యువతులకు త్వరలో పెళ్లి చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. కానీ తాము జీవితంలో స్థిరపడ్డాక చేసుకుంటామని తల్లిదండ్రులకు చెబుతూ వస్తున్నారు. ఇంతలోనే ఘోరం జరిగి అనంతలోకాలకు వెళ్లారు.

కట్నం ఖర్చులు.. సంపాదించిన తర్వాతే పెళ్లంది.. ఇంతలోపే

వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన బానోతు నరసింహ, పద్మ కుమార్తె బానోతు శ్రావణి (22) బీటెక్ పూర్తి చేసింది. ఆరు నెలల క్రితం స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఓ కంపెనీ కాల్ సెంటర్‌లో ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రులు హైదరాబాద్‌లోనే ఓ హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెళ్లి చేస్తామని తల్లిదండ్రులు అంటుండగా ఉద్యోగం చేసి తన కట్నం డబ్బులు సంపాదించి.. జీవితంలో సిరపడ్డాక చేసుకుంటానని చెబుతూ వచ్చింది. కానీ అగ్నిప్రమాదం శ్రావణిని మధ్యలోనే బలితీసుకుంది. కుటుంబానికి ఆసరాగా నిలుస్తుందనుకున్న త్రివేణి మృతితో ఖానాపురంలోని టేకుల తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వచ్చే ఏడాది పెళ్లి చేద్దామనుకున్నారు..

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన వంగ రవి, లక్ష్మి దంపతులు కుమార్తె వెన్నెల(22)కు వచ్చే ఏడాది పెళ్లి చేద్దామనుకున్నారు. డిగ్రీ వరకు చదివిన వెన్నల స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఈ కామర్స్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తోంది. వచ్చే ఏడాది మేనల్లుడికి వెన్నెలను ఇచ్చి పెళ్లి చేద్దామని అనుకున్నామని, అంతలోనే మాయమైపోయిందని తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

సంబంధాలు చూస్తున్నారు.. అంతలోనే.

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఎర్రకుంటతండా శివారు సురేష్‌నగర్‌కు చెందిన జాటోతు భద్రు, బుజ్జిల కూతురు ప్రమీల (23) స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని క్యూ నెట్ అనే కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఏడాదినుంచి కూతురును పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులు అడుగుతున్నారు. ఈ ఏడాది చేసుకుంటా అని చెప్పడంతో తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఘోరం జరిగిపోయింది.

నిన్ను చూడబుద్ధి అయితంది కొడుకా..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల రాజు, రజిత దంపతుల కుమారుడు శివ (22) మూడేళ్ల క్రితం మల్టిలెవల్ మార్కెటింగ్ (ఈకామర్స్ బిజినెస్)లో చేరాడు. ఉద్యోగం చేస్తూనే బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 15న చెల్లి సింధు బర్త్ డే కావడంతో సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పాడు. 'నిన్ను చూడబుద్ధి అయితంది బిడ్డా...జర వీడియో కాల్ చేయరాదూ' అని తల్లి రజిత అనడంతో కాస్త ఫ్రీ కాగానే చేస్తానని అన్న మాటలే చివరి పలుకులు అయ్యాయంటూ బోరున విలపించింది.

నెల క్రితమే ఉద్యోగంలో చేరిక..

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన అమరాజు జనార్దన్, ఉపేంద్రల కుమారుడు ప్రశాంత్(23) నెల క్రితమే రూ.2.60 లక్షలు ఇచ్చి స్వప్నలోక్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ప్రశాంత్ మరణవార్త తెలియడంతో తల్లిదండ్రులు విలపించారు. 'గురువారం సాయంత్రం ఫోన్ చేసి మాట్లాడాడు. రాత్రి పదింటికి మేము ఫోన్ చేస్తే కలవలేదు' అని తల్లి ఉపేంద్ర విలపిస్తూ చెప్పింది. కాగా, తన స్నేహితులు కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా, ప్రశాంత్ తన ఉద్యోగం వదిలిపెట్టి రెండునెలల పాటు, గ్రామంలోనే ఉంటూ, వారికి కోచింగ్ ఇచ్చాడని గుర్తు చేసుకున్నారు.



బిందాస్‌గా 100 ఏళ్లు

బ్లూ జోన్స్

ఎక్కడైనా మనుషులు సగటున 60-70 ఏళ్లు బతుకుతారు. కొందరైతే వందేళ్లూ పూర్తి చేసుకుంటారు. కానీ భూమ్మీద కొన్ని ప్రాంతాల్లో మాత్రం జనం మిగతా అన్ని చోట్ల కన్నా ఎక్కువ కాలం జీవిస్తారు. అవే 'బ్లూ జోన్స్'. మరి ప్రాంతాలేవి? ఎక్కువ కాలం బతకడానికి కారణాలేమిటి, వారి ఆహార అలవాట్లు ఏమిటో తెలుసుకుందామా..

– సాక్షి సెంట్రల్ డెస్క్



'ఆయుర్దాయం'పై అన్వేషణలో..

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసున్నవారు, ఆరోగ్యంగా ఎక్కువకాలం జీవిస్తున్న వారు ఉండే ప్రాంతాలను 'బ్లూ జోన్'లుగా పిలుస్తున్నారు. అమెరికాకు చెందిన అన్వేషకుడు, రచయిత డాన్ బ్యూట్నర్ ఈ పేరు పెట్టారు. ప్రపంచంలో ఎక్కువ ఆయుర్దాయం ఉన్న జన సమూహాలు, వాటి మధ్య పోలికలను గుర్తించేందుకు నేషనల్ జియోగ్రఫిక్ చానల్, ఇతర నిపుణులు నిర్వహించిన అన్వేషణ కార్యక్రమానికి డాన్ బ్యూట్నర్ నేతృత్వం వహించారు. తమ అధ్యయనంలో పలు 'బ్లూ జోన్'లను గుర్తించి ఆ వివరాలను నివేదికగా విడుదల చేశారు.

కనీసం.. పదేళ్లు ఎక్కువే..



అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న లోమా లిండా ప్రాంతం బ్లూజోన్లలో ఒకటి. ఇక్కడ నివసించే 'సెవంత్ డే అడ్వెంటిస్ట్స్' ఆధ్యాత్మిక బృందం సభ్యులు.. సగటు అమెరికన్ల కంటే కనీసం పదేళ్లు ఎక్కువకాలం జీవిస్తారు. పూర్తిగా శాకాహారులు. మద్యపానానికి దూరంగా ఉంటారు.

సింపుల్‌గా.. 90 ఏళ్లు..

కోస్టారికాలోని నికోయా ద్వీపకల్ప ప్రాంత ప్రజల్లో చాలా మంది 90 ఏళ్ల వరకు చలాకీగా బతికేస్తారు. ఆధ్యాత్మికత, కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ.. శారీరక శ్రమతో కూడిన జీవన శైలిని అనుసరిస్తారు. చికెన్, చేపలు, బీఫ్, బీన్స్, అన్నం ప్రధాన ఆహారం. అయితే రిఫైన్డ్, ప్రాసెస్ చేసిన ఫుడ్‌కు పూర్తి దూరంగా ఉంటారు.

ఆయుష్షులో.. మహిళామణులు

జపాన్‌లోని ఒకినావా ద్వీపం ప్రపంచంలో అత్యధికకాలం జీవించే మహిళలకు (వందేళ్లదాకా) కేంద్రం. జపాన్, అమెరికాలతో పోల్చితే.. ఒకినావా వాసులకు వృద్ధాప్యంతో వచ్చే సమస్యలు, గుండె జబ్బులు, కేన్సర్లు బాగా తక్కువ అని అధ్యయనాల్లో తేలింది.



ఆయుష్షులో.. 'మగా'నుభావులు..

ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలు/ప్రాంతాలతో పోల్చితే.. ఇటలీలోని సార్డీనియా ద్వీపంలో పురుషులు అత్యధిక కాలం (వందేళ్ల దాకా) జీవిస్తారు. చాలా వరకు శాకాహారం, ప్రకృతిలో మమేకమై, శారీరక శ్రమతో కూడిన జీవనశైలిని అనుసరిస్తారు.

సామాజిక జీవనం.. చిన్న కునుకు..

ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించే జనానికి గ్రీస్‌లోని ఇకారియా ద్వీపం కేరాఫ్ అడ్రస్. ఇక్కడ 90ఏళ్లు పైబడిన ప్రతి పది మందిలో ఆరుగురు ఇప్పటికీ వ్యవసాయం, వృత్తి పనులు చేస్తుంటారని అధ్యయనంలో గుర్తించారు. వీరిలోనూ శాకాహారం, శారీరక శ్రమ మామూలే అయినా.. బంధుమిత్రులతో కలసి గడిపే/పనిచేసే సామాజిక జీవనశైలి, మధ్యాహ్నం పూట చిన్నకునుకు తీసే అలవాటు ప్రత్యేకం.

'బ్లూజోన్'లలో దీర్ఘాయుష్షు వీటితోనే..



- బ్లూజోన్స్‌గా గుర్తించిన అన్ని ప్రాంతాల్లో కామన్‌గా కనిపించిన లక్షణం.. అంతా ఇంటి పనులు, ఇతర శారీరక శ్రమలో నిమగ్నమై ఉండటం.
- క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయడం.
- కుటుంబ బంధాలు, సామాజిక జీవనానికి, పెద్ద వయసు వారికి తోడుగా నిలవడానికి ప్రాధాన్యత. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం, మత సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనడం.
- మధ్యాహ్నం కాసేపు కునుకు తీయడం, ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవడం.
- మితంగా తినడం, వీలైనంత వరకు శాకాహారానికి పరిమితం కావడం, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండటం.
- కొన్ని బ్లూజోన్లలో వైన్ రూపంలో స్వల్ప స్థాయిలో మద్యం అలవాటు కూడా ఉంది.

కాళేశ్వరానికి జాతీయహోదాపై తప్పుడు ప్రచారం

కేంద్రం వాస్తవాలను వక్రీకరించిందంటూ ట్విట్టర్‌లో హరీశ్ మండిపాటు




సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా విషయమై పార్లమెంటు వేదికగా కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు చేసిన ప్రకటన ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన పంపలేదని కేంద్రమంత్రి ప్రకటించారని, వాస్తవానికి సీఎం కేసీఆర్‌తోపాటు గతంలో నీటిపారుదల శాఖ మంత్రి హోదాలో తాను అనేకమార్లు ప్రధాని మోదీ, జలశక్తి శాఖ మంత్రికి ఈ విషయమై వినతిపత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. వాస్తవాలను దాచిపెట్టి పార్లమెంటు వేదికగా కేంద్రమంత్రి చేసిన ప్రకటన సభతోపాటు ప్రజలను తప్పుదోవ పట్టించేదిగా ఉందన్నారు. గతంలో ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రాలు, లేఖలను హరీశ్‌రావు శుక్రవారం ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అన్ని రకాల అనుమతులు ఇచ్చిందని, కేంద్ర జలశక్తి శాఖకు చెందిన సాంకేతిక సలహా కమిటీ అనుమతులు కూడా లభించాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి కేసీఆర్ విజ్ఞప్తి చేసినా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశంపై 2018లో టీఆర్ఎస్ ఎంపీలు వేసిన ప్రశ్నలకు నాటి జలశక్తి మంత్రి నితిన్ గడ్కరీ స్పందిస్తూ సమీప భవిష్యత్తులో ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇచ్చే ఆలోచన కేంద్రానికి లేదని చెప్పారన్నారు. అయితే ఈ ప్రకటనకు విరుద్ధంగా బీజేపీ పాలిత రాష్ట్రాలైన కర్ణాటకలోని అప్పర్‌భద్ర, మధ్యప్రదేశ్‌లోని కెన్ బెట్వా ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తూ, కాళేశ్వరంపై తెలంగాణ ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టిందని పేర్కొన్నారు. కేడబ్ల్యుడీటీ-2 కేటాయింపులపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్న సమయంలోనే అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులు ఇచ్చిందని, అన్నిరకాల అనుమతులు ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును విస్మరించిందన్నారు.

ఆదుకుంటున్న ఆడబిడ్డ ఆవిరైంది..



త్రివేణి

నేలకొండపల్లి: స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదం నింపిన మరో విషాదమిది.. కూలీనాలీ చేస్తూ ఇద్దరు ఆడపిల్లలను చదివించిన ఆ కుటుంబానికి కొడుకులా అండగా నిలుస్తున్న త్రివేణి మంటల్లో కాలిపోయింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కుంచం రామారావు, వ్యవసాయ కూలీ రమణ దంపతులు. వీరికి త్రివేణి (22), మమత కుమార్తెలు. ఉన్నంతలో కుమార్తెలిద్దరినీ బాగా చదివించారు. త్రివేణి బీటెక్ పూర్తి చేశాక హైదరాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఓ కాల్ సెంటర్‌లో ఉద్యోగం సాధించింది. అదే కార్యాలయంలో ఆమె చెల్లెలు మమత కూడా ఉద్యోగం చేస్తోంది. గురువారం సాయంత్రం పని నిమిత్తం మమత కింది ఫ్లోర్‌కు రాగా.. అక్క వచ్చాక ఇద్దరూ వారుంటున్న రూమ్‌కి వెళ్లాలనుకున్నారు. ఇంతలోనే మంటలు వ్యాపించాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక మమత రోదిస్తూ అక్క త్రివేణికి ఫోన్ చేయగా తీయలేదు. చివరకు మంటలు, పొగలో చిక్కుకుని త్రివేణి కన్నుమూసినట్లు తెలియడంతో తల్లిదండ్రులకు చెప్పింది. మృతదేహాన్ని సుర్దేపల్లికి శుక్రవారం తీసుకొచ్చి కన్నీళ్ల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 356

శనివారం 18-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఒడిదుడుకులున్నా.. లాభాలే!
17,100 వద్ద నిఫ్టీ ముగింపు.. సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు.. - 15లో



హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా
సొంత డబ్బులతో 56 వేల హెల్మెట్లు పంచిన నోయిడా వాసి రాఘవేంద్ర - 13లో



మరో 5 రోజులు ఈడీ కస్టడీలోనే
ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా ఈడీ కస్టడీని కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది.
- వివరాలు 6లో▶



కూలిన కోల్డ్‌స్టోరేజీ.. 14 మంది మృతి
యూపీలోని సంభాల్ జిల్లాలో బంగాళదుంప నిల్వ చేసే ఒక కోల్డ్ స్టోరేజ్ పైకప్పు కుప్ప కూలిన ఘటనలో 14 మంది మరణించారు.
- వివరాలు 6లో▶



రాకూన్ డాగ్స్ నుంచి కరోనా !
గబ్బిలాల నుంచి కరోనా సంక్రమించిందన్న వార్తల నేపథ్యంలో తాజాగా ఈ వైరస్ శునకాల నుంచి వ్యాపించిందని పరిశోధనల్లో తేలింది.
- వివరాలు 6లో▶



రష్యాలో జిన్‌పింగ్ టూర్
రష్యా అధినేత పుతిన్ ఆహ్వానం మేరకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 20 నుంచి మూడు రోజులపాటు రష్యాలో పర్యటించనున్నారు.
- వివరాలు 6లో▶

రాష్ట్రానికి టెక్స్‌టైల్ పార్కు

దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లో ఏర్పాటుకు రంగం సిద్ధం.. వివరాలు వెల్లడించిన ప్రధాని నరేంద్ర మోదీ

కృతజ్ఞతలు తెలిపిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: తెలంగాణలో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. టెక్స్‌టైల్ రంగానికి మరింత ఊతం ఇచ్చేలా 5 ఎఫ్ (ఫార్మ్-ఫైబర్-ఫ్యాక్టరీ-ఫ్యాషన్-ఫారిన్) దృష్టితో దేశవ్యాప్తంగా ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులు నెలకొల్పనున్నట్లు మోదీ శుక్రవారం ట్వీట్‌లో తెలిపారు. తెలంగాణలో వరంగల్‌తో పాటు ఉత్తర్‌ప్రదేశ్ (లక్నో), మధ్యప్రదేశ్ (ధార్), మహారాష్ట్ర (అమరావతి), తమిళనాడు(విరుదునగర్), కర్ణాటక (కల్బుర్గి), గుజరాత్ (నవ్‌సారీ)ల్లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా ప్రత్యక్షంగా ఒక లక్ష ఉద్యోగాలతో పాటు, పరోక్షంగా 2 లక్షలమందికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉండనుంది. అంతేగాక ఒక్కో మెగా టెక్స్‌టైల్ పార్కు సుమారు రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందని కేంద్ర జౌళి శాఖ తెలిపింది. ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో



పనిచేసే స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు పనుల పర్యవేక్షణ జరుగనుంది.

మోదీ ఇచ్చిన మాట మేరకు..

లక్షలాదిమంది రైతులకు, చేనేత కార్మికులకు ఉపయోగపడటంతోపాటు, వేలాదిమంది యువతకు ఉద్యోగాలను అందించే మెగా టెక్స్‌టైల్ పార్కును తెలంగాణకు ప్రకటించటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పరేడ్ గ్రౌండ్స్‌లో మిగతా 7వ పేజీలో ▶

కాకతీయ మెగా టెక్స్‌టైల్‌కు ఊతం..

'ఫైబర్ టు ఫ్యాబ్రిక్' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ జిల్లాలోని గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని 1200 ఎకరాల్లో 'కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు'ను ఏర్పాటు చేసింది. 2017లో ఈ మెగా టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేసిన టీఎస్ఐఐసీ ద్వారా కొంత మేర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు కూడా జరిగాయి. అంతర్గత రహదారులు, విద్యుత్ తదితర వసతులను సమకూర్చడంతో యంగ్‌వన్, గణేశా ఈకో వంటి పెద్ద సంస్థలు తమ కార్యకలాపాలను కూడా ప్రారంభించాయి. అయితే దీనికి పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.897 కోట్లు ఇవ్వాలని గతంలో మంత్రి కేటీఆర్ పలు సందర్భాల్లో కేంద్రానికి లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో తాజాగా 'పీఎం మిత్ర' టెక్స్‌టైల్ పార్కు పథకంలో వరంగల్‌ను చేర్చడం ద్వారా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కొత్తగా కాలుష్య శుద్ధీకరణ ప్లాంటు, ఇతర మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతుందని పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ 'సాక్షి'కి వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో టీఎస్ఐఐసీ ద్వారా కొంత మేర వసతుల కల్పన జరిగిందన్నారు. ఇప్పుడు 'పీఎం మిత్ర' కింద ఎంత మేర నిధులు వస్తాయనే సమాచారం ఇంకా తమకు అందలేదన్నారు.

బీజేపీ ఖాతాలో టీచర్ ఎమ్మెల్సీ



- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం
- పార్టీ కార్యాలయంలో బీజేపీ నేతల సంబరాలు... పార్టీ అభ్యర్థికి ఓటేసిన టీచర్లకు బండి సంజయ్ సెల్యూట్
- చరిత్రాత్మక విజయంగా అభివర్ణించిన అమిత్ షా

- వివరాలు 8లో▶



ఢిల్లీలో ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

హామీలు అమలు చేయండి

ప్రధాని మోదీకి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వినతి -16లో

మోదీని గద్దె దించితేనే ప్రజాస్వామ్య పరిరక్షణ



- బీజేపీ ఓటమి కోసం ప్రగతిశీల శక్తుల ఏకీకరణ.. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- హనుమకొండ నుంచి మొదలైన పార్టీ జన చైతన్యయాత్రలు

8 లో

ఎకనమిక్ కారిడార్‌కు లైన్‌క్లియర్

- నాగ్‌పూర్-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ ప్రక్రియ వేగవంతం
- ఇప్పటికే తొలి ఆరు ప్యాకేజీలకు మార్గం సుగమం
- తాజాగా చివరి 3 ప్యాకేజీలకు ఎస్ఎఫ్‌సీ ఓకే.. నిధులు మంజూరు
- మంచిర్యాల నుంచి విజయవాడ వరకు పూర్తిగా కొత్త హైవే
- రెండున్నరేళ్లలో రెడీ అంటున్న ఎన్‌హెచ్ఏఐ - 7లో

అన్నదాతకు అందుబాటులో 'న్యాయం'



- దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు
- బమ్మెర పోతన గ్రామంలో ప్రారంభించనున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు
- రైతులకు అవసరమైన న్యాయ సహాయం అందించడమే ధ్యేయం.. వ్యవసాయ చట్టాలు, రైతుల హక్కులపై అవగాహన కల్పన కూడా..
- నల్సార్, లీఫ్స్, లీగల్ సర్వీసెస్‌ల సంయుక్త ఆధ్వర్యం

7 లో

క్లుప్తంగా...

దోషులను శిక్షించే వరకు యువతకు అండ: చుగ్



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో అసలు దోషులను శిక్షించే వరకు యువతకు అండగా ఉంటామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ స్పష్టం చేశారు. లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద నిరసన చేపట్టిన బీజేపీ నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు ఇతర నేతలను అరెస్టు చేసో లేదంటే ప్రజలపై దౌర్జన్యానికి పాల్పడో పేపర్ల లీకేజీ నుంచి బయటపడొచ్చని సీఎం కేసీఆర్ భావిస్తే అది అవివేకమవుతుందని హెచ్చరించారు. ఈ ప్రభుత్వ అసమర్థత వల్ల ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది యువకులు మోసపోయారన్న ఆవేదన ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

లీకేజీపై సీబీఐ విచారణ జరిపించాలి: షర్మిల

- ‘టీఎస్‌పీఎస్సీ’ ముట్టడి భగ్నం



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్.షర్మిల డిమాండ్ చేశారు. వైఎస్సార్‌టీపీ శుక్రవారం తలపెట్టిన టీఎస్‌పీఎస్సీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఉదయం లోటస్‌పాండ్‌లోని ఇంటివద్దనుంచి బయల్దేరిన షర్మిల వాహనాన్ని గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో షర్మిలకు పోలీసులతో వాగ్వాదం జరిగింది. కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ...పేపర్ లీకేజీలో బోర్డ్ చైర్మన్ దగ్గర నుంచి మంత్రుల స్థాయిలో హస్తం ఉందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ బోర్డ్ మొత్తాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కవిత కేసులపై ఉన్న శ్రద్ధ పేపర్ లీకేజీ మీద లేదన్నారు. సీఎం ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు.

సీబీఐ విచారణకు ఆదేశించండి: కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు అప్పగించాలని కోరుతూ కాంగ్రెస్ శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం సిట్‌కు ఈ కేసు అప్పగించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని టీఎస్‌పీఎస్సీలోనే ఈ స్కాం జరిగిందని, ఈ కేసును సిట్ అప్పగిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని పిటిషన్‌లో పేర్కొంది. ఈ మేరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సహా ఇద్దరు నిరుద్యోగులు పిటిషన్ దాఖలు చేశారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి: ఏబీవీపీ

సాక్షి, హైదరాబాద్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యతగా చైర్మన్ బి.జనార్దన్ రెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరింది. ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌ను విద్యార్థులు ముట్టడించారు. ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి కమల్ సురేశ్ మాట్లాడుతూ...ఇప్పటివరకు జరిగిన అన్ని పరీక్షలపైన సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లీకేజీపై ఇప్పటివరకు సీఎం స్పందించకపోవడం దారుణమని, లిక్కర్ కేసు నుంచి కవితను కాపాడే పనిని సీఎం కేసీఆర్ మానుకుని నిరుద్యోగుల గురించి ఆలోచించాలన్నారు.

సిరిసిల్లలో నిరుద్యోగి ఆత్మహత్య



సిరిసిల్లక్రైం: చదువుకు తగిన ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో సిరిసిల్లలో శుక్రవారం ఓ నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన చిటికెన నవీన్ (25) ఎంబీఏ హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశాడు. కొన్నాళ్లు సిరిసిల్లలోని మల్టీనేషనల్ డ్రెస్సుల కంపెనీలో పనిచేశాడు. అది తన చదువుకు తగిన ఉద్యోగం కాదని భావించి రాజీనామా చేశాడు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలోనే తనకు ఉద్యోగం రావడం కష్టమని భావించి, మనస్తాపంతో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నవీన్ ఆత్మహత్య చేసుకున్న గదిలో సూసైడ్ నోట్ లభించింది.

లీకేజీ కుట్ర బీజేపీదే..!

- నిందితులంతా ఆ పార్టీ క్రియాశీల కార్యకర్తలే: మంత్రి కేటీఆర్ ఆరోపణ
- ఉద్యోగాలు భర్తీ అయితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసు
- రాజకీయాల కోసం టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలను లీక్ చేయించింది
- లక్షల మంది నిరుద్యోగుల జీవితంతో చెలగాటం ఆడుతోంది
- బండి సంజయ్ వంటి మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని వ్యాఖ్య
- యువత భవిష్యత్తు దృష్టిలో పెట్టుకునే పరీక్షలు రద్దు చేసినట్టు వెల్లడి



స్వార్థం కోసమే చిచ్చు

“టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో నిందితులు బీజేపీ క్రియాశీల కార్యకర్తలనే విషయం విచారణలో తేలింది. రాజకీయాల కోసం లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను పణంగా పెట్టి ప్రశ్నపత్రాలను లీక్ చేయించిన కుట్ర ముమ్మాటికీ బీజేపీదే. శరవేగంగా చేపట్టిన ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తయితే రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతోనే ఈ దుర్మార్గానికి, నీచానికి పాల్పడింది. స్వార్థ రాజకీయాల కోసం సమాజంలో చిచ్చుపెట్టే అలవాటు బీజేపీకి కొత్త కాదు. ఈ అంశాన్ని సైతం శాంతిభద్రతల సమస్యగా మార్చే కుట్ర చేస్తోంది” – మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజీ వెనుక బీజేపీ కుట్ర ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఆరోపించారు. ఒక వ్యక్తి చేసిన తప్పును బూచిగా చూపించి మొత్తం టీఎస్‌పీఎస్సీనే రద్దు చేయాలన్న బీజేపీ అడ్డగోలు వాదన వెనుక రాష్ట్ర యువతను ఉద్యోగాలకు దూరం చేయాలన్న కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. రాజకీయాల కోసం యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న బండి సంజయ్ వంటి మోసగాళ్ల పట్ల రాష్ట్రంలోని యువతీ యువకులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన వ్యవస్థలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై కనీస పరిజ్ఞానం లేని బండి సంజయ్ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దిగజారుడు వాదనలు చేస్తున్నారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కేటీఆర్ వ్యాఖ్యానించారు. భూరికార్డుల ప్రక్షాళన, సమర్థ నిర్వహణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ధరణి పోర్టల్‌ను టీఎస్‌పీఎస్సీ అంశంతో ముడిపెట్టి తనపై అసత్య ఆరోపణలు చేయడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. గతంలో ఇంటర్ పరీక్షల విషయంలోనూ అర్థ రహిత, నిరాధార ఆరోపణలు చేసిన బండి సంజయ్‌కు.. పరువు నష్టం కేసు ఎదుర్కొంటున్నా బుద్ధి రావడం లేదని విమర్శించారు. సంజయ్ చేస్తున్న రాజకీయ కుట్రలకు రాబోయే రోజుల్లో క్రిమినల్ కేసులు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

కనీస పరిజ్ఞానం లేకుండా విమర్శలు

రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన స్వయం ప్రతిపత్తి సంస్థ టీఎస్‌పీఎస్సీలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర పరిమితమనే పరిజ్ఞానం కూడా లేని బండి సంజయ్ ఎంపీగా ఎలా పనిచేస్తున్నారో అర్థం కావడం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. “బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వందకుపైగా సందర్భాల్లో జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీలో బీజేపీ నేతలే ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్టు తేలింది. ప్రధాని మోదీ సీఎంగా పనిచేసిన గుజరాత్‌లో 8 ఏళ్లలో 13 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణాలు బయటపడ్డాయి. వాటిపై మోదీని బాధ్యుడిని చేసి రాజీనామాకు డిమాండ్ చేసే దమ్ము బండి సంజయ్‌కు ఉందా? మధ్యప్రదేశ్ వ్యాపం ఉద్యోగాల కుంభకోణంలో బీజేపీ పాత్ర దేశానికి తెలుసు. అదే విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రం మంత్రులు, సీఎంలను బాధ్యులను చేయడం.. బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. యువత పరీక్షలను పక్కనపెట్టి తనతో కలిసి రావాలని ప్రకటన చేసిన బండి సంజయ్ దగుల్బాజీ నాయకుడు” అని మండిపడ్డారు.

యువతను దృష్టిలో పెట్టుకుని..: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే ‘సిట్’ను ఏర్పాటు చేసి బాధ్యులను అరెస్టు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అర్హులకు అన్యాయం జరగకూడదని, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దుకు టీఎస్‌పీఎస్సీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించిన తీరు, పారదర్శక దర్యాప్తును పట్టించుకోకుండా.. ఈ అంశాన్ని స్వార్థ రాజకీయాలకు వాడుకోవాలనే దుర్మార్గమైన ప్రయత్నాన్ని బీజేపీ మానుకోవాలని హితవు పలికారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో ఒక్క నిరుద్యోగికి కూడా అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు.

గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

జూన్ 11వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. మిగతా పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

ఏడింటిలో నాలుగు పరీక్షలు రద్దు

రాష్ట్రంలో కొత్త జోనల్ విధానంఅమల్లోకి వచ్చాక.. టీఎస్‌పీఎస్సీ వివిధ ప్రభుత్వ శాఖల్లో 17 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి సంబంధించి 26 నోటిఫికేషన్లను జారీ చేసింది. అందులో భాగంగా ఇప్పటివరకు ఏడు అర్హత పరీక్షలను నిర్వహించింది. గతేడాది అక్టోబర్ 16న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలను.. నవంబర్ 7న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) విభాగంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్‌ఎస్‌ఓ) పరీక్షలను చేపట్టింది. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో విమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీపీఓ), అసిస్టెంట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఏసీడీపీఓ), వేర్‌హౌజ్ కార్పొరేషన్‌లో మేనేజర్ ఉద్యోగాలకు సంబంధించిన అర్హతపరీక్ష ఈ ఏడాది జనవరి 3న.. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (గ్రేడ్–2 సూపర్‌వైజర్) పరీక్షను జనవరి 8న నిర్వహించింది. వివిధ ఇంజనీరింగ్ శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగాలకు జనవరి 22న, ఆర్థిక శాఖలోని డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) ఉద్యోగాలకు ఫిబ్రవరి 26న, వివిధ ఇంజనీరింగ్ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు మార్చి 5న అర్హత పరీక్షలను నిర్వహించింది. వీటిలో ఇప్పటివరకు గ్రూప్–1 ప్రిలిమ్స్, ఏఈఈ, డీఏఓ, ఏఈ అర్హత పరీక్షలు రద్దయ్యాయి.

మిగతా మూడింటిపైనా సందేహాలు!

ప్రశ్నపత్రాల లీకేజీతో టీఎస్‌పీఎస్సీ నాలుగు పరీక్షలను రద్దు చేయగా.. మిగతా మూడు పరీక్షలపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కమిషన్ ముందే నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్.. చివరిగా నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షలు రద్దయ్యాయి. దీంతో వీటి మధ్యలో నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు చేయాలన్న డిమాండ్ వస్తోంది. ఈ మూడింటి ప్రశ్నపత్రాలు కూడా లీకై ఉంటాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్‌ఎస్‌ఓ), విమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డబ్ల్యూసీడీఓ), చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీపీఓ), అసిస్టెంట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏసీడీపీఓ), వేర్‌హౌజ్ కార్పొరేషన్‌లో మేనేజర్ ఉద్యోగాల పరీక్ష, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (గ్రేడ్–2 సూపర్‌వైజర్) పరీక్షల అంశంలో ఉత్కంఠ నెలకొంది. అయితే సిట్ ప్రాథమిక నివేదిక ఆధారంగా నాలుగు పరీక్షలను రద్దు చేశామని.. మిగతా పరీక్షల లీకేజీకి సంబంధించి ఎలాంటి ఆధారాలూ లేవని టీఎస్‌పీఎస్సీ వర్గాలు చెప్తున్నాయి. సిట్ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత వీటిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నాయి.

గ్రూప్–1 మెయిన్స్ వచ్చే ఏడాదే!

గ్రూప్–1 కేటగిరీలో 503 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ గతేడాది ఏప్రిల్‌లో ప్రకటన జారీ చేసింది. 3,80,081 మంది దరఖాస్తు చేసుకోగా.. అక్టోబర్ 16న 2,86,051 మంది ప్రిలిమ్స్ రాశారు. వీరిలో జోన్లు, రిజర్వేషన్లవారీగా మెయిన్స్ పరీక్షలకు 1:50 పద్ధతి (ఒక్కో పోస్టుకు 50 మంది)లో 20,050 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. అయితే పరీక్షల రద్దుతో అభ్యర్థులంతా తిరిగి సన్నద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రిలిమ్స్ రద్దుతో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల్లో తీవ్ర నిరుత్సాహం నెలకొనగా.. అర్హత సాధించనివారిలో మాత్రం ఆశలు చిగురిస్తున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది జూన్ 5 నుంచి 12వ తేదీ వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరగాల్సి ఉన్నా.. ప్రిలిమ్స్ రద్దుతో అవీ వాయిదా పడ్డాయి. గతేడాది ప్రిలిమ్స్ నిర్వహించిన తేదీ, మెయిన్స్ పరీక్షలకు ప్రకటించిన తేదీలను పరిశీలిస్తే.. దాదాపు ఎనిమిది నెలల వ్యవధి ఉంది. ఈ లెక్కన ఈ ఏడాది జూన్‌లో మళ్లీ ప్రిలిమ్స్ నిర్వహిస్తే.. మెయిన్స్ పరీక్షలు వచ్చే ఏడాదిలోనే నిర్వహించే పరిస్థితి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

లీకేజీ బాధ్యుడు కేటీఆరే!

- బీఆర్‌ఎస్ సర్పంచ్ బిడ్డ కోసం పేపర్ లీక్ చేస్తారా?: బండి సంజయ్
- టీఎస్‌పీఎస్సీలో గూడుపుఠాణి జరిగింది.. చైర్మన్, సభ్యులందరినీ తొలగించి ప్రాసిక్యూట్ చేయాలి
- ధరణి అక్రమాల్లోనూ కేటీఆర్ హస్తం
- ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్
- పేపర్ల లీకేజీపై గన్‌పార్కు వద్ద బీజేపీ నిరసన దీక్ష
- తర్వాత టీఎస్‌పీఎస్సీ ముట్టడికి యత్నం..
- అడ్డుకున్న పోలీసులు, లాఠీచార్జి.. సంజయ్ అరెస్టు

సాక్షి, హైదరాబాద్/నాంపల్లి (హైదరాబాద్): “టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీ వాస్తవం.. గూడుపుఠాణి జరిగిన మాట నిజం. బీఆర్‌ఎస్ సర్పంచ్ బిడ్డ కోసం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేస్తారా? దగుల్బాజీ రాజకీయాలు చేయడానికి సిగ్గుండాలి. నిరుద్యోగులు ఏళ్ల తరబడి సరైన తిండిలేక, వసతి లేక కోచింగ్ తీసుకుంటుంటే వాళ్ల జీవితాలను ఛిద్రం చేస్తారా? ఈ లీకేజీలో ఐటీ వైఫల్యం ఉంది. దీనికి బాధ్యుడు మంత్రి కేటీఆరే. కుంటి సాకులు చెప్పి ఈటల రాజేందర్‌ను బర్తరఫ్ చేసిన కేసీఆర్.. 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తు నాశనం అవడానికి ప్రధాన కారకుడైన కేటీఆర్‌ను ఎందుకు బర్తరఫ్ చేయడం లేదు? కేసీఆర్‌కు నీతి నిజాయితీ ఉంటే కొడుకు మెడలు పట్టి కేబినెట్ నుంచి తొలగించాలి..” అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. పేపర్ లీకేజీకి నిరసనగా శుక్రవారం హైదరాబాద్‌లో అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద బీజేపీ నిరసన దీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. కేసీఆర్ కొడుకు నిర్వాకం వల్లే పేపర్ లీకైందని.. ధరణి పోర్టల్ అక్రమాల్లోనూ కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులందరినీ తొలగించి ప్రాసిక్యూట్ చేయాలని.. మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

సిట్ విచారణ ఓ ఫార్స్..

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై సిట్ విచారణ ఓ ఫార్స్ అని.. కేసీఆర్ సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ అనడమే సిట్ పని అని బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. లక్షల మంది నిరుద్యోగులు, వాళ్ల కుటుంబాలు పేపర్ లీకేజీతో అల్లాడుతుంటే.. దొంగ సారా దందా చేసిన కవితను కాపాడుకునేందుకు కేబినెట్ అంతా ఢిల్లీ వెళ్లడం ఏమిటని మండిపడ్డారు. తెలంగాణ యువత, కార్మికులు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వారంతా బయటికి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు.

నిరుద్యోగుల కళ్లలో మట్టికొట్టారు: ఈటల

రాష్ట్రంలో ఎన్నో ఏళ్ల తర్వాత గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చారని.. కానీ బ్రోకర్లు పరీక్ష పేపర్లు అమ్ముకుంటే సీఎం కేసీఆర్ ఏం చేస్తున్నారని బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రశ్నించారు. గన్‌పార్క్ నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. కళ్లల్లో వత్తులు వేసుకుని, ఉద్యోగాల కోసం చదువుతున్నవారి కళ్లలో మట్టికొట్టారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నేడు గవర్నర్‌కు వినతి.. జిల్లా కేంద్రాల్లో నిరసనలు

గన్‌పార్క్ వద్ద లాఠీచార్జి, అరెస్టులకు నిరసనగా శనివారం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ శ్రేణులకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఇక లీకేజీ అంశంపై సంజయ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం శనివారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైకు వినతిపత్రం సమర్పించనుంది.



గన్‌పార్క్ వద్ద నిరసన దీక్షలో మాట్లాడుతున్న బండి సంజయ్

బీజేపీ ఆందోళన ఉద్రిక్తం

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బండి సంజయ్ ఆధ్వర్యంలో గన్‌పార్క్ వద్ద చేపట్టిన నిరసన దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. దీక్ష నేపథ్యంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అసెంబ్లీ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు తొలుత అడ్డుకునే ప్రయత్నం చేశారు. భారీ బందోబస్తుతో బారికేడ్లు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. కానీ శాంతియుతంగా దీక్ష చేపడతామని బండి సంజయ్ విజ్ఞప్తి చేయడంతో అనుమతించారు. సంజయ్, ఇతర నేతలు అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించి కాసేపు నిరసన దీక్ష చేపట్టారు. తర్వాత టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్తామని బండి సంజయ్ ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తమై అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ శ్రేణులు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఒక దశలో బీజేపీ శ్రేణుల కట్టడికి పోలీసులు లాఠీచార్జి చేశారు. సంజయ్, ఈటల రాజేందర్‌లను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లోకి ఎక్కించారు. వాహనాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను చెదరగొట్టారు. ఈ ఘటనల్లో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సైఫ్ ఉల్లాకు గాయాలయ్యాయి. కాగా.. సంజయ్, ఈటల అరెస్టులు, పార్టీ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జిని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ సోయం బాపురావు, సీనియర్ నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, విజయశాంతి, వివేక్ వెంకటస్వామి, గరికపాటి మోహన్‌రావు తదితరులు ఖండించారు.

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. ‘సాక్షి’ దిన పత్రిక ఆవిర్భవించింది. ‘సత్యమేవ జయతే..’ అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో ‘సాక్షి’ తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న: సాక్షి పత్రికను డిజైన్ చేసిన అంతర్జాతీయ నిపుణుడెవరు?
ఎ) గిల్బర్ మారియో బి) డేవిడ్ విన్సియా
సి) మారియట్ కార్లో డి) మారియో గార్షియా

గేట్లు ఎక్కి... గోడలు దూకి

- టీఎస్‌పీఎస్సీ ఘటనకు నిరసనగా ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ హంగామా
- గాంధీభవన్‌లో ‘నిరుద్యోగ అరిగోస’ పేరుతో భారీ ఆందోళన
- పెద్ద ఎత్తున హాజరైన యువకులు...
- నిరసన అనంతరం టీఎస్‌పీఎస్సీ ముట్టడికి యత్నం
- కార్యకర్తలు ఒక్కసారిగా దూసుకెళ్లే యత్నం
- అప్రమత్తమై అడ్డుకున్న పోలీసులు



‘నిరుద్యోగ అరిగోస’ కార్యక్రమంలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులకు కఠిన శిక్షలు విధించాలని, నిరుద్యోగులకు నష్టం జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలైన ఎన్‌ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్‌లు నానా హంగామా చేశాయి. శుక్రవారం ఈ రెండు విభాగాల ఆధ్వర్యంలో గాంధీభవన్ మెట్ల వద్ద ‘నిరుద్యోగ అరిగోస’పేరుతో ఆందోళన చేపట్టారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్రావు, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిల నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనకు ఆయా సంఘాల కార్యకర్తలు, నిరుద్యోగులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి జరిగిన ఈ ఆందోళన ముగిసిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కార్యకర్తలు ఒక్కసారిగా టీఎస్‌పీఎస్సీ ముట్టడికి బయలుదేరారు. అప్పటికే గాంధీభవన్ గేటు వద్ద పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు అప్రమత్తమై గాంధీభవన్ గేట్లు మూసివేసి, బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు వియ్ వాంట్ జస్టిస్ అని నినదిస్తూ గాంధీభవన్ గేట్లు ఎక్కి, గోడలు దూకి పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అతికష్టమ్మీద ఆందోళనకారులను పోలీసులు అదుపులోనికి తీసుకుని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వెంకట్రావు, శివసేనారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేంతవరకు వివిధ రూపాల్లో తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

టీఎస్‌పీఎస్సీ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి డిమాండ్

- సిట్‌తో న్యాయం జరగదు
- మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయండి
- సీఎంకు టీపీసీసీ చీఫ్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ కేసును సిట్‌తో విచారిస్తే న్యాయం జరగదని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ రాజ్యాంగబద్ధ సంస్థ అయినా చైర్మన్, సభ్యులను నియమించేది రాష్ట్ర ప్రభుత్వమే కనుక.. ప్రధాన బాధ్యత ముఖ్యమంత్రికి ఉంటుందన్నారు. లీకేజీల విషయంలో సాంకేతిక పరమైన లొసుగులున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఐటీ మంత్రి కేటీఆర్ కూడా దీనికి బాధ్యత వహించాలన్నారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కేసులో తీసుకోవాల్సిన చర్యల గురించి శుక్రవారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇంత భారీ కుంభకోణంతో రాష్ట్రం అతలాకుతలమవుతుంటే కనీసం సమీక్ష కూడా చేయలేదని ఆయన సీఎం కేసీఆర్‌ను ఆక్షేపించారు. ప్రతి అంశంపై ట్విట్టర్ ద్వారా స్పందించే ఐటీ మంత్రి తేలు కుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉదంతంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, బోర్డుపై చర్యలు తీసుకోవాలని, ఐటీ మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోవాలని చూస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని ఆ లేఖలో రేవంత్ హెచ్చరించారు.

పీఎఫ్‌ఐ కేసులో ఎన్‌ఐఏ అనుబంధ చార్జిషీట్

- మరో ఐదుగురిని నిందితులుగా చేర్చిన ఎన్‌ఐఏ

సాక్షి, హైదరాబాద్: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) నిజామాబాద్ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ ఎన్‌ఐఏ ప్రత్యేక న్యాయస్థానంలో గురువారం దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌లో ఎన్‌ఐఏ అధికారులు షేక్ రహీం అలియాస్ అబ్దుల్ రహీం, షేక్ వాహిద్ అలి అలియాస్ అబ్దుల్ వాహిద్ అలీ, జఫ్రుల్లాఖాన్ పటాన్, షేక్‌రియాజ్ అహ్మద్, అబ్దుల్ వారియర్స్‌లను ఈ చార్జిషీట్‌లో నిందితులుగా పేర్కొన్నారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 120 బీ, 153 ఏ, సెక్షన్ 13(1)(బీ) తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఉగ్రవాద, హింసాత్మక చర్యలకు పాల్పడేలా ఓ వర్గానికి చెందిన యువతకు పీఎఫ్‌ఐ శిక్షణ ఇస్తున్నట్టు లభించిన ఆధారాల మేరకు నిజామాబాద్ జిల్లా నాలుగోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2022 జూలై 4న తొలుత కేసు నమోదైన విషయం తెలిసిందే. ఉగ్రమూలాల నేపథ్యంలో ఆగస్టులో ఈ కేసు దర్యాప్తును ఎన్‌ఐఏకు అప్పగించారు. 2022 డిసెంబర్‌లో ఎన్‌ఐఏ వేసిన మొదటి చార్జిషీట్‌లో 11 మందిని నిందితులుగా పేర్కొన్నారు. తాజా అనుబంధ చార్జిషీట్‌లో మరో ఐదుగురిని నిందితులను చేర్చారు. ఈ ఐదుగురు నిందితులు శిక్షణ పొందిన పీఎఫ్‌ఐ క్యాడర్ అని, ఒక వర్గం యువతను రెచ్చగొట్టడం, రాడికలైజ్ చేయడం, వారిని పీఎఫ్‌ఐలోకి చేర్చుకోవడం, ఆయుధ శిక్షణ ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడినట్టు ఎన్‌ఐఏ అధికారులు వివరించారు.

సూత్రధారి రాజశేఖరే!

- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో కొత్త కోణాలు
- ముందస్తు ప్లాన్‌తోనే టీఎస్‌పీఎస్సీకి రాజశేఖర్ డిప్యుటేషన్
- కార్యదర్శి పీఏ కావడంతోనే ప్రవీణ్‌తో సాన్నిహిత్యం
- రాజశేఖర్‌తో కొందరు రాజకీయ నేతలకు సంబంధాలు
- మొత్తం ఐదు పరీక్షల పేపర్లు లీక్!
- టీఎస్‌పీఎస్సీకి ప్రాథమిక దర్యాప్తు నివేదిక అందించిన సిట్
- ఆరు రోజుల కస్టడీకి 9 మంది నిందితులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్ష పేపర్ల లీకేజీ స్కామ్‌లో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో కమిషన్ కార్యదర్శి వద్ద పీఏగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్ సూత్రధారి అని ఇప్పటివరకు భావించగా.. అతడిని పథకం ప్రకారం ప్రేరేపించినది రాజశేఖరేనని అధికారులు గుర్తించినట్టు తెలిసింది. రాజశేఖర్‌కు రాజకీయ సంబంధాలు సైతం ఉండటంతో.. ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం. ఇక లీకేజీ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం టీఎస్‌పీఎస్సీకి ప్రాథమిక నివేదికను అందించింది. మొత్తం ఐదు పరీక్షల పేపర్లు లీకైనట్టుగా గుర్తించినట్టు తెలిసింది.

ముందస్తు ప్లాన్‌తోనే..

రాజశేఖర్ టీఎస్‌టీఎస్ నుంచి టీఎస్‌పీఎస్సీకి డిప్యుటేషన్‌పై రావడంలోనూ కుట్ర ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. పేపర్లపై కన్నేసిన రాజశేఖర్.. లీకేజీ కోసం ముందుగా ప్లాన్ చేసుకునే వచ్చాడని.. కార్యదర్శికి ప్రవీణ్ పీఏగా మారిన తర్వాత ప్లాన్ అమలు చేశాడని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రవీణ్‌తో సన్నిహితంగా ఉన్నాడని అంటున్నారు. సిస్టమ్ అడ్మిన్ అయిన రాజశేఖరే కస్టోడియన్ శంకరలక్ష్మి కంప్యూటర్‌ను హ్యాక్ చేసి, పేపర్లు తస్కరించాడని.. వాటిని ప్రవీణ్‌కు ఇచ్చి రేణుకతో అమ్మించాడని అనుమానిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాన్నీ రాజశేఖర్ ఇలానే చేజిక్కించుకుని ప్రవీణ్‌కు ఇచ్చి ఉంటాడని.. దాని ఆధారంగా పరీక్ష రాయడంతోనే ప్రవీణ్‌కు 103 మార్కులు వచ్చి ఉంటాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రాజశేఖర్ పాత్ర కీలకం

పేపర్ల లీకేజీపై సిట్ అధికారి, ఏసీపీ వెంకటేశ్వర్లు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో రాజకీయ నాయకుడైన రాజశేఖర్ పాత్ర కీలకంగా మారనుందని.. అతడే ప్రవీణ్‌తో కలిసి ఈ లీకేజ్ చేసినట్టుగా ఆధారాలు లభించాయని తెలిపారు. రాజశేఖర్ కొందరు రాజకీయ నాయకులతో కలిసి దిగిన ఫొటోలు లభ్యమయ్యాయని.. ఈ నేపథ్యంలో ఆయా రాజకీయ నేతల పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇక కస్టోడియన్ శంకరలక్ష్మి కంప్యూటర్ నుంచి మొత్తం ఐదు పేపర్లు తస్కరణకు గురయ్యాయని.. వాటిలో ఏయే పేపర్లు లీక్ అయ్యాయనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పేపర్ వ్యవహారంతోపాటు, ఆ పరీక్ష రాసిన ప్రవీణ్‌కు అన్ని మార్కులు రావడంపైనా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రవీణ్ ఈ పరీక్ష పేపర్లను ఎవరెవరికి ఇచ్చాడన్నది ఆరా తీస్తున్నామ ని చెప్పారు. ప్రవీణ్, రాజశేఖర్ సహా నిందితుల ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని తెలిపారు.

పోలీసు కస్టడీకి నిందితులు

ఈ కేసులో అరెస్టయిన తొమ్మిది మంది నిందితులను పోలీసు కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం నుంచి 23వ తేదీ వరకు పోలీసులు వారిని ప్రశ్నించి.. ఈ వ్యవహారంలో అన్ని వివరాలను ఆరా తీయనున్నా రు. ఇదే సమయంలో ప్రవీణ్, రాజశేఖర్, శంకరలక్ష్మిలను కలిపి విచారించి.. వాస్తవాలను వెలికితీయాలని అధికారులు నిర్ణయించారు.

ఐడీ, పాస్‌వర్డ్ దొరికిందెలా?

కస్టోడియన్ శంకరలక్ష్మి నోట్‌బుక్ నుంచి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్స్ తస్కరించామని.. వాటి ఆధారంగానే ఆమె కంప్యూటర్‌ను యాక్సెస్ చేసి పరీక్ష పేపర్లు కాపీ చేసుకున్నామని అరెస్టు సమయంలో ప్రవీణ్, రాజశేఖర్ చెప్పారు. కానీ అధికారులు శంకరలక్ష్మిని ప్రశ్నించగా.. తాను యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను ఎక్కడా రాసుకోలేదని చెప్పినట్టు తెలిసింది. దీనితో ఆమె నుంచి అధికారికంగా స్టేట్‌మెంట్ తీసుకోవడానికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

రాజశేఖర్‌రెడ్డితో ఎలాంటి సంబంధం లేదు

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీక్ వ్యవహారంలో ప్రమేయం ఉందని చెబుతున్న రాజశేఖర్ రెడ్డితో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆ రాష్ట్ర కార్యదర్శి డా.ఎస్.ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది పార్టీలకు సంబంధించిన అంశం కాదన్నారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి దేవాలయాలకు వెళ్లినప్పుడు రాజశేఖర్ రెడ్డి అనే వ్యక్తి ఫొటో దిగాడని చెప్పారు. శుక్రవారం. ప్రకాశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ఎవరనేది ప్రభుత్వం తేల్చాలన్నారు.

‘లీకేజీ’లో సీఎం కుటుంబసభ్యుల హస్తం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తీవ్ర ఆరోపణలు
- నా దీక్ష ఫలితమే గ్రూప్–1 పరీక్ష రద్దు..
- నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి ప్రాణాలకు ప్రమాదం



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబసభ్యుల హస్తం ఉందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేయడంతోపాటు మాసబ్‌ట్యాంక్‌లో మీడియాతో మాట్లాడా రు. ఇప్పటి వరకు జరిగిన పరీక్ష పేపర్ల లీకేజీలో కవిత, హరీశ్‌రావు, కేటీఆర్‌కు సంబంధం ఉందన్నా రు. 30 లక్షల మంది నిరుద్యోగ యువతకు అన్యాయం చేసిన ద్రోహులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2016లో జరిగిన పరీక్షల పేపర్ లీకేజీలో కూడా కవిత హస్తం ఉందని ఆరోపించారు. పేపర్ లీకేజీ ఘటనలో నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిల ప్రాణాలకు ప్రమాదం ఉందని, వారిని రక్షించకపోతే ఇందులో ప్రమేయం ఉన్న పెద్దల విషయం బహిర్గతం కాదన్నారు.

ఆమరణ నిరహార దీక్ష ఫలితమే రద్దు..


తన ఆమరణ నిరహార దీక్ష ఫలితమే గ్రూప్–1 పరీ క్ష రద్దు అని ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం తమ పార్టీ కార్యాలయంలో దీక్ష చేపట్టగా పోలీసులు కార్యకర్తలపై దాడి చేసి, తలుపులు పగలగొట్టి తనను అరెస్టు చేశారని మండిపడ్డారు. అనంతరం ఇంటికి తీసు కొచ్చి గృహనిర్బంధంలో పెట్టగా, ఇంట్లోనే దీక్ష కొనసాగించడంతో ప్రభుత్వం దిగొచ్చి పరీక్షలు రద్దు చేసిందని తెలిపారు. పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సిట్ అధికారులు సీఎం దయాదాక్షిణ్యాలతో పనిచేస్తార ని, దాంతో నిజాలు బయటకు రావన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించాలని గవర్నర్, రాష్ట్రపతిని కలవనున్నట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ శంకరలక్ష్మిని కూడా విచారించాలని, కాన్ఫిడెన్షియల్ రూంలో ఉండే ఉద్యోగులందరినీ విచారించాలని డిమాండ్ చేశారు. పరీక్షలన్నింటినీ మళ్లీ నిర్వహించాలన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగుల కష్టాలను వదిలేసి, కవితను కాపాడేందుకు పాలకులు ఢిల్లీకి వెళ్లారని దుయ్యబట్టారు.

‘టీఎస్‌పీఎస్సీ వ్యవహారంపై సీబీఐకి ఫిర్యాదు చేస్తాం’

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్రంగా విచారించి దోషులను శిక్షించాలని కోరుతూ సీబీఐకి ఫిర్యాదు చేయనున్నట్టు తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. టీఎస్‌పీఎస్సీ మొదటి నుంచీ అవినీతి కార్యకలాపాల పుట్టగా పనిచేస్తోందని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో సిట్ దర్యాప్తుతో ప్రయోజనం ఉండదని, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో పాటు సభ్యులను వెంటనే పదవుల నుంచి తొలగించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగిన అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షల నిర్వహణలపై విచారణ జరపాలని..సీబీఐకి ఇవ్వనున్న ఫిర్యాదులో కోరనున్నట్టు తెలిపారు.

లీకేజీ బాధ్యత సీఎందే..

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ



చంచల్‌గూడ (హైదరాబాద్) : ప్రశ్నపత్రం లీకేజీలో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఉందని, ఇందుకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రం లీకేజీపై నిరసన తెలిపి జైల్లో ఉన్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ బృందాన్ని శుక్రవారం ఆమె ప్రత్యేక ములాఖత్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అవసరమైన వారికి పోటీ పరీక్ష ప్రశ్నపత్రాలను అందించి ఉద్యోగాల్లో చేర్పించారని ఆరోపించారు. ఢిల్లీలో హుషారుగా సమావేశాలు నిర్వహించిన కవిత, ఈడీ నోటీసులు రాగానే ఆరోగ్య సమస్యలున్నాయని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు.

సాక్షి

శనివారం, మార్చి, 18

గార్సెటీ సాధించేదేమిటి?

దౌత్యం గురించీ, దౌత్యవేత్తల గురించీ వ్యంగ్య వ్యాఖ్యలు ఎంతగా ప్రచారంలో ఉన్నా దేశాల మధ్య సంబంధాల్లో దౌత్యవేత్త పోషించే పాత్ర అత్యంత విలువైనది. అలా చూస్తే అమెరికా వంటి అగ్ర రాజ్యానికి మన దేశంలో గత 26 నెలలుగా పూర్తికాలం పనిచేసే రాయబారి లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అన్ని అవరోధాలూ అధిగమించి ఎరిక్ గార్సెటీ ఎట్టకేలకు ఈ పదవి స్వీకరించ బోతున్నారు. ఆయన విషయంలో సెనేట్‌లో అధికార, విపక్షాలమధ్య ఏకాభిప్రాయం కుదరక పోవటమే ఇంత జాప్యం చోటుచేసుకోవటానికి కారణం. సుదీర్ఘమైన ఈ ప్రక్రియ పొడవునా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పట్టుదలగా వ్యవహరించటం గార్సెటీకి కలిసొచ్చింది. స్వపక్షమైన డెమాక్రాటిక్ పార్టీనుంచి ముగ్గురు కట్టుదాటినా రిపబ్లికన్ పార్టీనుంచి ఏడుగురు ఆసరాగా నిలవడం తో 52–42 తేడాతో గార్సెటీ ఎంపిక ఆమోదం పొందింది. బైడెన్ తన మొండిపట్టు ద్వారా సెనేట్‌కు ఒక సందేశం పంపారు. తన ఎంపిక ఆమోదం పొందేవరకూ ఎంతకాలమైనా ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచుతానన్నది దాని సారాంశం. అమెరికాలో కీలక పదవుల ఎంపికంతా మనకు భిన్నం. అధికార పక్షం ఎంపిక చేసినవారిపై బహిరంగంగా చర్చ జరగటం, రకరకాల అభిప్రాయాలు వ్యక్తం కావటం సర్వసాధారణం. వచ్చిన ఆరోపణలకు అభ్యర్థి సంతృప్తికరంగా సమాధానాలివ్వలేకపోతే ఆ ఎంపిక వీగిపోతుంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయినా ఒకటే...రాయబారి అయినా ఒకటే. గార్సెటీపై వ్యక్తిగతంగా నేరుగా ఆరోపణలు లేవు. కానీ గతంలో ఒక పదవిలో ఉండగా తన సహాయకుడిగా ఉన్న వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు వచ్చినా దాన్ని ఆయన పట్టించుకోలేదన్నది ఆ ఆరోపణల సారాంశం. అప్పట్లో ఆ సంగతి తనకు తెలియనే తెలియదని గార్సెటీ వివరణనిచ్చారు. ఆయన గతంలో లాస్ ఏంజెలిస్ మేయర్‌గా పనిచేశారు.

ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో రాగల రోజులు దౌత్యపరంగా ఎంతో కీలకమైనవి. చైనాను కట్టడి చేయటం కోసం అమెరికా రూపకల్పన చేసిన ఇండో పసిఫిక్ దేశాల కూటమి క్వాడ్‌లో మన పాత్ర ప్రధానమైనది. ఒకపక్క ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. అక్కడ ఏ క్షణంలో ఏమవుతుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ ఉంది. రష్యానుంచి ముడి చమురుతోసహా దేన్నీ కొనుగోలు చేయొద్దని అమెరికా కోరినా మన దేశం దాన్ని పాటించటం లేదు. దీర్ఘకాల మిత్రదేశమైన రష్యాను కాదనటం మనకంత సులభమేమీ కాదు. రష్యాను ఆర్థికంగా కట్టడి చేయాలన్న అమెరికాకు ఇది మింగుడుపడటం లేదు. భారత్‌ను తన దారికి తెచ్చుకోవటం ఎలాగన్నదే దాని ఆత్రుత. గార్సెటీ రాయబారిగా ఉంటే ఇది సులభమవుతుందని ఆ దేశం భావిస్తోంది. అదీగాక ఈ వేసవిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటించబోతున్నారు. అలాగే సెప్టెంబర్‌లో ఇక్కడ జరగబోయే జీ–20 శిఖరాగ్ర సదస్సుకు బైడెన్ హాజరవుతున్నారు. ఇలాంటి తరుణంలో రాయబారి పదవి ఖాళీగా ఉండటం అమెరికా ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. వాస్తవానికి గార్సెటీకి దౌత్యరంగంలో పెద్దగా అనుభవం, నిపుణత లేవు. భారత్ వంటి కీలక దేశానికి అటువంటి వ్యక్తిని పంపటం సరైందికాదన్న విమర్శలు రిపబ్లికన్ శిబిరం నుంచి వినిపించాయి. అయితే బైడెన్‌కు ఆయన అత్యంత విశ్వసనీయుడు. ఉపాధ్యక్ష పదవికి పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్‌ను ఎంపిక చేసిన కమిటీకి నేతృత్వంవహించింది గార్సెటీయే. ఆ ఎంపిక అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్ ఘన విజయం సాధించటానికి బాటలు పరిచిందని చెప్పాలి.

రాయబారిగా తన ప్రాధాన్యతలేమిటో 2021 డిసెంబర్‌లోనే సెనేట్ ముందు గార్సెటీ వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే అమెరికా భద్రతకూ, కలిమికీ భారత్ తోడ్పాటు ఎంతో అవసరమని, దాన్ని తాను సాధించగలనని హామీ ఇచ్చారు. ఇండో పసిఫిక్ ప్రాంతం స్వేచ్ఛాయుతంగా ఉండాలన్న అమెరికా భావనతో భారత్‌కు ఏకీభావం ఉన్నదని, ఈ విషయంలో ద్వైపాక్షిక సంబంధాలు దృఢతరం కావటానికి అవసరమైన చొరవ తీసుకుంటానని గార్సెటీ వివరించారు. అలాగే భారత్‌కు బలమైన పొరుగుదేశంనుంచి ముప్పు ఉన్నందున దానికి అమెరికా అండగా నిలవటం ముఖ్యమని, ఈ విషయంలో తాను గట్టిగా కృషి చేస్తానన్నారు. పైగా 1990లో భారత్ పర్యటన తర్వాత హిందీ, ఉర్దూ అధ్యయనం చేయటం, ఇక్కడి సాంస్కృతిక, మత సంబంధ చరిత్ర గురించిన అవగాహన పెంచుకోవటం గార్సెటీకి అనుకూలాంశాలు. అమెరికాలో 40 లక్షలమంది భారతీయులున్నారు. రెండు లక్షలమంది అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్నారు. మరిన్ని లక్షల మంది వృత్తి ఉద్యోగాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల ప్రజల మధ్యా సాన్నిహిత్యం అవసరమని, దాన్ని తాను సాధించగలనని హామీ ఇచ్చారు. వీటితోపాటు మానవహక్కుల్ని గౌరవించటం, పటిష్ట ప్రజాస్వామిక సంస్థలు ఇరు దేశాల సంబంధాల్లో కీలకాంశాలని, భారత్‌తో వీటిపై తరచు చర్చిస్తానని కూడా చెప్పారు. ఇది సహజంగానే వివాదాస్పదం కావొచ్చు. ఈ పరిధిలోకి వచ్చే అంశాలేమిటో ఆయన చెప్పకపోయినా 370వ అధికరణ, నిఘా సంస్థల వ్యవహార శైలివంటివి అందులో భాగం కావొచ్చునన్న అనుమానాలున్నాయి. అదే జరిగితే మోదీ సర్కారు మౌనంగా ఏమీ ఉండ కపోవచ్చు. కనుక బాధ్యతల నిర్వహణ గార్సెటీకి అంత సులభమేమీ కాదనే చెప్పాలి. ఏదేమైనా అమెరికా అధ్యక్షుడికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి మన దేశానికి రాయబారిగా రావటం శుభసూచకం. ఇప్పుడున్న ద్వైపాక్షిక సంబంధాలు మరింత ఉన్నత స్థితికి చేరుకోవటానికి దోహద పడగల పరిణామం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.8.34 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** శ్రవణం రా.10.54 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.2.19 నుండి 3.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.12 నుండి 7.45 వరకు, **అమృతఘడియలు:** ప.12.54 నుండి 2.22 వరకు.

సూర్యోదయం : 6.11
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఏనుగుల గుసగుసలు విందామా?

విశ్లేషణ



ఆనంద బెనర్జీ

ఏనుగులు తరాలుగా తమ జన్యువుల్లోకి చేరిన ప్రాచీన అరణ్య మార్గాల ఆధారంగా తిరుగుతాయి. ఈ మార్గాల్లో ఎన్నో ఇప్పుడు జనావాసాలుగా మారిపోయాయి. ఫలితంగా వాటి కదలికలకు చిక్కు ఏర్పడుతోంది. ఏటా 40– 50 ఏనుగులు కరెంట్ షాక్ కారణంగా చనిపోతున్నాయని అంచనా. తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో విద్యుదాఘాతానికి మూడు ఏనుగులు బలైన వారానికే 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీకి అస్కార్ అవార్డు రావడం గమనార్హం. భారత వారసత్వ జంతువైన ఏనుగులను కాపాడుకునేందుకు ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నది ఈ డాక్యుమెంటరీ ఇచ్చిన సందేశం. 2010లోనే 'ఎలిఫెంట్ ఎక్స్‌పర్ట్ టాస్క్‌ఫోర్స్' సమర్పించిన కార్యాచరణ ప్రణాళికనూ కలిసికట్టుగా అమలు చేయాలి.

జంతువులేవైనా పసితనంలో అపురూపమైన ముగ్ధత్వాన్ని కలిగి ఉంటాయి. గున్న ఏనుగులైతే మరీనూ. ఒక అనాథ గున్న ఏనుగు కథ అందరినీ భావోద్వేగంతో కదిలించడంలో ఆశ్చర్యం లేదు. ఆ కథేమిటో చూడాలంటే కార్తికీ గోంజాల్వెజ్ తొలిసారి దర్శకత్వం వహించిన డాక్యుమెంటరీ 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' చూడాల్సిందే. ఆస్కార్ అవార్డు పొందిన ఈ చిన్న డాక్యుమెంటరీ ఓ అనాథ గున్న ఏనుగుకూ, వయసు మీదపడ్డ సంరక్షక దంపతులకూ మధ్య నడిచిన భావోద్వేగాల కథ. తమిళనాడు అటవీశాఖ నిర్వహిస్తున్న ఓ ఏనుగుల క్యాంపులో ఈ కథ నడుస్తుంది. తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో విద్యు దాఘాతానికి మూడు ఏనుగులు బలైన వారానికే ఈ డాక్యుమెంటరీకి అస్కార్ అవార్డు వచ్చింది. సోషల్ మీడియాలో పోస్ట్ అయినది చూస్తే అందులో రెండు గున్న ఏనుగులు తల్లి, పిన్నిల దగ్గర నిలుచుని ఆ ఘటనా స్థలాన్ని వీడేందుకు అస్సలు ఇష్టపడలేదు. ఇలాంటి హృదయ విదారకమైన దృశ్యాలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. పంట రక్షణ కోసం ఓ రైతు వేసుకున్న ముతక విద్యుత్తు కంచె (ఇది చట్ట వ్యతిరేకం) ఆ ఏనుగుల చావుకు కారణమైంది. సాధారణంగా ఏను గులు రాత్రుళ్లే గ్రామీణ జనావాసాలను దాటుతుంటాయి.

ఆ డాక్యుమెంటరీలో చూపిన గున్న ఏనుగు రఘు కూడా విద్యుదాఘాతం వల్లనే తల్లిదండ్రులను కోల్పోయాడు. బలహీనంగా ఉన్నాడన్న కారణంగా మంద వదిలేసింది. సకాలంలో తమిళనాడు అటవీ శాఖ ఆదుకోవడం రఘు చేసుకున్న అదృష్టం. ఈ అదృష్టం దక్కని ఏనుగు పిల్లలు బోలెడున్నాయి. డాక్యుమెంటరీలో చూపిన బెళ్లీ, బొమ్మన్ దంపతులు మధుమలై అటవీ ప్రాంతంలోని తెప్పకాడు ఏనుగుల క్యాంపులో పనిచేస్తున్నారు. వీరు ఏనుగులకు తర్ఫీదునిచ్చే కుట్టునాయకన్ తెగకు చెందినవారు.

ప్రాణాలు తీస్తున్న కరెంటు

'స్టెప్స్ అండ్ గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్' వ్యవస్థాపకుల్లో ఒకరైన సాగ్నిక్ సేన్ గుప్తా సమాచార హక్కు చట్టం కింద తెలుసుకున్న సమాచారం ప్రకారం, 2012–13 నుంచి 2022–23 మధ్యకాలంలో దేశం మొత్తమ్మీద 630 ఏనుగులు విద్యుదాఘాతాల కారణంగా మరణించాయి. అత్యధికంగా అసోం (120), ఒడిశా (106), తమిళనాడు (89) ఇందులో ఉన్నాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. కొంతమంది నిపుణుల అంచనాల ప్రకారం ఏటా కనీసం 40– 50 ఏనుగులు కరెంట్ షాక్ కారణంగా చనిపోతున్నాయి. 'నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్' మాజీ అధ్యక్షుడు బిశ్వజీత్ మొహంతి ఒడిశాలో ఏనుగుల ఊచకోతలు, విద్యుదాఘాతాలపై చాలాకాలంగా గళమెత్తుతున్నారు. 2019–22 మధ్యకాలంలోనే ఈ రాష్ట్రంలో 245 ఏనుగులు హతమైనట్లు స్వయంగా ఆ రాష్ట్ర మంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విషయం



ఇక్కడ గమనార్హం.

పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు దేశం మొత్తమ్మీద రాత్రిపూట వెలుగులు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని 'నాసా' తయారు చేసే 'నైట్ టైమ్ లూమినాసిటీ' మ్యాపులు చెబుతున్నాయి. 2021–22 ఎకనమిక్ సర్వే పదకొండవ ఛాప్టర్‌లో వెల్లడించిన ప్రకారం, రాత్రి పూట ప్రకాశం అనేది పదేళ్ల క్రితంతో పోలిస్తే 40 శాతం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో, సుదూర ప్రాంతాల్లో ఈ కృత్రిమ విద్యుత్తు వెలుగులు ఎక్కువైన కొద్దీ ప్రకృతికి జరిగే నష్టం కూడా అంతే పెరుగుతోంది. వేలాడే విద్యుత్తు తీగలు జీవజంతువులకు కలిగించే నష్టం దీనికి అదనం. ఈ అనవసర ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు ఇన్సులేషన్‌తో కూడిన విద్యుత్తు తీగలను వాడాలనీ, లేదా భూగర్భ కేబులింగ్‌ను ఉపయోగించాలనీ 2019లోనే 'నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్‌లైఫ్' సూచించింది.

దారి తప్పిస్తున్న పరిస్థితులు

వాస్తవానికి ఏనుగులను ఒకచోట బంధించి, లేదా నియంత్రించి ఉంచడం సాధ్యం కాదు. అవి సంచారజాతికి చెందిన భారీ జీవాలు. తరాలుగా తమ జన్యువుల్లోకి చేరిన ప్రాచీన అరణ్య మార్గాల ఆధారంగా తిరుగుతూంటాయి. ఈ మార్గాల్లో ఎన్నో ఇప్పుడు జనావాసాలుగా మారిపోయాయి. ఫలితంగా వాటి కదలికలకు చిక్కు ఏర్పడింది. ఏనుగుల్లాంటి భారీ క్షీరదాలను కాపాడుకోవాలంటే అడవుల మధ్య అనుసంధానత చాలా కీలకం. మన అభివృద్ధి పనుల కారణంగా అటవీ ప్రాంతాలు తగ్గిపోతూండటంతో సమస్యలేర్పడుతున్నాయి. గత నెలలో హరిద్వార్ ప్రాంతంలో ఏనుగుల మంద ఒకటి, పిల్ల ఏనుగులతో కలిసి కాంక్రీట్ జనారణ్యాన్ని దాటేందుకు నానా తిప్పలు పడటం ఓ వీడియోలో బంధితమైంది.

ఆసియా ఏనుగుల సంఖ్య దేశంలో సుమారు 27–30 వేల వరకూ ఉంటుందని అంచనా. అయితే అభయారణ్యాలు, జాతీయ పార్కుల్లో కంటే ఇతర ప్రాంతాల్లోనే చాలా ఏనుగులు ఉంటాయన్నది చాలామందికి తెలియదు. ఒక అంచనా ప్రకారం మొత్తం ఏనుగుల్లో సురక్షిత ప్రాంతాల బయట ఉన్నవి 70 – 80 శాతం. మనుషులు, ఏనుగుల మధ్య ఘర్షణ పెరుగుతూండటం; పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం, ఒడిశా, తమిళనాడుల్లో వీటి సంరక్షణ కీలకమైన స్థితికి చేరుకోవడం ఆందోళనకరమైన అంశమే.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఏనుగు తల ఉన్న వినాయకుడిని మనం ఇంట్లో పూజిస్తాం. కానీ అడవుల్లో నివసించే ఏనుగులంటే మాత్రం ప్రేమ చూపం. వాతావరణ మార్పుల కారణంగా సహజసిద్ధంగా అడవుల్లో లభించే తిండి కూడా తగ్గిపోవడంతో ఇవి మనిషి పండించే పంటలకు అలవాటు పడిపోతున్నాయి. ఈ అటవీ ఏనుగుల సమస్య పరిష్కారమెలాగో అధికారులకూ అంతుపట్టడం లేదు. కొంతమంది నిపుణుల అంచనాల ప్రకారం, అటవీ ఏనుగుల జనాభా కూడా పెరుగుతోంది. వీటికి కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టడం గురించిన సాధ్యాసాధ్యాలపై ఒకవైపు చర్చ నడుస్తూండగా, వాటిని వధించాలన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి.

కాగితాలకే పరిమితమైన సూచనలు

మనుషుల్లాగే ఏనుగులూ కుటుంబాలతో కూడి ఉంటాయి. సున్నితమైన మనస్తత్వంతో కూడిన తెలివైన జాతి అది. మనుషులతో ఘర్షణ సందర్భంలో విద్యుదాఘాతానికి గురై తల్లిదండ్రులను కోల్పోతే ఓ గున్న ఏనుగు ఎంత మానసిక ఇబ్బందికీ, ఆవేదనకూ గురవుతుందో ఊహించుకోవచ్చు. ఇలాంటి ఏనుగు పిల్లలు ప్రతికూల వాతావరణంలో పెరిగితే ఎదురయ్యే పరిణామాలను ఊహించడం కూడా కష్టమేమీ కాదు.

2010లో ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ 'గజ: సెక్యూరింగ్ ద ఫ్యూచర్ ఫర్ ఎలిఫెంట్స్ ఇన్ ఇండియా' పేరుతో ఒక నివేదికను సమర్పించింది. చాలా సలహా సూచనలు చేసింది కానీ ఆసియా ఏనుగును జాతీయ వారసత్వ జంతువుగా ప్రకటించడం ఒక్కటే అమల్లోకి వచ్చింది. తాజాగా ఏనుగుల ఆవాసాలున్న దేశాల నిపుణులు '11వ ఆసియన్ ఎలిఫెంట్ స్పెషలిస్ట్ గ్రూప్ మెంబర్స్' సమావేశాలు ఇండియాలో జరపనున్నారు. అలాగే ఏప్రిల్ 6, 7 తేదీల్లో కాజీరంగా నేషనల్ పార్క్‌లో బ్రహ్మాండమైన 'గజ్ ఉత్సవ్' నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏనుగుల సంరక్షణకు ఇవి సరిపోతాయా? 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీ ఇస్తున్న సందేశం, సంకేతం ఒక్కటే. వేర్వేరు ప్రభుత్వ విభాగాల మధ్య అత్యవసరంగా సమన్వయం కుదరాలి. కలిసికట్టుగా జాతీయ వారసత్వ జంతువైన ఏనుగును కాపాడుకునేందుకు టాస్క్‌ఫోర్స్ నివేదికలోని సలహా సూచనలు అమలు చేయాలి!

వ్యాసకర్త రచయిత, వైల్డ్‌లైఫ్ కన్సర్వేషనిస్ట్
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)



సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

విశ్వ వనిత



కల్పనా చావ్లా జయంతి (మార్చ్ 17) సందర్భంగా ఆమె జీవితాన్నీ, ఆమె ఇచ్చి వెళ్లిన అంతరిక్షస్థాయి స్ఫూర్తినీ వేడుకగా జరుపుకొందాం. పెద్ద కలల్ని కని, వాటిని సాకారం చేసుకున్న ధీశాలికి నిండు మనసుతో నివాళి.

– ఝులన్ గోస్వామి, క్రికెటర్

సర్వరోగ నివారిణి



ఆరోగ్యానికి కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర అవసరం. రాత్రి 10–11 గంటల మధ్య నిద్రకు ఉపక్రమించడం ముఖ్యం. అందరికీ ప్రపంచ నిద్ర దినోత్సవ (మార్చ్ 17) శుభాకాంక్షలు.

– వి. మోహన్, డయాబెటాలజిస్ట్

అలా ఉండాలి



రాహుల్ గాంధీ నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఏనాడూ మన దేశం గురించిన పశ్చిమ దేశాల విమర్శలకు విలువ ఇచ్చేవారు కాదు. ఆర్యభట్ట ప్రయోగం, పోఖ్రాన్ అణు పరీక్షలపై నోరెత్తిన దేశాల పట్ల కూడా ఆమె 'డోంట్ కేర్' అనే ధోరణితోనే వ్యవహరించారు.

– రాహుల్ శివశంకర్, సంపాదకుడు

పార్లమెంటేరియన్‌లు



మునుపు ఇలా ఉండేది కాదు. అంతా దేశ అభివృద్ధికి, ఐక్యతకు కలసి పని చేసేవారు. అధికార పార్టీ ఎంపీలు విపక్ష ఎంపీలను లంచ్‌కి, డిన్నర్‌కు పిలిచేవారు. సభ వెలుపల విభేదాలు పరిష్కారం అయ్యాక పార్లమెంటు నడిచేది.

– ప్రవేశ్ జైన్, కామెంటేటర్

మారిన సంబోధన



మీ అందరినీ ఉద్దేశించి ఎప్పటిలా నేను సంబోధించడం లేదని దయచేసి గమనించండి. మనం ఇప్పుడు లింగ వైవిధ్యం కలిగి ఉండి, సులభంగా మనస్తాపం చెందే దేశంలో జీవిస్తున్నాం కనుక నా 'గౌరవనీయ అతిథులారా...' 'ఇండియా టుడే' కాన్‌క్లేవ్ 20వ ఎడిషన్‌కు మీకు స్వాగతం.

– అరుణ్ పురీ, సంపాదకుడు

ఘరానా సందర్శన



ప్రధాన మంత్రి కార్యాలయ 'అడిషనల్ డైరెక్టర్' ఒకరు జమ్ము–కశ్మీర్‌ను సందర్శిస్తున్నారని తెలిసి ప్రొటోకాల్ ప్రకారం అతడికి పూర్తి భద్రతను కల్పించారు. అయితే అతడు కిరణ్ పటేల్ అనే మోసగాడు అని బయటపడింది. దాంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మన ఇంటెలిజెన్స్ విభాగానికి ఏమైంది?!

– యాసిర్ ముస్తాక్, జర్నలిస్ట్

అదంత ముఖ్యమా!



బడ్జెట్ సెషన్‌లో ఎంతో ముఖ్యమైన ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం పొందవలసిన పనిని ముందు పెట్టుకుని కూడా, క్షమాపణల కోసం (రాహుల్ గాంధీ కామెంట్‌ల విషయంలో) అధికారపక్షం పట్టుపట్టి కూర్చోవడం ఏమిటి! లేని సమస్యపై అనవసర రాద్ధాంతం చేస్తూ పార్లమెంటును స్తంభింపజేస్తున్నారు.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

'హరి అవతారమితడు...'

తన జీవిత కాలంలో ఏకంగా 32 వేల సంకీర్తనలను రచించి శ్రీవేంకటేశ్వర స్వామికి సమర్పించిన పరమ భక్తాగ్రేసరుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. 1408 మే 9వ తేదీన వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు నారాయణ సూరి, లక్కమాంబ దంపతులకు కడప జిల్లా రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు అన్నం అంటే పరబ్రహ్మ స్వరూపం అనే భావనతో 'అన్నమయ్య' అని పేరు పెట్టారు.

ఎనిమిదేళ్ల వయసులోనే అన్నమయ్యకు లౌకిక బంధాలపై విరక్తి కలిగింది. ఒకరోజు పొలంలో ఉన్న అన్న మయ్య... గోవింద నామం చేస్తూ తిరుమల వెళ్తున్న భక్తుల బృందాన్ని చూసి ఆకర్షితుడై వాళ్లతో కలిసి పోయాడు. తిరుమల కొండపైకి చేరిన అన్నమయ్య... స్వామి పుష్కరిణిలో స్నానం చేసి శ్రీవారి గుడిలో ప్రవేశించి శ్రీ వేంకటేశ్వరుని దివ్య మంగళ స్వరూపాన్ని చూసి తన్మయత్వంలో 'కంటి నఖిలాండకర్త నధికునిగంటి' అంటూ కీర్తించాడు. ఇక అప్పటి నుండి తిరుమల శ్రీవారి సంకీర్తనా కైంకర్యంలో మునిగి తేలిన అన్నమయ్యకు పదహారేళ్ళ వయసులోనే శ్రీనివాసుని దర్శనం కలిగిందంటారు.



అన్నమయ్య రాసిన 32వేల సంకీర్తనలలో మనకు అవన్నీ అందుబాటులో లేవు. లభ్యమైన వాటిల్లో భక్తి, వైరాగ్య, శృంగార కీర్తనలతో పాటు... లాలి పాటలు, జోల పాటలు, వెన్నెల పాటలు, గొబ్బిపాటలు, జాజర పాటలు, జానపదాలు ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో ఒకవైపు ఆధ్యాత్మిక దృష్టి, మరోవైపు సామాజిక దృష్టి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. సరళమైన పదాలతో, జన బాహుళ్యానికి అర్థమయ్యే రీతిలో కీర్తనలను రచించి పద కవితా ప్రక్రియకు సము న్నత స్థానం కల్పించాడు. ఆబాలగోపాలాన్ని అలరించేందుకు తన పదాలకు సంగీతాన్ని జోడించి వాగ్గేయకారుడయ్యాడు.

'ఏ కులజుడైన నేమి, ఎవ్వడైననేమి' వంటి కీర్తనలతో ఆరు శతాబ్దాల క్రితమే కులతత్వాన్ని ఘాటుగా నిరసించిన సంస్కర్త అన్నమయ్య. 'బ్రహ్మ మొక్కటే, పర బ్రహ్మమొక్కటే' అంటూ ఆనాడే సమతావాదాన్ని తన కీర్తనల ద్వారా చాటి చెప్పాడు.

ఆనంద నిలయుడైన శ్రీ వేంకటేశ్వరుని పూజలు, ఉత్సవాలు, ఊరేగింపులు, సేవలు, తీర్థాలు, యాత్రా విశేషాలు కళ్ళకు కట్టినట్టు తన కీర్తనల్లో వర్ణించాడు అన్నమయ్య. తన జీవితాన్నీ, సాహిత్యాన్నీ, సంగీతాన్నీ శ్రీవేంకటేశ్వరునికి అర్పించి నిస్వార్థంగా సార్థకమైన జీవితాన్ని గడిపిన అన్నమయ్య 1503వ సంవత్సరంలో శ్రీవారిలో ఐక్యమయ్యాడు. అందుకే అన్నమయ్యను 'హరి అవతారమితడు అన్న మయ్య' అంటూ కీర్తించాడు తాళ్ళపాక చిన్న తిరుమలాచార్యులు. అటువంటి పరమ భక్తాగ్రేసరుడు 'తాళ్ళపాక అన్నమాచార్యుల' వర్ధంతి సందర్భంగా ఆ మహా భాగవతోత్తమునికి శతసహస్ర వందనాలు.

– డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాసవర్మ, విశాఖపట్నం
మొబైల్: 98486 93373
(నేడు అన్నమయ్య 520వ వర్ధంతి)

నాటి 'సహకారా'న్ని పునరుద్ధరించాలి

విశ్లేషణ



సారంపల్లి మల్లారెడ్డి

సహకార రంగానిది భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కీలక పాత్ర. అటువంటి రంగంలో రాజకీయాలు ప్రవేశించి దాన్ని భ్రష్టు పట్టించాయి. సహకార చట్టం–1964ను పదే పదే మారుస్తూ ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకొని ఆ రంగాన్ని కుక్కలు చించిన విస్తరిలా చేసి దోపిడీకి గురిచేసింది. ఈ విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలకు సమాన వాటా ఉందని చెప్పాలి. అయితే కేంద్రం ఇటీవల సహకార వ్యవస్థలో ఉన్న లక్షల కోట్ల రూపాయలపై పట్టు సాధించి ఆ రంగాన్ని తన చెప్పు చేతల్లో ఉంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఇది గర్హనీయం.

నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్ని ఉత్పత్తి, అమ్మకం కార్యకలాపాలనూ సహకార రంగం కిందికి తీసుకొచ్చారు. గ్రామ స్థాయి నుండి అఖిల భారత స్థాయి వరకు సంఘాలను ఏర్పాటు చేశారు. రైతులకు రుణాలు ఇవ్వడమేగాక, వ్యవసాయోత్పత్తుల కొనుగోలు, ప్రాసెసింగ్, తిరిగి చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అందించడం లాంటి పనులు సహకారం రంగం ద్వారా చేశారు. ఈ రంగం కోట్లాదిమందికి ఉపాధి కల్పించింది. ఆ తరువాత సహకార వ్యవస్థను రాష్ట్రాలకు అప్పజెప్పడంతో అనేక రాష్ట్రాలు తమ రాజకీయ ప్రయోజనాలను ఆశించి 1964 చట్టానికి సవరణలు చేశాయి. 1995లో 'పరస్పర సహకార చట్టం' (మ్యాక్స్) తెచ్చి ప్రభుత్వం తాను నిర్వర్తించాల్సిన బాధ్యత నుండి తప్పుకుంది. 1964 చట్ట ప్రకారం ప్రభుత్వం ఆడిట్ నిర్వహించి లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకొనేది. 1995 చట్టం ప్రకారం ప్రభుత్వానికి అటువంటి బాధ్యత లేకపోవడంతో వేల కోట్లు లూటీ అయ్యాయి. ఈ చట్టం కింద అనేక బ్యాంకులు కూడా ఏర్పాటు చేశారు. 2019 సెప్టెంబర్ 23న పంజాబ్–మహారాష్ట్ర మల్టీస్టేట్ కోఆపరేటివ్ బ్యాంకులో రూ.11,167 కోట్లు దుర్వినియోగం జరిగింది. తెలంగాణలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. దేశంలో 540 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులలో కేరళ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లోని బ్యాంకులలో అవినీతి చోటుచేసుకొని వేల కోట్లు కాజేశారు.

డిపాజిటర్ల ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం సహకార చట్ట సవరణ చేసి రిజర్వుబ్యాంకు పర్యవేక్షణలోకి అన్ని సహకార బ్యాంకులను తెచ్చింది. ఈ రంగంపై పెత్తనం సాధించడం కోసం 'రైతుల ఉత్పత్తిదారుల సంఘా' (ఎఫ్‌పీఓ)లను 10 వేలు ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 1964 నుండి నేటి వరకు 35 సార్లు సహకార చట్టానికి సవరణ తెచ్చారు. చివరికి సహకార వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన అధీనంలోకి తీసుకునే స్థాయికి పరిస్థితి వచ్చింది.



తెలంగాణలో కుదించబడిన 907 ప్రాథమిక సేవ సహకార సంఘాల్లో 703 మాత్రమే పని చేస్తున్నాయి. అవి కూడా రైతులకు సరిపడిన సౌకర్యాలు కల్పించడం లేదు. 1995 చట్టం ప్రకారం 24.5 వేల సంఘాలు ఉన్నాయి. ఇవి రాజకీయ నాయకుల కంబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. 1964 చట్టాన్ని పునరుద్ధరించి దేశవ్యాప్తంగా సహకార సంఘాలను సరి చేయాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం సహకార వ్యవస్థపై కేంద్రీకరించి పారిశ్రామిక కార్మికులకు, ఇతర రంగాలలోని వ్యవక్తులకు ఉపయోగపడే విధంగా సహకార వ్యవస్థను అభివృద్ధి చేయాలి.

ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆడిట్ చేయాలి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 'బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్ట సవరణను' రద్దు చేయాలి. కేంద్ర ప్రభుత్వం వడ్డీమాఫీ నిధులను సహకార సంఘాలకు వర్తింపజేయాలి. జిల్లా స్థాయిలో తిరిగి డీసీఎంఎస్; తాలుకా, మండల స్థాయిలో సీఎంఎస్‌లు సంస్థలను పునరుద్ధరించి అన్ని నిత్యావసర సరుకులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా అమ్మకపు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. మార్కెఫెడ్ సంస్థల విధులను తిరిగి పునరుద్ధరించాలి.

సహకార వ్యవస్థ ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని సరుకులను నేరుగా ఉత్పత్తి చేసే కంపెనీల నుండి కొనుగోలు చేసి చౌక ధరలకు ప్రజలకు అందించాలి.. రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నాణ్యమైనవి అందించాలి. సహకార రంగాలపై ఉన్న అపనమ్మకాన్ని తొలగించే విధంగా బాధ్యత గలిగిన సంఘాలను, అధికారులను ఏర్పాటు చేయాలి. సహకార రంగంలోకి కార్పొరేట్ సంస్థల ప్రవేశాన్ని నిషేధించాలి. అప్పుడే సహకార రంగం పూర్వ వైభవాన్ని సంతరించుకొంటుంది.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు | 94900 98666



Reliance
Growth is Life
Reliance digital
PERSONALISING TECHNOLOGY
టెక్‌తో చేతులు
కలిపేటప్పుడు వచ్చే
సంతోషాలని ఆస్వాదించండి
#MakeFriendsWithTechnology
గొప్ప ఉగాది సేల్
10% వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్*
ICICI Bank
GET THE GREATEST OFFERS ON THE WIDEST TECH RANGE.
NEVER BEFORE PRICE
SMART UHD TV 109.22 CM (43)
₹19990
UHD ANDROID TV 139.7 CM (55)
₹73000 ₹29900*
*Price after cashback
QNED 4K SMART TV 55QNED81 139.7 CM (55)
₹119900 ₹75990*
SOUNDBAR PREMIUM DOLBY ATMOS
Starting from ₹24990*
SAMSUNG SONY
MacBook
Supercharged by the Apple M1/M2 chip
EMI Starting from ₹1790*
*Price Post Exchange Bonus, Student Offer, Bank Cashback
HP 15-EG2002TU
12th Gen Core i5
16 GB RAM - 512 GB SSD
Starting from ₹69990*
EMIs of ₹4999/-
BENEFITS : GET TROLLEY WORTH ₹7500/- AT ₹99/- & HP AIO PRINTER AT ₹499/-
iPhone 13
EMIs of ₹1830*
*Price post exchange value, bonus and cashback
NEW LAUNCH
SAMSUNG Galaxy S23 Series
₹79999
Starting from ₹66999*
*Price post Upgrade & Cashback
NEW LAUNCH
OPPO FindN2 Flip
Starting from ₹89999*
BENEFITS UPTO ₹5000 CASHBACK ON HDB FINANCE
FRONT LOAD
SAMSUNG 9 kg ₹34990*
IFB 6.5 kg ₹30990*
LG 9 kg ₹37490*
SIDE BY SIDE
KELVINATOR 584 L ₹57990*
SAMSUNG 653 L ₹90990*
LG 694 L ₹96990*
*Prices are after bank cashback.
DESERT COOLER
BAJAJ 55L ₹9999/-
KENSTAR 50L ₹10990/-
1.5T 3 STAR INVERTER AC
Starting from ₹27990*
EMIs of ₹1167*
HAIER INVERTER 1.5T HSU18C-TQB3BE1
EMIs of ₹2879*
FREE** Installation
LLOYD INVERTER 1.5T GLS18I3FWBBV
EMIs of ₹2959*
FREE** Installation
DAIKIN INVERTER 1.5T ATKL50U
EMIs of ₹3199*
LG SAC INVERTER 1.5T RS-Q19CNZE
EMIs of ₹3759*
GENERAL INVERTER 1.5T ASGA18CLWA
EMIs of ₹4239*
FREE** Installation
విస్తృత శ్రేణి | సరికొత్త టెక్నాలజీ | సులువైన ఫైనాన్స్ | వేగవంతమైన డెలివరీ మరియు ఇన్‌స్టలేషన్
Reliance resQ
పర్సనలైజ్డ్ గైడెన్స్ | సర్వీసు | నిర్వహణ 1800 889 1044
150+ టీవీలు | 100+ ల్యాప్‌టాప్స్ | 200+ స్మార్ట్‌ఫోన్స్ | 100+ వాషింగ్ మెషిన్లు | 80+ రిఫ్రిజిరేటర్లు & మరిన్ని
reliancedigital.in
Jio
NOW OPEN AT:
• NEXUS HYDERABAD MALL, LOWER GROUND FLOOR
VISIT US AT HYDERABAD: • NEXUS HYDERABAD MALL, LOWER GROUND FLOOR • MIYAPUR, OPP. K.S. BAKERS, NEAR MIYAPUR X ROAD • KONDAPUR X ROADS, BESIDE RATNADEEP SUPER MARKET • TOLICHOWKI, NEXT TO RELIANCE SMART BUILDING • NAGOLE, KINARA GRAND BUILDING, NEAR ALKAPURI X ROAD, OPP. GREEN HONDA CAR SHOWROOM • DILSHUKNAGAR, PILLAR NO: 1521, OPP.TO IDEAL JR.COLLEGE, VIJAYA DIAGNOSTICS LANE • GOWLIDODDY, Q CITY ROAD, BESIDE APARNA SHANGRILLA • NALLAGANDALA, TOWARDS CITIZEN HOSPITAL ROAD • MADINAGUDA, BESIDE HYUNDAI SHOWROOM • KUKATPALLY, OPP BJP OFFICE • BALANAGAR, A2A CENTRAL, OPP IDPL WATER TANK • NSL MALL, KPHB PHASE 5 • INORBIT MALL, LOWER GROUND FLOOR • KONDAPUR, SARATH CITY CAPITAL MALL • GACHIBOWLI, RELIANCE SMART BUILDING • ATTAPUR, BESIDE SOUTHINDIA SHOPPING MALL • SUN CITY, OPP HP PETROL PUMP • BANJARA HILLS, ROAD NO 12, BESIDE OHRIS • S R NAGAR, BESIDE METRO STATION • PUNJAGUTTA, BESIDE HYDERABAD CENTRAL • SECUNDRABAD,SD ROAD, BESIDE BASERAA HOTEL • EAST MARREDPALLY, NEAR GEETHA NURSING HOME • VIKRAMPURI, NEXT TO VACS BAKERY • SUCHITRA, SWAGATH GRAND BUILDING • ASRAO NAGAR, BESIDE PARIWAR RESTAURANT • NAGARAM, BESIDE SHIVALAYAM TEMPLE • NACHARAM, OPP TO ESI HOSPITAL • SHIVAM ROAD, SURABHI GRAND BUILDING • KACHIGUDA, BESIDE BALAJI RATANLAL SWEET HOUSE • HIMAYAT NAGAR, MPM MALL • MALAKPET, BESIDE MALAKPET GUNJ • SANTOSH NAGAR, NEAR IS SADAN X ROADS • RK PURAM: NEAR VICTORIA MEMORIAL METRO STATION • KOTHAPET: OPP PVT MARKET • HASTINAPURAM, NEAR TRAFFIC SIGNALS • VANASTHALIPURAM, BESIDE MANGALAYA SHOPPING MALL • UPPAL, HEMA DURGA MALL • RAMANTHAPUR, NEAR DOORDARSHAN. • NARAPALLY, MJR MALL • SIDDIPET: OPP GOVT HIGH SCHOOL, MOHINPURA STREET, MEDAK ROAD | TO LOCATE YOUR NEAREST MYJIO STORE, SMS LOCATE <PINCODE> TO 561611

క్లుప్తంగా...

మళ్లీ తెరపైకి జమిలి ఎన్నికల అంశం

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాధనాన్ని భారీగా ఆదా చేయవచ్చునని శుక్రవారం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో చెప్పింది. జమిలి ఎన్నికలనే భారీ కసరత్తుని ప్రారంభించడానికి ముందు చేయాల్సిన అత్యవసర పనులైన అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకురావడం, రాజ్యాంగాన్ని సవరించడం వంటి ఎలాంటి చర్యలు చేపట్టాలో ఒక జాబితా రూపొందించినట్టు తెలిపింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానమిస్తూ జమిలి ఎన్నికల అంశాన్ని పార్లమెంటరీ ప్యానెల్ క్షుణ్ణంగా పరిశీలించిందని అన్నారు. ఎన్నికల కమిషన్ సహా వివిధ వర్గాలను సంప్రదించి కొన్ని సిఫారసులు చేసిందని తెలిపారు. జమిలి ఎన్నికలు కార్యరూపం దాల్చడం కోసం ఒక మార్గదర్శ ప్రణాళికను రూపొందించడానికి లా కమిషన్ ప్రస్తుతం కసరత్తు చేస్తోందని వివరించారు.

పుతిన్‌పై ఐసీసీ అరెస్టు వారెంట్

ద హేగ్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) శుక్రవారం వెల్లడించింది. ఉక్రెయిన్‌లో పిల్లలను అపహరించిన ఘటనల్లో ఆయన ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో యుద్ధనేరాలకు పాల్పడినట్లు గుర్తిస్తూ ఈ వారెంట్ జారీ చేసినట్లు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పిల్లలను ఇలా చట్టవిరుద్ధంగా మరో దేశానికి తరలించడం యుద్ధనేరమేనని పేర్కొంది. రష్యన్ ఫెడరేషన్ అధ్యక్షుడి కార్యాలయంలో పిల్లల హక్కుల కమిషనర్‌గా పని చేస్తున్న మారియా అలెక్సేయేవ్‌నాను సైతం అరెస్టు చేయాలంటూ ఐసీసీ వారెంట్ జారీ చేసింది.

నేపాల్ ఉపాధ్యక్షుడిగా రాంసహాయ్ యాదవ్

కఠ్మాండు: నేపాల్ ఉపాధ్యక్షుడిగా భారత సంతతికి చెందిన రాంసహాయ్ ప్రసాద్ యాదవ్(52) ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 8 పార్టీలతో కూడిన అధికార కూటమి అభ్యర్థి యాదవ్, సీపీఎన్‌-యూఎంఎల్ బలపరిచిన సమీప ప్రత్యర్థి అష్టలక్ష్మీ శాక్యను ఓడించారు. 2008లో నేపాల్ రిపబ్లిక్‌గా అవతరించాక మూడో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన యాదవ్, ప్రస్తుత ఉపాధ్యక్షుడు నంద బహదూర్ పున్ స్థానంలో బాధ్యతలు చేపడతారు. నేపాల్ దక్షిణ ప్రాంతంలోని మాధేష్‌లో మెజారిటీ ప్రజలు భారత సంతతి వారే. మాధేషీలకు ప్రత్యేక హక్కుల కోసం 2007లో ఎగసిన ఉద్యమంలో యాదవ్ చురుకై న పాత్ర పోషించారు.

పార్టీల ఎజెండాలదే పైచేయి

- వరుసగా ఐదో రోజూ స్తంభించిన లోక్‌సభ, రాజ్యసభ
- పట్టువీడని అధికార, విపక్ష సభ్యులు
- రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ ఎంపీలు
- అదానీపై జేపీసీ ఏర్పాటు చేయాలన్న విపక్షాలు
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా



గాంధీ విగ్రహం వద్ద విపక్షాల ధర్నా

అదానీ వ్యవహారంపై నరేంద్ర మోదీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రతిపక్ష నేతలు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద ఉమ్మడిగా ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదానీ అంశంపై విచారణకు జేపీసీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. పార్లమెంట్ ఉభయసభలు వాయిదా పడిన తర్వాత జరిగిన ఈ ధర్నాలో కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు డీఎంకే, ఆప్, శివసేన(యూబీటీ), జేఎంఎం, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ధర్నా కంటే ముందు ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో భేటీ అయ్యారు. ప్రభుత్వంపై ఉమ్మడిగా నిరసన తెలపాలని నిర్ణయించారు. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలని ఖర్గే ట్విట్టర్‌లో కోరారు.

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిష్టంభనకు తెరపడడం లేదు. అధికార, ప్రతిపక్షాలు మెట్టు దిగకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభలో కార్యకలాపాలు స్తంభిస్తున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు పునఃప్రారంభమైనప్పటి నుంచీ ఇదే పరిస్థితి. వరుసగా ఐదో రోజు శుక్రవారం సైతం అరుపులు కేకలతో ఉభయసభలు దద్దరిల్లాయి. భారత ప్రజాస్వామ్యాన్ని విదేశీ గడ్డపై కించపర్చిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ సభ్యులు, అదానీ ఉదంతంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ చేశారు. ఎవరూ పట్టు వీడకపోవడంతో అర్థవంతమైన చర్చలకు తావు లేకుండా పోయింది. అధికార, ప్రతిపక్షాల అజెండాలదే పైచేయిగా మారింది. దాంతో మరో దారిలేక ఉభయ సభలను సభాపతులు సోమవారానికి వాయిదా వేయాల్సి వచ్చింది. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13న పునఃప్రారంభమైన సంగతి తెలిసిందే. గత ఐదురోజులుగా లోక్‌సభ, రాజ్యసభలో కార్యకలాపాలేవీ సాగలేదు.

స్పీకర్ విజ్ఞప్తి బేఖాతర్

లోక్‌సభ శుక్రవారం ఉదయం ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి ప్రవేశించారు. తమ పార్టీ నేత రాహుల్ గాంధీకి సభలో మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బిగ్గరగా నినాదాలు మొదలుపెట్టారు. అదానీ గ్రూప్ అక్రమాలపై విచారణ కోసం ప్రభుత్వం జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. అధికార బీజేపీ సభ్యులు తమ సీట్ల వద్దే లేచి నిల్చున్నారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు ప్రారంభించారు. దాంతో దాదాపు 20 నిమిషాలపాటు సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సభకు సహకరించాలంటూ స్పీకర్ ఓం బిర్లా పదేపదే కోరినప్పటికీ ఎవరూ శాంతించలేదు. అలజడి సృష్టించడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపించలేదు, అందరికీ మాట్లాడే అవకాశం ఇస్తా, సభ సజావుగా నడిచేందుకు సహకరించాలి అని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. సభ్యులెవరూ వినిపించుకోకపోవడంతో సభను ఈ నెల 20వ తేదీ వరకూ వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

రాజ్యసభలోనూ అదే పునరావృతం

ఎగువ సభలోనూ గందరగోళం కొనసాగింది. కార్యకలాపాలేవీ సాగకుండానే సభ సోమవారానికి వాయిదా పడింది. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలని విపక్ష సభ్యులు కోరగా, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఇరుపక్షాల ఎంపీలు నినాదాలతో హోరెత్తించారు. రూల్ 267 కింద 11 వాయిదా తీర్మానాల నోటీసులు వచ్చాయని, వాటిని అనుమతించడం లేదని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. సభలో తాను మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కోరగా, చైర్మన్ నిరాకరించారు. అధికార, విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగిస్తుండడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. అంతకంటే ముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ సభలో ఒక ప్రకటన చేశారు. ఈ నెల 20 నుంచి రాజ్యసభలో వివిధ కీలక శాఖల పనితీరుపై చర్చించనున్నట్లు తెలిపారు.

అదొక కొత్త టెక్నిక్: థరూర్

సంసద్ టీవీలో సౌండ్‌ను మ్యూట్ చేయడం ఒక కొత్త టెక్నిక్ అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఎద్దేవా చేశారు. సభలో ఇకపై ఒక్కో సభ్యుడి మైక్రోఫోన్‌ను ఆపేయాల్సిన అవసరం లేదని, ప్రత్యక్ష ప్రసారంలో శబ్దాలను మ్యూట్ చేస్తే సరిపోతుందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. లోక్‌సభలో తమ పార్టీ సభ్యుల గొంతు నొక్కేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు. సభలో వారు చేసిన నినాదాలు ప్రత్యక్ష ప్రసారంలో వినిపించకుండా చేశారని విమర్శించారు. అయితే, సాంకేతిక సమస్యల వల్లే సభ్యుల నినాదాలు వినిపించలేదని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి.

మోదీ, అదానీ బంధమేంటి?: ప్రియాంక

ప్రధాని మోదీకి, అదానీకి మధ్య సంబంధం ఏమిటో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నేత ప్రియాంకాగాంధీ వాద్రా నిలదీశారు. అదానీపై వచ్చిన ఆరోపణలపై ఎందుకు దర్యాప్తు జరిపించడం లేదని నిలదీశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ట్వీట్ చేశారు. మోదీ, అదానీ బంధంపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా బీజేపీ మౌనం పాటిస్తోందని తప్పుపట్టారు.

ప్రధాని మోదీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ శుక్రవారం రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఇంటి పేరును ఆయన కుటుంబ సభ్యులు ఎందుకు ఉపయోగించుకోలేదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై కేసీ వేణుగోపాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై సమాధానం ఇస్తూ ఫిబ్రవరి 9న రాజ్యసభలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీపై రాజ్యసభ కార్యకలాపాల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 188 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తున్నట్లు కేసీ వేణుగోపాల్ తన నోటీసులో పేర్కొన్నారు. నెహ్రూ కుటుంబాన్ని ప్రధాని అవమానించారని ఆక్షేపించారు. నెహ్రూ కుటుంబ సభ్యులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యులేనని గుర్తుచేశారు. నెహ్రూ ఇంటి పేరును ఆయన కుటుంబ సభ్యులు ఎందుకు వాడుకోలేదని ప్రశ్నించడం అసంబద్ధం, అర్థరహితమని వేణుగోపాల్ తేల్చిచెప్పారు.

పాక్‌లో అగ్ని ప్రమాదం.. 10 మంది సజీవ దహనం

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పంఖ్తున్వా ప్రావిన్స్‌లో శుక్రవారం సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది సజీవ దహనయ్యారు. లోయర్ కొహిస్తాన్ జిల్లాలోని సెరి పట్టన్‌లోని కలపతో నిర్మించిన ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. పైకప్పు కూలి పడి 10 మంది సజీవ దహనం కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

20 నుంచి రష్యాలో జిన్‌పింగ్ టూర్

రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపైనే ప్రధానంగా దృష్టి

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సోమవారం నుంచి మూడు రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు. రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో కీలక చర్చలు జరపనున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేస్తూ ఏడాది దాటిపోతూ ఉండడంతో ఇరు దేశాల మధ్య శాంతి స్థాపన కోసం చైనా ప్రయత్నిస్తుందన్న వార్తల నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ''రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు జిన్ పింగ్ మార్చి 20 నుంచి 22 వరకు మాస్కోలో పర్యటిస్తారు'' అని విదేశాంగ శాఖ ప్రతినిధి హువా చునీయింగ్ చెప్పారు. చైనాకు వరసగా మూడోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జిన్‌పింగ్ తొలి విదేశీ పర్యటన ఇదే. ఇరాన్, సౌదీ అరేబియా మధ్య శాంతి ఒప్పందాన్ని కుదిర్చిన తర్వాత జిన్ పింగ్ రష్యా పర్యటనకు వెళుతూ ఉండడంతో ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారం అవుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇరు దేశాధినేతల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, ఒత్తిడి పెంచుతున్న అంశాలపై చర్చలు జరుగుతాయని రష్యా ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా, చైనాల స్నేహబంధాన్ని చాటి చెప్పడానికి ఈ సమావేశాన్ని ఇరువురు నేతలు వినియోగించుకోనున్నారు.



అస్సాంలోని మదర్సాలన్నిటినీ మూసేస్తాం



బెళగావి: అస్సాంలోని అన్ని మదర్సా(ముస్లిం మత పాఠశాల)లను మూసివేస్తామని ఆ రాష్ట్ర సీఎం హిమాంత బిశ్వశర్మ తెలిపారు. ఆధునిక భారతదేశంలో మదర్సాల అవసరం అవసరం లేదని చెప్పారు. 'దేశానికి, అస్సాం రాష్ట్రానికి సేవలు చేసేందుకు అవసరమైన డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర వృత్తి నిపుణులను తయారు చేసే స్కూళ్లు, కాలేజీలతో మాత్రమే అవసరం ఉంది. మదర్సాలతో కాదు'అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 600 మదర్సాలను మూసివేశాం, మిగతా వాటినీ మూసేస్తామని అన్నారు. కర్ణాటకలోని బెళగావిలో గురువారం రాత్రి జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యం బంగ్లాదేశ్ నుంచి వస్తున్న జనంతో మన సంస్కృతి, ఆచారాలకు ముప్పు ఏర్పడిందన్నారు. 'మన దేశంలో ముస్లింలు, క్రిస్టియన్లమని గర్వంగా చెప్పుకునే వాళ్లు చాలా మంది ఉన్నారు. కానీ, హిందువును అని గర్వంగా చెప్పుకునే వారు కావాలి' అని హిమాంత చెప్పారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు చరిత్రను వక్రీకరించాయని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నయా మొఘలుల పార్టీగా అభివర్ణించారు. ఒకప్పుడు మొఘలులు భారత్‌ను బలహీనం చేసేందుకు ప్రయత్నించారు..కాంగ్రెస్ ఇప్పుడదే చేస్తోందన్నారు.

యూపీలో ఆలూ కోల్డ్‌స్టోరేజీలో ప్రమాదం

కుప్పకూలిన పైకప్పు, 14 మంది దుర్మరణం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో బంగాళ దుంపలు నిల్వ చేసే ఒక కోల్డ్ స్టోరేజీ పైకప్పు కుప్పకూలిపోయిన ఘటనలో 14 మంది మరణించారు. చాందౌసీ పోలీసు స్టేషన్ పరిధిలో ఇందిరా రోడ్డులో ఉన్న ఈ కోల్డ్ స్టోరేజీ పై కప్పు గురువారం రాత్రి హఠాత్తుగా కుప్పకూలింది. ఆ సమయంలో కోల్డ్ స్టోరేజీ లోపల ఆలూ బస్తాలను అన్‌లోడ్ చేస్తున్న వర్కర్లు శిథిలాల కింద చిక్కుకున్నారు. సహాయ సిబ్బంది 24 మందిని ఆలూ బస్తాల నుంచి బయటకు తీసుకురాగా వారిలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయ కార్యక్రమాలు దాదాపుగా పూర్తి అయ్యాయని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) ఆఫ్ పోలీసు శలభ మాథుర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రిని సందర్శించిన యోగి బాధితుల్ని పరామర్శించారు. ఈ ప్రమాదం ఎందుకు జరిగిందో తెలుసుకోవడానికి ఒక కమిటీ వేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం, గాయపడిన వారికి చికిత్స కోసం రూ.50 వేలు ప్రకటించారు. ప్రమాదం జరిగిన సమయంలో కోల్డ్ స్టోరేజీలో ఉన్న వారిలో ఆరుగురు స్వల్పగాయాలకు చికిత్స తీసుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా మరో నలుగురికి చికిత్స జరుగుతోందని జిల్లా మేజిస్ట్రేట్ మనీష్ బన్సల్ తెలిపారు. పోలీసులు చెప్పిన సమాచారం ప్రకారం ఈ కోల్డ్ స్టోరేజీని మూడు నెలల క్రితమే నిర్మించారు. ప్రభుత్వం దగ్గర్నుంచి సరైన అనుమతులు లేకుండానే హడావుడిగా దీని నిర్మాణం కొనసాగించినట్టు పోలీసులు చెప్పారు. అంతేకాకుండా కోల్డ్ స్టోరేజీ సామర్థ్యానికి మించి బంగాళ దుంప బస్తాలు నిల్వ చేసినట్టుగా తెలుస్తోంది. ఇవే ప్రమాదానికి దారి తీసినట్టు భావిస్తున్నారు.

భారత వ్యతిరేకి రాహుల్ గాంధీ

- 'టూల్‌కిట్'లో శాశ్వత భాగస్వామి
- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా డిమాండ్



న్యూఢిల్లీ: భారత ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ లండన్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత వ్యతిరేక టూల్‌కిట్‌లో రాహుల్ శాశ్వత భాగస్వామిగా మారాడని ధ్వజమెత్తారు. భారత్‌కు బద్ధవ్యతిరేకి అయిన జార్జి సోరోస్ భాషలోనే రాహుల్ మాట్లాడాడని మండిపడ్డాడు. మన దేశానికి వ్యతిరేకంగా విదేశీ శక్తులు పెద్ద కుట్ర పన్నుతున్నాయని, ఇందులో కాంగ్రెస్‌తోపాటు సోకాల్డ్ వామపక్ష ఉదారవాదులు కూడా భాగమేనని ఆరోపించారు. దేశాన్ని ద్వేషించే కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్ భాషను వాడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు నడ్డా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని విదేశీ శక్తులను కోరిన రాహుల్ గాంధీ దేశ సార్వభౌమత్వంపై దాడి చేశారని, ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్‌లో జోక్యం చేసుకోవాలంటూ అమెరికా, యూరప్ దేశాలను కోరడం కంటే సిగ్గుచేటు మరొకటి ఉండదన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని రాహుల్ ఇంకా అర్థం చేసుకోలేదని, ప్రజలపై ఆయనకు విశ్వాసం లేదని విమర్శించారు. భారత్‌ను ఆర్థికంగా, వ్యూహాత్మకంగా దెబ్బకొట్టడాన్ని విదేశీ కుట్రదారులు పనిగా పెట్టుకున్నారని, రాహుల్ గాంధీ సైతం వారితో చేతులు కలిపాడని దుయ్యబట్టారు. విదేశీ గడ్డపై ఆయన చేసిన పనిని స్వతంత్ర భారతదేశంలో గతంలో ఏ నాయకుడూ చేయలేదని నడ్డా వెల్లడించారు. రాహుల్ ధోరణి దేశంలో ప్రతి ఒక్కరి మనసులను గాయపర్చిందని చెప్పారు. భారత్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులు దేశంలో బలహీన ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా దేశ వ్యతిరేక ముఠాలు చురుగ్గా మారుతున్నాయని, భారత్‌ను అప్రతిష్ట పాలు చేయడమే లక్ష్యంగా టూల్‌కిట్‌తో ముందుకొస్తున్నాయని జేపీ నడ్డా ఆక్షేపించారు. భారత్‌లో దృఢమైన ప్రజాస్వామ్యం, నిర్ణయాత్మక ప్రభుత్వం ఉన్నాయని, దుష్టశక్తుల ఆటలు సాగవని హెచ్చరించారు.

రాహుల్ వ్యాఖ్యలు జాతివ్యతిరేకం కాదు : శశిథరూర్

తమ నేత రాహుల్ గాంధీ బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి జాతి వ్యతిరేకత లేదని ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. భారత ప్రజాస్వామ్యంలోకి విదేశీ శక్తుల్ని రాహుల్ ఎందుకు రానిస్తారని ప్రశ్నించారు. శుక్రవారం ఇండియా టుడే సదస్సులో శశిథరూర్ రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపజేసేటంత ప్రధానమైనవా ఆలోచిస్తూ ఉంటే చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు. దేశంలో ఎన్నో ప్రజా సమస్యల్ని గాలికొదిలేసిన బీజేపీ రాహుల్ నుంచి క్షమాపణ కోరుతూ రాజకీయం చేయడం విడ్డూరమన్నారు.

మాజీ అగ్నివీర్‌లకు సీఐఎస్‌ఎఫ్‌లో 10% రిజర్వేషన్

న్యూఢిల్లీ: మాజీ అగ్నివీర్‌లకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్)లో 10% రిజర్వేషన్ కల్పిస్తామని కేంద్ర హోం శాఖ ప్రకటించింది. ఈ మేరకు సీఐఎస్ఎఫ్ చట్టం–1968లోని నిబంధనలను సవరించినట్లు వెల్లడించింది. మాజీ అగ్నివీర్‌లకు బీఎస్ఎఫ్ ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్ అమలు చేస్తామంటూ వారం క్రితం ప్రకటించిన కేంద్రం తాజాగా ఈ మేరకు ఒక నోటిఫికేషన్ విడుదల చేయడం గమనార్హం. అంతేకాకుండా, మొదటి బ్యాచ్ అగ్నివీర్‌లకైతే ఐదేళ్ల వరకు, తర్వాతి వారికి మూడేళ్ల వరకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుందని వివరించింది. మాజీ అగ్నివీర్‌లకు ఫిజికల్ ఎఫిసియెన్సీ పరీక్ష నుంచి మినహాయింపు కూడా ఉంటుందని తెలిపింది. గత ఏడాది తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకంలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోకి ఎంపికై న 17.5–21 ఏళ్ల అభ్యర్థు(అగ్నివీర్)లు నాలుగేళ్లపాటు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయాల్సి ఉంటుంది. అగ్నివీర్‌లలో 25% మందిని నాలుగేళ్ల తర్వాత రెగ్యులర్ సర్వీసుల్లోకి తీసుకుంటారు.

ఎయిరిండియాలో మళ్లీ వీఆర్‌ఎస్

న్యూఢిల్లీ: ఎయిరిండియా సంస్థ మరోసారి తమ నాన్‌–ఫ్లయింగ్ సిబ్బంది కోసం స్వచ్ఛంద విరమణ పథకం(వీఆర్ఎస్)ను ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం అధీనంలోని నష్టాల్లో ఉన్న ఎయిరిండియాను గత ఏడాది జనవరిలో టాటా గ్రూప్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. టాటాల ఆధీనంలోకి వచ్చాక ఉద్యోగులకు వీఆర్ఎస్ అవకాశం ఇవ్వడం ఇది రెండోసారి. 40 ఏళ్లు, ఆపై వయస్సు వారు, సంస్థలో కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పర్మినెంట్ జనరల్ కేడర్ అధికారులకు ఇది వర్తిస్తుందని ఎయిరిండియా తెలిపింది. కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న క్లరికల్, నిపుణులు కాని కేటగిరీల ఉద్యోగులూ వీఆర్ఎస్‌కు అర్హులే. మొత్తం 11వేల మంది ఉద్యోగుల్లో అర్హులైన 2,100 మంది ఏప్రిల్ 30వ తేదీలోగా వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించింది.

ఎట్టకేలకు కోర్టుకు ఇమ్రాన్‌ఖాన్

లాహోర్: పాకిస్తాన్ తెహ్రీక్‌–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్(70) ఎట్టకేలకు కోర్టు మెట్లెక్కారు. ప్రభుత్వం తనపై అక్రమంగా కేసులు పెట్టిందంటూ ఆయన ఇస్లామాబాద్ జిల్లా కోర్టు ఫిబ్రవరి 28వ తేదీన జారీ చేసిన వారెంట్లను బేఖాతరు చేస్తూ వచ్చారు. తోషఖానా కేసులో నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్లతో ఇంటికి ఇమ్రాన్ నివాసానికి వెళ్లిన పోలీసులను ఆయన మద్దతుదారులు తీవ్రంగా ప్రతిఘటించారు. బుధవారం కోర్టుల జోక్యంతో ఇమ్రాన్ నివాసం వద్ద ఉద్రిక్తతలు చల్లారాయి. తాజాగా, శుక్రవారం ఇస్లామాబాద్ హైకోర్టు ఇమ్రాన్‌పై ఉన్న నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్‌ను ఈ నెల 18వ తేదీ వరకు సస్పెండ్ చేసింది. దీంతో ఆయన లాహోర్ హైకోర్టుకు వచ్చారు. తనపై ఉన్న 9 కేసులకు సంబంధించి ముందస్తు బెయిలివ్వాలని పిటిషన్ వేశారు. దీంతో, ఆయనపై ఉన్న తీవ్రవాద సంబంధ, సివిల్ కేసుల్లో బెయిల్ పిటిషన్లను విచారించేందుకు న్యాయస్థానం అంగీకరించింది. ప్రభుత్వానికి, ఇమ్రాన్‌కు మధ్య విభేదాల పరిష్కారానికి అంగీకారం కుదిరిందని, వివరాలను కోర్టుకు అందజేస్తామని పీటీఐ నేత ఒకరు ట్వీట్ చేశారు.

మరో 5 రోజులు ఈడీ కస్టడీలోనే సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీని కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది. ఈడీ అధికారులు శుక్రవారం సిసోడియాను స్పెషల్ జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచి, మరో వారం పాటు కస్టడీని పొడిగించాలని కోరారు. కస్టడీలో ఆయన కీలక సమాచారం అందించారని, సహ నిందితులైన రాహుల్ సింగ్, దినేశ్ అరోరా, అమిత్ అరోరాలతో కలిపి విచారించాల్సి ఉందని వివరించారు. అయితే, జడ్జి సిసోడియా కస్టడీని 5 రోజులపాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇదే కేసులో సిసోడియాను ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్ట్ చేసి తిహార్ జైలుకు తరలించగా, ఈడీ అధికారులు మార్చి 9వ తేదీన అరెస్ట్ చేశారు.

కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం



శుక్రవారం కోల్‌కతా కాళీఘాట్ ప్రాంతంలోని తన నివాసానికి వచ్చిన అఖిలేశ్‌కు కండువా కప్పి స్వాగతం పలుకుతున్న మమతా బెనర్జీ

ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్‌తో కలిసి ఉమ్మడిగా బీజేపీని ఎదుర్కొంటామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తెలిపింది. ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ శుక్రవారం టీఎంసీ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతో కోల్‌కతాలో సమావేశమయ్యారు. మమతతో గంటపాటు జరిగిన చర్చల్లో అఖిలేశ్‌తోపాటు ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కిరణ్మయ్ నందా పాల్గొన్నారు. అనంతరం అఖిలేశ్ మీడియాతో మాట్లాడారు. తాము దేశంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించామన్నారు. బీజేపీని ఓడించేందుకు టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీకి గట్టి మద్దతునిస్తామన్నారు. ప్రతిపక్ష కూటమిలో ఎలాంటి పాత్ర పోషించాలో నిర్ణయించుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. తమ పార్టీ బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటించనుందన్నారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలు తమ కార్యాచరణను ప్రకటిస్తాయని చెప్పారు.

దర్యాప్తు సంస్థలవన్నీ కట్టుకథలు : రాఘవ చద్దా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసులో మనీష్ సిసోడియాకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థల దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకులు రాఘవ్ చద్దా అన్నారు. సిసోడియాపై సీబీఐ, ఈడీ కట్టుకథలే చెబుతున్నాయని ఆరోపించారు. మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ చేసిన ఈడీ కూడా సీబీఐ అడిగిన ప్రశ్నలే అడిగిందన్నారు. ఏడు రోజుల రిమాండ్‌లో ఈడీ అధికారులు సిసోడియాను కేవలం 15 గంటలు మాత్రమే ప్రశ్నించారని తెలిపారు. బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యల వల్లే సిసోడియా జైల్లో ఉన్నారని, సీబీఐ దగ్గర, ఈడీ దగ్గర ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఇలా ఉండగా, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా నివసించిన బంగ్లాను ఢిల్లీ మంత్రి అతిషికి కేటాయించారు. ఇటీవల కేబినెట్‌లోకి తీసుకున్న అతిషికి ఈ బంగ్లా కేటాయిస్తూ ఢిల్లీ ప్రజాపనుల శాఖ అధికారికంగా లేఖ పంపింది.

ఎరువులపై సబ్సిడీ తగ్గింపు యోచనేదీ లేదు

న్యూఢిల్లీ: దేశంలో ఎరువులపై ప్రస్తుతమిస్తున్న సబ్సిడీలను తగ్గించే యోచనేదీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఎరువుల సబ్సిడీల తగ్గింపు ప్రభావం రైతులపై ఏమేరకు ఉంటుందని అంచనా వేసేందుకు ఎలాంటి అధ్యయనం చేపట్టలేదని కూడా వివరించారు. న్యూట్రియెంట్ బేస్ట్ సబ్సిడీ(ఎన్‌బీఎస్) పథకం కింద ఫాస్ఫరస్‌– పొటాషియం ఎరువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం వద్ద ఎటువంటి ప్రణాళికలు లేవని మరో ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రస్తుతం యూరియా 45 కిలోల బ్యాగ్‌ను నీమ్ కోటింగ్ చార్జీలు, పన్నులు కాకుండా గరిష్ట రిటైల్ ధర రూ. 242కు అందజేస్తున్నామని చెప్పారు.

రకూన్ డాగ్స్ నుంచి కరోనా !

- అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం కొత్త విశ్లేషణ
- వూహాన్ మార్కెట్‌లో సేకరించిన జన్యు నమూనాలతో అధ్యయనం

న్యూయార్క్: కరోనా వైరస్ పుట్టుకపై ఇది మరో కొత్త విశ్లేషణ. ఇన్నాళ్లూ గబ్బిలాల నుంచి ఈ వైరస్ సంక్రమించిందని భావిస్తూ ఉంటే కొందరు అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం శునకాల నుంచి వచ్చిందని తమ పరిశోధనల్లో వెల్లడైనట్టు చెప్పారు. చైనాలోని వూహాన్ సీఫుడ్ మార్కెట్‌లో సేకరించిన జన్యు నమూనాలను అధ్యయనం చేస్తే వూహాన్ మార్కెట్‌లో అమ్ముతున్న రకూన్ డాగ్స్ నుంచే వైరస్ వ్యాప్తి చెందిందని తేల్చారు. ఈ కొత్త విశ్లేషణను న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రచురించింది. జనవరి 2020లో కొందరు శాస్త్రవేత్తలు వూహాన్ మార్కెట్‌లో శాంపిల్స్ సేకరించారు. అప్పటికే కొత్త వైరస్ ఆందోళనతో వూహాన్ మార్కెట్ అంతా ఖాళీ చేయించారు. ఆ మార్కెట్ గోడలపైన, నేలపైన, జంతువుల్ని ఉంచే పంజరాల్లోనూ జన్యు నమూనాలు సేకరించి అధ్యయనం చేశారు. ఆ నమూనాల్లో అత్యధిక భాగం రకూన్ డాగ్స్‌తో సరిపోలాయని శాస్త్రవేత్తల బృందం తేల్చింది. ఈ వివరాలను చైనా శాస్త్రవేత్తలతోనూ వారు పంచుకున్నారు. అయితే ఆ తర్వాత గ్లోబల్ ఇనీషియేటివ్ ఆన్ షేరింగ్ ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా డేటా (జీఐఎస్ఏఐడీ) నుంచి ఈ డేటా మాయం అయిపోయిందని ఆ శాస్త్రవేత్తలు చెప్పారు. అరిజోనా యూనివర్సిటీ, కాలిఫోర్నియాలో స్క్రిప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సిడ్నీ యూనివర్సిటీ వైరాలజిస్టులు ఈ బృందంలో ఉన్నారు. రకూన్ డాగ్స్ నుంచే మనుషులకి సంక్రమించిందా లేదా అన్నది శాస్త్రవేత్తలు స్పష్టంగా చెప్పలేకపోయారు. శునకాల నుంచి మనుషులకే నేరుగా సోకొచ్చు లేదా ఆ డాగ్స్ నుంచి వేరే జంతువుకి వెళ్లి మనుషులకి సోకి ఉండొచ్చని అన్నారు.

దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో 796 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 5 వేలు దాటేసింది. హిమాచల్ ప్రదేశ్, పాండుచ్చేరి, ఉత్తరప్రదేశ్‌లో కరోనా బారిన పడి ఒక్కొక్కరు ప్రాణాలు కోల్పోయారు.

అన్నదాతకు అందుబాటులో 'న్యాయం'

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్ /జనగామ: కార్మికులు, మహిళలు, బాలలు, ఖైదీలు.. ఇలా సమాజంలోని పలు వర్గాలకు న్యాయ సహాయం చేసే కేంద్రాలు దేశంలో చాలా ఏర్పాటయ్యాయి. కానీ తొలిసారిగా రైతులకు న్యాయ సహాయం అందించేందుకు కూడా ఓ కేంద్రం ఏర్పాటు కానుంది. బమ్మెర పోతన హలం పట్టిన నేల దేశ చరిత్రలో ఈ నూతన అధ్యాయానికి వేదికవుతోంది. పోతానామాత్యుడి స్వగ్రామమైన తెలంగాణలోని జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో 'అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్' మొదలవుతోంది. నల్సార్ విశ్వవిద్యాలయం, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ, లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఈ క్లినిక్ ప్రారంభం కానుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యన్ ఈ రైతు న్యాయ సేవా కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.నవీన్‌రావు, నల్సార్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకృష్ణదేవరావులు పాల్గొననున్నారు. ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తోన్న ఈ కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలందించగలిగితే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆలోచన మేరకు దేశ వ్యాప్తంగా ఈ అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటవుతాయని న్యాయ, భూచట్టాల నిపుణులు చెపుతున్నారు.


లీగల్ ఎయిడ్ క్లినిక్‌కు వేదిక కానున్న బమ్మెర గ్రామ పంచాయతీ కార్యాలయం

అన్ని అంశాల్లో రైతుకు సహకారం

దుక్కి దున్నేనాటి నుంచి తన పంటను మార్కెట్‌లో అమ్ముకునే వరకు రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించే విషయంలో అవసరమైన న్యాయ సాయం అందించడమే ధ్యేయంగా బమ్మెర గ్రామంలో ఈ 'అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్' ఏర్పాటవుతోంది. భూ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వల్ల నష్టం వాటిల్లిన సమయంలో, మార్కెట్‌లో మోసాలు చోటు చేసుకుంటే, పంటల బీమా అమలు కానప్పుడు.. ఇలా ప్రతి సందర్భంలోనూ రైతులకు అవసరమైన న్యాయ సాయాన్ని ఈ కేంద్రం ద్వారా అందించనున్నారు. న్యాయ సేవలను అందించడంతో పాటు రైతు, భూ చట్టాలపై అవగాహన కల్పించడం, రైతులను చైతన్యపర్చడం లాంటి కార్యక్రమాలను కూడా ఈ కేంద్రాల ద్వారా నిర్వహించనున్నారు. గ్రామంలోని రైతులకు వ్యవసాయ సలహాలు, న్యాయ సాయం ఉచితంగా అందించనున్నారు. ఇందుకోసం పారా లీగల్ కార్యకర్త అందుబాటులో ఉంటారు. రైతుల సమస్యలను నమోదు చేసుకునే ఈ కార్యకర్త సదరు వివరాలను నల్సార్, లీగల్ సర్వీసెస్ అథారిటీ, లీఫ్స్ సంస్థలకు పంపనున్నారు. నల్సార్ విద్యార్థులు వాటిని పరిశీలించి సహాయాన్ని అందిస్తారు. రాష్ట్రంలోని 25 న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసే ప్రయత్నం జరుగుతోంది. దీంతో పాటు రైతులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు గాను క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. గత 17–18 ఏళ్లుగా భూ సమస్యలపై పనిచేస్తోన్న లీఫ్స్ సంస్థ మరికొంత వ్యవసాయ చట్టాల అమలుపై గ్రామీణ స్థాయిలో పనిచేయనుంది.

రైతులకు న్యాయ సేవల దిశగా మొదటి ప్రయత్నం

రైతులకు చట్టాలతో అవసరం పెరిగింది. కానీ వారి అవసరాలు తీర్చే స్థాయిలో సౌకర్యాలు పెరగలేదు. న్యాయ సేవలూ అందుబాటులో లేవు. అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ మొదటి ప్రయత్నం. ఇది విజయవంతం అయితే బమ్మెరే కాదు దేశమంతటా ఇలాంటి సేవలు అందించే బ్లూప్రింట్ తయారవుతుంది.

– లీఫ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, భూచట్టాల నిపుణుడు సునీల్‌కుమార్

రాష్ట్రానికి టెక్స్‌టైల్ పార్కు

▶ మొదటి పేజీ తరువాయి

జరిగిన విజయ సంకల్పసభలో మెగా టెక్స్‌టైల్ పార్కును తెలంగాణకు ఇస్తామన్న ప్రధాని ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారికంగా ప్రకటన చేశారని కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఈ మెగా టెక్స్‌టైల్ పార్కులో దారం తయారీ నుంచి బట్టలు నేయడం, రంగులు అద్దడం, డిజైన్లు ముద్రించడం, వస్త్రాల తయారీ వరకు అన్ని రకాల పనులు ఒకే ప్రదేశంలో నిర్వహించేలా ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన భారీ వస్త్ర పరిశ్రమలను ఏర్పాటు చేస్తారన్నారు. ఈ మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు వలన రవాణా ఖర్చులు తగ్గి, భారతీయ టెక్స్‌టైల్ రంగంలో పోటీతత్వం పెరుగుతుందని కేంద్రమంత్రి తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు విషయంలో ప్రత్యేక చొరవను చూపించి, అవసరమైన సహాయసహకారాలను అందించి ప్రాజెక్టు త్వరగా కార్యరూపం దాల్చటానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి కోరారు.

టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన పరీక్షలు/జరిగిన తేదీలు

పరీక్ష	నిర్వహించిన తేదీ
గ్రూప్-1 ప్రిలిమినరీ	16.10.2022
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్	22.01.2023
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్	26.02.2023
అసిస్టెంట్ ఇంజనీర్	05.03.2023

కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టులకు డ్రైవింగ్ టెస్ట్‌లు వాయిదా

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీలో భాగంగా పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ కానిస్టేబుల్ (డ్రైవర్), అగ్నిమాపకశాఖలోని డ్రైవర్ ఆపరేటర్ పోస్టులకు డ్రైవింగ్ పరీక్షల తేదీల్లో స్వల్ప మార్పులు చేసినట్లు టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వి.వి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు ఉండటం వల్ల..ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించాల్సిన డ్రైవింగ్ పరీక్షలను మార్చి 23, 24 తేదీలకు మార్చినట్లు తెలిపారు. ఇప్పటికే అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు అవే అడ్మిట్‌కార్డులతో పరీక్షకు హాజరుకావచ్చని వెల్లడించారు.

చిరంజీవి, రామ్ చరణ్‌లతో అమిత్ షా భేటీ


శుక్రవారం ఢిల్లీలో నటులు చిరంజీవి, రామ్‌చరణ్‌లతో భేటీ అయిన అమిత్‌షా

సాక్షి, న్యూఢిల్లీ: నటులు చిరంజీవి, రామ్ చరణ్‌లను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కలిశారు. అమెరికా నుంచి నేరుగా ఢిల్లీ వచ్చిన రామ్ చరణ్ శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ హోటల్ లో జరిగిన మీడియా సంస్థ సదస్సులో పాల్గొన్నారు. అదే సదస్సులో కేంద్ర మంత్రి అమిత్ షా సైతం పాల్గొన్నారు. సదస్సు అనంతరం అదే హోటల్‌లో బస చేస్తున్న రామ్ చరణ్ రూమ్ కి వెళ్లిన అమిత్ షా అక్కడ చిరంజీవి, చరణ్ లతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు గెలుచుకున్నందుకు గానూ అమిత్ షా అభినందించి చరణ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ట్వీట్ చేసిన కేంద్రమంత్రి అమిత్ షా భారతీయ చిత్రసీమలో ఇద్దరు దిగ్గజాలు చిరంజీవి, రామ్ చరణ్‌లను కలవడం ఆనందంగా ఉందని తెలిపారు. తెలుగు సినిమా పరిశ్రమ.. భారత దేశ సంస్కృతి, ఆర్థిక వ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు.

నేడు, రేపు పలుచోట్ల మోస్తరు వానలు

సాక్షి, హైదరాబాద్: నైరుతి రాజస్థాన్ మీదుగా మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం రాష్ట్రంపైనా ఉంటుందని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వానలు కురుస్తున్నాయని వివరించింది. శని, ఆదివారాల్లోనూ రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది. మరోవైపు దక్షిణ తమిళనాడు నుండి ఉత్తర కొంకణ్ వరకు కొనసాగిన ఉపరితల ద్రోణి శుక్రవారానికి అంతర్గత తమిళనాడు నుంచి రాయలసీమ, తెలంగాణ, విదర్భ మీదుగా కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఇది సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని, ఈదురుగాలులున్న చోట గాలి వేగం గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల



చొప్పున ఉంటుందని హెచ్చరించింది. కొన్నిచోట్ల వడగళ్లతో కూడిన భారీవర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది.

ఏపీలో భారీ వర్షాలు

ఏపీలో ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఇవి మరో మూడు రోజులపాటు కురుస్తాయని భారత వాతావరణ విభాగం తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఎకనమిక్ కారిడార్‌కు లైన్‌క్లియర్

- నాగ్‌పూర్–విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ ప్రక్రియ వేగవంతం
- ఇప్పటికే తొలి ఆరు ప్యాకేజీలకు మార్గం సుగమం
- తాజాగా చివరి మూడు ప్యాకేజీలకు ఎస్ఎఫ్‌సీ ఓకే.. నిధులు మంజూరు
- మంచిర్యాల నుంచి విజయవాడ వరకు పూర్తిగా కొత్త హైవే
- రెండున్నరేళ్లలో రెడీ అంటున్న ఎన్‌హెచ్ఏఐ

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానిస్తూ నిర్మించనున్న తొలి ఎకనమిక్ కారిడార్‌కు పూర్తిగా లైన్ క్లియర్ అయింది. నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు నిర్మించే ఈ కారిడార్ తెలంగాణ – ఏపీ మధ్య 306 కి.మీ మేర కొనసాగనుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మొత్తం రూ.10 వేల కోట్ల నిధులకు కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల శాఖ అధీనంలోని స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ (ఎస్ఎఫ్‌సీ) పచ్చజెండా ఊపింది. ఈ రోడ్డును తొమ్మిది ప్యాకేజీలుగా విభజించి టెండర్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే తొలి ఆరు ప్యాకేజీలకు మార్గం సుగమం కావటంతో టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తికాగా, చివరి మూడు ప్యాకేజీలకు తాజాగా ఎస్ఎఫ్‌సీ ఓకే చెప్పి నిధులు మంజూరు చేసింది. దీంతో తెలంగాణ (మంచిర్యాల) నుంచి విజయవాడకు పూర్తిగా కొత్త (గ్రీన్‌ఫీల్డ్) యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి రంగం సిద్ధమైంది. రెండున్నరేళ్లలో ఈ జాతీయ రహదారి రెడీ అవుతుందని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పేర్కొంటోంది.

మహారాష్ట్ర–తెలంగాణ–ఆంధ్ర: ఓవైపు పర్యావరణ అభ్యంతరాలు, మరోవైపు భూసేకరణపై ప్రజల నిరసనలు, అలైన్‌మెంట్ మార్చాలంటూ రాజకీయ నేతల ఒత్తిళ్లు.. వెరసి ఈ ఎకనమిక్ కారిడార్‌పై ఎన్నో సందేహాలు వ్యక్తమయ్యాయి. వాటన్నింటినీ తోసిపుచ్చుతూ ఇప్పుడు ఎన్‌హెచ్ఏఐ రోడ్డు నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ కొత్త జాతీయ రహదారి మూడు రాష్ట్రాల మీదుగా సాగనుంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో మొదలై తెలంగాణలోని ఆసిఫాబాద్–మంచిర్యాల–వరంగల్–ఖమ్మంల మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వరకు కొనసాగుతుంది. నాగ్‌పూర్ నుంచి తెలంగాణలోని ఆసిఫాబాద్ మీదుగా మంచిర్యాల వరకు ఇప్పటికే ఉన్న రోడ్డును నాలుగు వరసలకు విస్తరిస్తున్నారు. ఇక్కడివరకు పాత రోడ్డు (బ్రౌన్‌ఫీల్డ్ హైవే) కొత్తగా మారుతుందన్నమాట. మంచిర్యాల నుంచి కొత్తగా భూసేకరణ జరిపి పూర్తి కొత్త రోడ్డుగా నిర్మిస్తారు. 45 మీటర్ల వెడల్పుతో నాలుగు వరసలుగా ఈ రోడ్డు నిర్మితమవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ మీదుగా విజయవాడకు ఉన్న రోడ్డు పైనే ఎక్కువ వాహనాలు వెళ్తున్నాయి. దీంతో ఈ రోడ్డు బాగా రద్దీగా మారింది. ఇప్పుడు దీనికి ప్రత్యామ్నాయంగా ఈ కొత్త రోడ్డు అందుబాటులోకి రానున్నందున.. నాగ్‌పూర్ నుంచి వచ్చే ట్రాఫిక్, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల వాహనాలు దీని మీదుగానే ముందుకు సాగేందుకు వీలవుతుంది. ఈ కొత్త జాతీయ రహదారి కోసం 1,550 హెక్టార్ల భూమిని సేకరించారు.



ఇదీ ప్యాకేజీల స్వరూపం

ప్యాకేజీ 1,2,3

మంచిర్యాల నుంచి వరంగల్ వరకు 108.406 కి.మీ నిడివి. వ్యయం రూ.3,440.94 కోట్లు. టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు పనులు దక్కాయి. అనుసంధానమయ్యే ప్రధాన పట్టణాలు.. మంచిర్యాల, మంథని, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, వరంగల్, పర్కాల, ఆత్మకూరు, శాయంపేట, దామెర.

ప్యాకేజీ 4, 5, 6

వరంగల్ నుంచి ఖమ్మం వరకు 108.24 కి.మీ నిడివి. వ్యయం రూ.3,397.01 కోట్లు. ప్రస్తుతం టెక్నికల్ బిడ్ మదింపు జరుగుతోంది. అనుసంధానమయ్యే ముఖ్య పట్టణాలు.. వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, ఊరుగొండ, గీసుగొండ, మచ్చాపూర్, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, వెంకటయ్యపాలెం.

ప్యాకేజీ 7, 8, 9

ఖమ్మం నుంచి విజయవాడ వరకు 89.42 కి.మీ నిడివి. వ్యయం రూ.3,007 కోట్లు. స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ తాజాగా ఈ ప్యాకేజీకే నిధులు మంజూరు చేసింది. ఇక టెండర్లు పిలవాల్సి ఉంది. అనుసంధానమయ్యే ముఖ్య పట్టణాలు.. సిరిపురం, తునికిపాడు, ఆత్కూరు, రెమిడిచెర్ల, దుగ్గిరాలపాడు, జక్కంపూడి.

క్లుప్తంగా...

26న మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ బహిరంగ సభ

కాందార్ లోహాలో సభ ఏర్పాట్లు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఈ నెల 26న మహారాష్ట్రలోని కాందార్ లోహాలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ మేరకు సన్నాహాలు ప్రారంభించింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ సభలో మహారాష్ట్రకు చెందిన కీలక నేతలు పాల్గొంటారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాందార్ లోహ సభకు భారీగా జన సమీకరణ చేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఈ బహిరంగ సభ వేదికగా మహారాష్ట్రలోని వివిధ పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పార్టీ ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హిమాన్షు తివారీ, మహారాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు మాణిక్ కదం ప్రవీణ్, పార్టీ నేతలు శివాన్క్, అంకిత్ యాదవ్, గణేశ్ బాబూరావు కదం తదితరులతో కలసి సభ ఏర్పాట్లను పరిశీలించారు.

డప్పు వాయిస్తూ.. నినాదాలు చేస్తూ..

బీఆర్‌ఎస్ ఎంపీల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ–హిండెన్‌బర్గ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ ఎంపీలు వినూత్నంగా తమ ఆందోళన నిర్వహించారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఇతర విపక్ష పార్టీ ఎంపీలతో నిర్వహించిన ధర్నాలో బీఆర్‌ఎస్ ఎంపీలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎంపీలు కేశవరావు, జోగినపల్లి సంతోష్‌కుమార్, కొత్త ప్రభాకర్ రెడ్డి, కేఆర్ సురేశ్ రెడ్డి డప్పు వాయించి నిరసన తెలిపారు.

పేద విద్యార్థుల ప్రాణాలంటే లెక్కలేదు

సాక్షి, హైదరాబాద్: పేద విద్యార్థుల ప్రాణాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి లెక్కలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాలలో స్నానం చేస్తున్న అయిదో తరగతి విద్యార్థులు పవన్, యశ్వంత్, సుశాంత్‌లపై పక్కనే ఉన్న ప్రహరీ కూలింది. ఈ సంఘటనలో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. యశ్వంత్, సుశాంత్‌లు తీవ్రంగా గాయపడడంతో నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇతర బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం నిమ్స్‌కు చేరుకున్నారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న యశ్వంత్‌ను పరామర్శించారు. విద్యార్థికి అందిస్తున్న వైద్యం గురించి నిమ్స్ ఆసుపత్రి ఇన్‌చార్జి డైరెక్టర్ బీరప్పను అడిగి తెలుసుకున్నారు.

చట్టాలపై వ్యాఖ్య సరికాదు: హైకోర్టు

ఎంపీ అర్వింద్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ ఎంపీ అర్వింద్ బాధ్యత గల పదవిలో ఉంటూ.. చట్టాలపై వ్యాఖ్యలు చేయడం సరికాదని హైకోర్టు పేర్కొంది. ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయలేమని స్పష్టం చేసింది. ఎంపీ చేసిన వ్యాఖ్యలపై ప్రాథమిక ఆధారాలున్నందున ట్రయల్‌ను ఎదుర్కోవాల్సిందేనంటూ అర్వింద్ పిటిషన్‌ను కొట్టివేసింది. కానీ బెయిల్ దరఖాస్తు చేసుకునేందుకు ఈ ఆదేశాలపై నాలుగు వారాల పాటుస్టే ఇచ్చింది. 2021, అక్టోబర్ 31న హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు సమీపంలో ఎంపీ అర్వింద్ విలేకరులతో మాట్లాడుతూ.. అట్రాసిటీ చట్టంపై వ్యాఖ్యలు చేశారని, దళిత సమాజాన్ని కించపరిచేలా మాట్లాడారని ఓ సామాజిక కార్యకర్త ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై 2022 జనవరిలో హైదరాబాద్ మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదయింది. ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ ఎంపీ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

మహేశ్వరం మాజీ తహసీల్దార్‌పై ఈడీకి ఫిర్యాదు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రియల్టర్లతో కుమ్మక్కై నిషేధిత జాబితాలో ఉన్న భూములను కట్టబెట్టేశారని ఆరోపిస్తూ మహేశ్వరం మాజీ తహసీల్దార్ ఆర్పీ జ్యోతిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ)కి ఓ భూ బాధితుడు ఫిర్యాదు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లి తన ఫిర్యాదును అందించారు. నాగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 181లోని నిషేధిత జాబితాలో ఉన్న వివాదాస్పద 58 ఎకరాల భూమిని రియల్టర్లకు కట్టబెట్టి, ఆర్థికంగా పెద్ద మొత్తంలో తహసీల్దార్ ప్రయోజనం పొందినట్లు దస్తగిరి షరీఫ్ అనే బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్‌గా పనిచేసినప్పుడు ఆమె తన అధికారాన్ని దుర్వినియోగం చేసి, ఆర్థికంగా లబ్ధి పొందినట్లు ఆరోపించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారించాలని కోరారు. కాగా ఇదే భూ వ్యవహారంపై జ్యోతితో పాటు మరో ఆరుగురిపై ఇప్పటికే మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో వారం కిందట ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. ప్రస్తుతం జ్యోతి కందుకూరు ఆర్డీవో కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో పనిచేస్తున్నారు.





వరంగల్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి, వేదికపై తమ్మినేని, కూనంనేని తదితరులు. హాజరైన పార్టీ శ్రేణులు

మోదీని గద్దె దించితేనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- బీజేపీ ఓటమి కోసం ప్రగతిశీల శక్తుల ఏకీకరణ... సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- హనుమకొండ నుంచి మొదలైన సీపీఎం జన చైతన్యయాత్రలు

సాక్షిప్రతినిధి, వరంగల్: 'దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగహక్కులపై దాడులు జరుగుతున్నాయి.. మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్‌ల దోపిడీతో ప్రజలు అల్లాడుతున్నారు.. నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే ప్రజాస్వామ్యం పరిరక్షణ జరుగుతుంది. ప్రగతిశీల శక్తులను కూడగట్టి ప్రజా ఉద్యమాలతోనే హక్కులను సాధించుకుందాం'అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. దాడులను తిప్పికొట్టేందుకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు సంఘటితం కావాలని కోరారు. శుక్రవారం వరంగల్, హనుమకొండలలో జరిగిన పలు కార్యక్రమాల్లో సీతారాం ఏచూరి పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29 వరకు సాగే రాష్ట్రవ్యాప్త జన చైతన్యయాత్రలను ప్రారంభించారు. కాకతీయ యూనివర్సిటీలో పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ''చేంజింగ్ సినారియో ఆఫ్ ఇండియన్ ఫెడరలిజం''అనే అంశంపై నిర్వహించిన సింపోజియంలో మాట్లాడారు. వరంగల్‌లోని అజంజాహి మిల్ (ఓ సిటీ) మైదానంలో జరిగిన బహిరంగసభలో సీతారాం ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం హిందుత్వ ఎజెండాను తెరపైకి తీసుకొస్తుందని, అత్యంత బలమైన కేంద్రంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఫెడరలిజంను దెబ్బతీస్తుందని ఆరోపించారు. కేంద్రం గవర్నర్ల వ్యవస్థ ద్వారా రాష్ట్రాలపై అధికారం చెలాయిస్తూ, ప్రభుత్వాలను కూలదోసిన ఘటలను ఆయన ఉదహరించారు. మోదీ ప్రభుత్వంలో మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ సంస్థల దోపిడీ కవల పిల్లలుగా తయారయ్యాయని విమర్శించారు. ప్రశ్నించిన వారిపై దేశద్రోహులనే ముద్రవేసి సీబీఐ, ఈడీలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్‌లను ఉపయోగించుకుంటూ ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నిందించారు. సీఎం కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత మద్యం పాలసీలో తప్పు చేసినట్లు రుజువైతే జైలు శిక్షలు వేసినా తమ పార్టీలు తప్పు పట్టవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.

వరంగల్ నుంచి ప్రజాచైతన్యయాత్ర ప్రారంభం..

రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రజాచైతన్య యాత్రలు ప్రారంభంకానుండగా తొలుత వరంగల్‌లో సీతారాం ఏచూరి శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదట కాజీపేటనుంచి బైక్‌ర్యాలీ, హనుమకొండ 'కుడా'మైదానం, వరంగల్ జిల్లా ఆజంజాహి మిల్లు మైదానం కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. కాగా ఈ యాత్రకు సంఘీభావం తెలుపుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బహిరంగ సభలో ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ నాయకులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అగ్నిగుండంలోకి నెట్టేశారు

- సీఎం కేసీఆర్‌పై భట్టి ధ్వజం
- పాదయాత్రకు వెళ్లిన వారికి సంక్షేమ పథకాలు ఆపేస్తామనడానికి మీరెవరని ప్రశ్న?
- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



భట్టితో కలిసి పాదయాత్రలో పాల్గొన్న జీవన్ రెడ్డి

సాక్షి, ఆదిలాబాద్: పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను సీఎం కేసీఆర్ అగ్నిగుండంలోకి నెట్టేశారని సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం దక్కుతుందని ఆశించిన ప్రజలకు భంగపాటు ఎదురైందన్నారు. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ కొనసాగింపులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి భట్టి మొదలుపెట్టిన పాదయాత్ర రెండోరోజు శుక్రవారం బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో కొనసాగింది. శుక్రవారం రాత్రి సిరికొండలో పాదయాత్రకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంఘీభావం తెలిపి వెంట నడిచారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ గిరిజన బిడ్డల బతుకుల బాగు కోసమే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, మీ కుటుంబం బాగు పడడానికి కాదంటూ సీఎం కేసీఆర్ నుద్దేశించి విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల గురించి మాయమాటలు చెప్పి హౌసింగ్ శాఖనే ఎత్తివేసి ప్రజలను దగా చేశారని ఆరోపించారు. అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కి పోడు భూముల పట్టాలివ్వకుండా గిరిజనులను వేధించి కేసులు పెడుతున్నారన్నారు.

మీ అబ్బ సొత్తా..: కాంగ్రెస్ పాదయాత్రకు వెళ్లిన వారికి సంక్షేమ పథకాలు ఆపివేస్తామని అనడానికి మీరెవరంటూ బీఆర్‌ఎస్ నేతలను భట్టి ప్రశ్నించారు. రాష్ట్ర సంపద ఏమైనా మీ అబ్బ సొత్తా అంటూ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బోథ్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడానికి కుప్టి ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తామన్నారు. అడ్డగోలుగా పెరుగుతున్న గ్యాస్ సిలిండర్ ధర తగ్గించి రూ.500కే వంట గ్యాస్ ఇస్తామన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించుకొని పీపుల్స్ గవర్నమెంట్‌ను తెచ్చుకుందామని పిలుపునిచ్చారు.

నిరుద్యోగుల జీవితాలతో సర్కార్ చెలగాటం: రేవంత్



యాత్రలో దివ్యాంగుడి వీల్‌చైర్ తోసుకుంటూ వెళ్తున్న రేవంత్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ఆర్మూర్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకులతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని పెర్కిట్ శివారు నుంచి ఆర్మూర్ పాత బస్టాండ్ వరకు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. అంతకుముందు నవనాథ సిద్దులగుట్టపై గల శివాలయంలో పూజలు చేశారు. పెర్కిట్‌లో గల్ఫ్‌బాధి తులు, దళిత, ప్రజా సంఘాల నేతలతో పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు ఆయన లక్కంపల్లి సెజ్ ను సందర్శించారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వల్లే సెజ్‌కు గ్రహణం పట్టిందని ఆరోపించారు.

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో సీడీపీఓ, ఏసీడీపీఓ, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) ఉద్యోగ అర్హత పరీక్షల ప్రశ్నపత్రాలు కూడా లీకైనట్లు అనుమానాలున్నాయని నిరుద్యోగ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

బీజేపీ ఖాతాలో టీచర్ ఎమ్మెల్సీ

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం
- పార్టీ కార్యాలయంలో బీజేపీ నేతల సంబరాలు... పార్టీ అభ్యర్థికి ఓటేసిన టీచర్లకు బండి సంజయ్ సెల్యూట్
- చరిత్రాత్మక విజయమన్న అమిత్ షా



ఏవీఎన్ రెడ్డిని అభినందిస్తున్న బండి సంజయ్. చిత్రంలో ఇంద్రసేనారెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపొందారు. సమీప ప్రత్యర్థి (పీఆర్‌టీయూటీఎస్) గుర్రం చెన్నకేశవరెడ్డిపై ఆయన 1,169 ఓట్లు అధికంగా సాధించారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 29,720 మంది ఓటర్లు ఉండగా వారిలో 25,868 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 21 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఏవీఎస్ రెడ్డి 13,436 ఓట్లు సాధించి ఎన్నికల్లో గెలుపొందారు.

బీజేపీ సంబరాలు...

ఏవీఎన్ రెడ్డి విజయంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఏవీఎన్ రెడ్డిని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సన్మానించారు. ఆయన విజయానికి పార్టీ తరఫున కృషి చేసిన నల్లు ఇంద్రసేనారెడ్డి, ఎన్.రామచంద్రరావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సుభాష్ చందర్‌జీలను అభినందించారు. సంజయ్ సారథ్యం ఫలితంగానే తాను గెలిచినట్లు వ్యాఖ్యానించిన ఏవీఎన్ రెడ్డి... బీజేపీ నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం అక్కడ జరిగిన విజయోత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, డా.జి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యకర్తలు బాణసంచా పేల్చి బ్యాండ్‌మేళాలతో సంబరాలు చేసుకున్నారు. సంజయ్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థికి ఓటేసిన టీచర్లకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. '317 జీవోతో చెట్టుకొకరినీ.. పుట్టకొకరినీ చేసినందుకు, పీఆర్‌సీ కమిటీ ప్రకటించనందుకు, 3 డీఏలు బాకీ ఉన్నందుకు సీఎం కేసీఆర్‌కు తాము ఏమిటనేది ఈ ఎన్నికల్లో టీచర్లు చూపించారు. సీఎంకు కొమ్ము కాసే ఉపాధ్యాయ సంఘాలకు ఇదో గుణపాఠం. టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తాం'అని పేర్కొన్నారు.

బీజేపీ అగ్రనేతల ట్వీట్లు

ఏవీఎస్ రెడ్డి విజయంపట్ల బీజేపీ అగ్రనేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మక విజయమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు అవినీతి ప్రభుత్వంతో విసిగిపోయారని, మోదీ నాయకత్వంలో పారదర్శక, పేదలపక్ష ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఈ విజయం తెలియజేస్తోందని శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను తిరస్కరించి మోదీ సారథ్యంలోని బీజేపీని ముందుచూపుతో హత్తుకున్నారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ట్వీట్ చేశారు. 'ఇది పేదల వ్యతిరేక, అభివృద్ధి నిరోధక, అవినీతి, కుటుంబ బీఆర్‌ఎస్‌పై, ఆ పార్టీ అహంభావ, గర్విష్ఠి నాయకత్వంపై ప్రజలిచ్చిన మరో తీర్పు' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు.

బీజేపీలో నయాజోష్...

సాక్షి, హైదరాబాద్: టీచర్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ద్వారా బీజేపీకి శాసనమండలిలో మళ్లీ ప్రాతినిధ్యం లభించినట్లు అయింది. గతంలో గ్రాడ్యుయేట్‌గా ఎమ్మెల్సీగా రాంచందర్‌రావు పార్టీపక్షాన ప్రజాసమస్యలను లేవనెత్తేవారు. ఆ తర్వాత కౌన్సిల్‌లో పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. టీచర్లు, ఉద్యోగుల స్థానికత, బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన 317 జీవోకు వ్యతిరేకంగా తాము నిర్వహించిన ఆందోళనలు, కేసీఆర్ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు, టీచర్లు సహా ప్రజాసమస్యలపై తమ పోరాటాలకు ఈ గెలుపు రూపంలో మద్దతు లభించిందని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల అధినేత అయిన ఏవీఎన్ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ లభించడంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కీలకపాత్ర పోషించారు. ఏవీఎన్ రెడ్డిని పోటీ చేయించి గెలిపిస్తే మరికొందరు బీజేపీలో చేరడం ఖాయమంటూ అధిష్టానాన్ని ఒప్పించారు. అందుకే ఇప్పటిదాకా ఎవరికీ నేరుగా బీఫారం ఇవ్వని బీజేపీ.. ఏవీఎన్ రెడ్డికి టికెట్ ఇచ్చి గెలిపించుకుంది.

బీజేపీపై దర్యాప్తు కొనసాగించొద్దు

ఎమ్మెల్యేలకు ఎర కేసులో తెలంగాణ పోలీసులకు స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్యేలకు ఎర కేసులో బీజేపీపై దర్యాప్తు కొనసాగించొద్దని తెలంగాణ పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేంద్రం, తెలంగాణ సీఎం మినహా మిగిలిన ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. ఎమ్మెల్యేలకు ఎర కేసులో సిట్‌ను రద్దు చేస్తూ, సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. గత విచారణ సమయంలో కోర్టు పరిధిలో కేసు ఉన్నందున దర్యాప్తు కొనసాగించొద్దని ధర్మాసనం పేర్కొన్న విషయం విదితమే. తెలంగాణ పోలీసులు (సిట్) ఈ కేసుపై దర్యాప్తు చేస్తోందా అని ధర్మాసనం ప్రశ్నించగా, నిలిపివేసిందని తెలంగాణ ప్రభుత్వ తరపు న్యాయవాది దుష్యంత్ దవే తెలిపారు. కేంద్రానికి, తెలంగాణ సీఎంకు నోటీసుల అంశాన్ని ధర్మాసనం దృష్టికి దవే తీసుకురాగా, కేంద్రానికి నోటీసులు ఎందుకివ్వాలని ప్రశ్నించింది. కేంద్రం తెలంగాణ సీఎం మినహా, మిగిలిన ప్రతివాదులందరికీ(సీబీఐ సహా) జారీ చేసింది. జూలై 31న ప్రారంభమయ్యే వారంలో నాన్ మిస్‌లీనియెస్ డే రోజున తదుపరి విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

సాక్షి హైదరాబాద్

శనివారం ✦ 18 ✦ మార్చి ✦ 2023



స్వప్నలోక్ కాంప్లెక్స్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

నిరుపేదలు.. విద్యార్థులే

క్యూ నెట్ వలలో చిక్కి మోసపోయారని విలపించిన తల్లిదండ్రులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులే. కూలీ, వ్యవసాయ నేపథ్యంగల వారి కుటుంబాలను కదిలిస్తే ప్రతిఒక్కరిదీ వ్యథాభరిత కన్నీటి గాథే. ముదిమి వయసులో చేతికి అందివస్తారనే గంపెడు ఆశతో కాయకష్టం చేసి ఉన్నత చదువులు చదివించి నగరానికి పంపిస్తే విగత జీవులుగా తిరిగి వచ్చారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. పొలం దున్ని, కూలీ పనులు చేసి, అప్పు చేసి లక్షలాది రూపాయలు పెట్టుబడిపెట్టి 'క్యూ నెట్' వలలో చిక్కుకున్నామంటూ బోరుమన్నారు. తమ పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుకున్న క్యూ నెట్ సంస్థ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని, వసూలు చేసిన సొమ్మును వడ్డీతో చెల్లించేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం తమను అన్నివిధాల ఆదుకోవాలని అభ్యర్థించారు. సికింద్రాబాద్ గాంధీమార్చురీ వద్ద మృతుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు 'సాక్షి'తో మాట్లాడుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లిన తమ పిల్లల జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.



మొదటి జీతం వస్తది.. మీకు పంపిస్తా...



గురువారం సాయంత్రం ఫోన్ చేసి మొదటి సారిగా ఈ నెలలో జీతం వస్తుంది. రాగానే మీకు పంపిస్తా.. నా కాళ్ల మీద నేను నిలబడే రోజు వచ్చింది.. అంతా హ్యాపీ అంటూ చెప్పిన శ్రావణి (22) కంటికి కనిపించకుండా వెళ్లిపోయిందని తల్లితండ్రులు నర్సింహ, పద్మలు బోరున విలపించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఖానాపురం తండాకు చెందిన వీరు హోటల్ వర్కర్లు. శ్రావణి బీటెక్ వరకు చదివి ఏడాది క్రితం నగరానికి వచ్చి క్యూనెట్ సంస్థలో చేరింది.

ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తా అన్నది...



ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి, పువ్వుల్లో పెట్టి చూసుకుంటా అని చెప్పిన బిడ్డ కనబడని తీరాలకు వెళ్లిపోయిందని మృతురాలు ప్రమీల (25) తల్లిదండ్రులు జాటోతు బుజ్జి, భద్రులు విలపించారు. మహబూబాబాద్ సురేష్‌నగర్ తండాకు చెందిన వ్యవసాయ కార్మికులైన వీరికి ప్రమీల ఒక్కతే కుమార్తె. ఏడాది క్రితం రూ.2.10 లక్షలు చెల్లించి క్యూనెట్ సంస్థలో చేరింది.

రెండు రోజుల్లో స్నేహితురాలి పెళ్లికి వస్తానంది..



రెండు రోజుల్లో జరిగే తన స్నేహితురాలి పెళ్లికి తప్పకుండా ఊరికి వస్తానని మాటిచ్చిన నా బిడ్డ, అందనంత దూరాలకు వెళ్లిపోయిందని మృతురాలు వెన్నెల తల్లితండ్రులు రవి, లక్ష్మిలు బోరుమన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మర్పల్లికి చెందిన వెన్నెల (22) ఏడాదిన్నర క్రితం నగరానికి వచ్చింది. క్యూనెట్ సంస్థలో చేరి రూ.1.50 లక్షలు చెల్లించింది. హాస్టల్ ఖర్చులకు తామే డబ్బు పంపించామని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

డబ్బు సంపాదించి మీ కష్టాలు తీరుస్తా అన్నది...



ఎంతో కష్టపడి, అప్పు చేసి మమ్మల్ని చదివించారు. ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించి మిమ్మల్ని సుఖపెట్టాలి..మీ కష్టాలు తీర్చాలి. అదే నా కోరిక అంటూ చెప్పిన త్రివేణి (22) విగతజీవిగా మారిందంటూ హృదయవిదారకంగా రోదించారు తల్లితండ్రులు రామారావు, రమ, సోదరి మమతలు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లికి చెందిన త్రివేణి రూ.3 లక్షలు చెల్లించి క్యూనెట్ సంస్థలో చేరింది.

రాత్రికి ఫోన్ చేస్తా అమ్మా అన్నడు



గురువారం మధ్యాహ్నం 4 గంటలకు ఫోన్ చేశాడు. ఆఫీసు పని అయ్యాక రాత్రికి ఫోన్ చేస్తా అన్నాడు..ఇప్పటికీ వాడి మాటలు గింగిర్లు తిరుగుతూనే ఉన్నాయంటూ మృతుడు అమరాజు ప్రశాంత్ (23) తల్లిదండ్రులు ఉపేంద్రమ్మ, జనార్దన్‌లు కన్నీటి పర్యంతమయ్యారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన వీరు వ్యవసాయకూలీలు. ఏడాది క్రితం నగరానికి వచ్చిన ప్రశాంత్ క్యూనెట్ సంస్థలో టీం లీడరుగా పనిచేస్తున్నాడు.

మిమ్మల్ని ఇక్కడికే షిఫ్ట్ చేస్తా అన్నడు



మరో ఏడాదిలో బీటెక్ పూర్తవుతుంది, మంచి జాబ్‌లో సెటిల్ అవుతా, మీఅందరినీ ఇక్కడికే షిఫ్ట్ చేస్తా అని చెప్పిన నా బిడ్డ శివ (22)ను ఇక్కడే విగతజీవిగా చూస్తామని కలలో కూడా అనుకోలేదని తల్లితండ్రులు రాజు, రజితలు విలపించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం చంద్రాయిపల్లికి చెందిన వీరు వ్యవసాయ కూలీలు. రూ.1.60 లక్షలు అప్పుచేసి క్యూనెట్ సంస్థలో శివను చేర్పించారు.



ఉద్రిక్తత మధ్య పోస్టుమార్టం

- గాంధీ ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన
- మంత్రుల సందర్శన.. రూ.5 లక్షలు నష్టపరిహారం
- ప్రత్యేక అంబులెన్స్‌ల్లో స్వస్థలాలకు మృతదేహాలు



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రులు తలసాని, మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి

గాంధీఆస్పత్రి : స్వప్నలోక్ కాంప్లెక్స్ ప్రమాద ఘటనలో మృతిచెందిన వారి బంధువులు, తల్లిదండ్రుల ఆందోళనలతో గాంధీ మార్చురీ వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఇక్కడికి తరలించగా...బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. బాధితులు హృదయవిదారక ఆక్రందనలు చూపరుల కంట కన్నీరు పెట్టించాయి. ఈ నేపథ్యంలో గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో భారీస్థాయిలో మోహరించిన పోలీసులు మీడియాకు అనుమతించలేదు. మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, మహమూద్ అలీ, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిలు గాంధీమార్చురీ వద్ద మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. ఈ క్రమంలో క్యూనెట్ సంస్థ నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్, బీజేపీ, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు వారికి జత కలిశారు. సాయంత్రం 3 గంటల సమయంలో మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామాలకు తరలించారు.

స్వప్నలోక్ కాంప్లెక్స్ సీజ్:మంత్రి తలసాని
ప్రమాదం జరిగిన స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను సీజ్ చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. గాంధీమార్చురీ వద్ద మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు సరైన జాగ్రత్తలు పాటించని గోడౌన్లు, భవన యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం తరుపున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని, ప్రమాద ఘటనపై దర్యాప్తు జరుగుతోందన్నారు.

నో సేఫ్టీ @స్వప్నలోక్

కాంప్లెక్స్‌లో కనీస భద్రతా చర్యలు లేవు


- సైరన్ మోగి ఉంటే ప్రమాదం తప్పేది!
- సాధారణ వేళల్లో జరిగే ఉదంతాల్లో ప్రాణనష్టం అరుదు
- ఈ ప్రమాదంలో ఆరుగురు బలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అత్యంత పురాతనమైన స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అవసరమైన స్థాయిలో ఫైర్ సేఫ్టీ మెజర్స్ లేవు. కొద్దోగొప్పో ఉన్నవి కూడా పని చేయకుండా నామ్ కే వాస్తేగా మారాయి. అత్యాధునిక, అత్యంత ఖరీదైన ఉపకరణాల మాట అటుంచితే కనీసం ఓ సైరన్ ఉన్నా విలువైన ఆరు ప్రాణాలు దక్కేవని అధికారులు చెబుతున్నారు.

ఆ వేళల్లోనే ప్రాణనష్టానికి ఆస్కారం...
ఉస్మాన్‌గంజ్ కార్తికేయ లాడ్జ్, బోయగూడలోని స్క్రాప్ దుకాణంలో, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రూబీ లాడ్జ్‌లాంటి అనేక ప్రమాదాల్లో భారీ ప్రాణనష్టం నమోదైంది. అయితే ఇవన్నీ అర్ధ రాత్రి లేదా తెల్లవారుజాముల్లోనే చోటు చేసుకున్నాయి. ఆయా సమయాల్లో వాటిలో ఉండే కస్టమర్లు, కార్మికులు నిద్రలో ఉంటారు. ఫలితంగా అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని అప్రమత్తం కావడానికి, చేయడానికి ఆస్కారం ఉండదు. ఈ కారణంగానే అనేక మంది నిద్రలోనే తుది శ్వాస విడుస్తుండటంతో మృతుల సంఖ్య ఉండటం, పెరగడం జరుగుతుంటాయి.

స్వప్నలోక్‌లో ఆ సమయం కాకపోయినా...
ఈ సమయాల్లో కాకుండా ఉదయం పూట, పని వేళలతో పాటు సాధారణ సమయాల్లోనూ సిటీలో అగ్నిప్రమాదాలు జరిగాయి. సోమాజీగూడలోని పార్క్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోనూ 2011లో పట్టపగలు భారీ ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుంది. అప్రమత్తమైన అధికారులు దాదాపు 50 మందిని రెస్క్యూ చేయగలిగారు. స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోనూ గురువారం రాత్రి 7.15 గంటలకే మంటలు రేగాయి. ఈ విషయం కొందరు దుకాణదారులు గుర్తించి బయటకు వచ్చేశారు. దీనిపై అప్రమత్తం చేయడానికి ఫైర్ అలెర్ట్ సైరన్, అలారం ఉండి, ప్రతి ఫ్లోర్‌లోను స్విచ్‌లు ఏర్పాటు చేస్తే పరిస్థితి వేరుగా ఉండేది. పొగలు చుట్టుముట్టక ముందే ఆ ఆరుగురూ కూడా బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకోవడానికి ఆస్కారం ఉండేది.

నోటీసులకు సమాధానమూ ఇవ్వలేదు...
సికింద్రాబాద్‌లోని మినిస్టర్స్ రోడ్‌లోని డెక్కన్ మాల్‌లో ఈ ఏడాది జనవరిలో జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర కలకలం సృష్టించింది. దీంతో నగరంలో ఉన్న షాపింగ్ మాల్స్, భారీ భవనాల్లో అగ్నిమాపక, జీహెచ్ఎంసీ బృందాలు తనిఖీలకు ఉపక్రమించాయి. వీటిలో భాగంగా స్వప్నలోక్‌నూ సందర్శించిన టీమ్స్ భద్రతా లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశాయి. వాటిని సరి చేయడంపై అసోసియేషన్ అవసరమైన స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో ఈ ప్రమాదం జరిగిన ఆరుగురు యువత అశువులు బాశారు. ఈ కాంప్లెక్స్‌కు నోటీసులు ఇచ్చిన అధికారులు సైతం పరిస్థితుల్లో ఏదైనా మార్పు వచ్చిందా? లేదా? అన్నది పట్టించుకోలేదు.



ఇంకెన్నాళ్లు!

సికింద్రాబాద్ జోన్‌లోనే వరుస అగ్ని ప్రమాదాలు

- భద్రతా చర్యలు చేపట్టని జీహెచ్ఎంసీ
- రూబీ హోటల్.. డెక్కన్ భవనం.. స్వప్నలోక్‌లలో వరుస ప్రమాదాలు

సాక్షి, సిటీబ్యూరో: బోయగూడలోని తుక్కు దుకాణం 11 మందిని పొట్టన పెట్టుకుంది. రూబీ లాడ్జి ఎనిమిది మంది ఉసురు తీసింది. మినిస్టర్స్ రోడ్‌లోని డెక్కన్ కార్పొరేట్ భవనంలో ముగ్గురు మృతి చెందారు. తాజాగా స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఆరుగురు చనిపోయారు. ఇలా నగరంలో నిత్యం ఏదో ఒక చోట అగ్ని ప్రమాదం వెలుగు చూస్తూనే ఉంది. ఎవరో ఒకరు కాలిబూడదవుతూనే ఉన్నారు. సికింద్రాబాద్ జోన్ కేంద్రంగా ఇటీవల వరుస అగ్ని ప్రమాదాలు వెలుగు చూస్తుండటం..పొట్ట చేతపట్టుకుని ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన కార్మికులు, కూలీలు, ఈ అగ్ని ప్రమాదాల్లో చిక్కుకుని మృత్యువాతపడుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. ఇంకెన్ని ఘటనలు వెలుగు చూడాలి? ఇంకెంత మంది బతుకులు కూలాలి? అంటూ సిటీజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ లోపం వల్లే షార్ట్‌సర్క్యూట్‌లు
40 ఏళ్ల క్రితం 8 అంతస్తులతో స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈ భవనంలో విద్యుత్ లైన్ల నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఏళ్ల క్రితం అమర్చిన విద్యుత్ లైన్లే ఇప్పటికీ వాడుతున్నారు. అప్పట్లో పెద్దగా విద్యుత్ వినియోగం ఉండేది కాదు. కేవలం లైట్లు, ఫ్యాన్ల వినియోగం సామర్థ్యం మేరకే కేబుళ్లు వేశారు. తర్వాత క్రమంగా విద్యుత్ వినియోగం రెట్టింపైంది. కానీ దీనికి తగ్గట్లుగా బిల్డింగ్ విద్యుత్ లైన్ల వ్యవస్థలో మార్పులు చేయలేదు.



భవన నిర్మాణంపై నివేదిక కోరిన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్ని ప్రమాదం నేపథ్యంలో బహుళ అంతస్తుల భవన సముదాయం నిర్మాణ స్థిరత్వాన్ని పరిశీలించి నివేదిక అందజేయాలని జేఎన్‌టీయూ హెచ్‌కు జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసింది. అప్పటివరకు భవన సముదాయం తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ వెల్లడించారు. అదేవిధంగా రక్షణ చర్యలు పరిశీలించి అగ్నిమాపక సేవల విభాగం చర్యలు చేపడుతుందని, జీహెచ్ఎంసీతో సమన్వయంగా పనిచేస్తుందని తెలిపారు.

మచ్చుకు కొన్ని ప్రమాదాలు

- ఉస్మాన్‌గంజ్‌లోని కార్తికేయ లాడ్జి గ్రౌండ్ ఫ్లోర్‌లో శాంతి ఫైర్స్ వర్క్స్ ఉండేది. అప్పట్లో అక్కడ పెద్ద మొత్తంలో బాణసంచాను నిల్వ చేశారు. 2002లో అక్టోబర్ 23న తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. అప్పటికే లాడ్జిలో 32 మంది నిద్రలో ఉండగా, వీరిలో 12 మంది అగ్నికీలల్లో చిక్కుకుని మృత్యువాతపడ్డారు.
- సికింద్రాబాద్ రూబీ లాడ్జిలో ఇటీవల అగ్ని ప్రమాదం వెలుగు చూసింది. సెల్లార్‌లో ఉన్న ఎలక్ట్రికల్ బైక్స్ షోరూమ్‌లో షార్ట్‌సర్క్యూట్ తలెత్తి..పైన లాడ్జిలో ఉన్న 12 మంది మృతి చెందగా, మరో పదిమంది క్షతగాత్రులయ్యారు.
- 2018లో ఎల్బీనగర్‌లోని షైన్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఐసీయూల్లోని ఫొటో థెరపీ యూనిట్లపై చికిత్స పొందుతున్న ఐదుగురు చిన్నారులు కాలిబూడిదయ్యారు.
- 2022 మార్చి 23న న్యూ బోయగూడలోని శ్రావణ్ ట్రేడర్స్ పేరుతో ఉన్న ఓ స్క్రాప్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం వెలుగు చూసింది. 11 మంది మృత్యువాతపడ్డారు.
- ఇటీవల డెక్కన్ మాల్‌లో వెలుగు చూసిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు. ఈ ఘటన తర్వాత అధికారులు ఆగమేఘాల మీద టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. రెండు మీటింగ్‌లకు మాత్రమే కమిటీ పరిమితమైంది.
- 2017 ఫిబ్రవరి 24న అత్తాపూర్‌లోని పిల్లర్ నంబర్ 253 సమీపంలో ఉన్న కూలర్ల తయారీ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒరిస్సాకు చెందిన ఆరుగురు మృతి చెందారు.
- 2012 నవంబర్ 24న పుప్పాల్‌గూడలోని బాబాని వాస్ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది చనిపోయారు.
- 2006 అక్టోబర్ 21న సోమాజిగూడలోని మీన జ్యూవెలర్స్ భవనం సెల్లార్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పెయింటింగ్ పనుల కోసం వచ్చిన ముగ్గురు చనిపోయారు.
- పురాతన సికింద్రాబాద్ క్లబ్ సహా అనురాధ టింబర్ డిపోల్లో వెలుగు చూసిన అగ్ని ప్రమాదాలకు కూడా ఈ షార్ట్‌షర్క్యూట్లే కారణమని తెలిసింది. అయితే ఆయా ఘటనల్లో ప్రాణ నష్టం లేకపోయినప్పటికీ..భారీగా ఆస్తినష్టం వాటిల్లింది

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వెలువడిన మొదటి గ్రూప్–1 నోటిఫికేషన్ అది. ఏళ్లకు ఏళ్లుగా ఉద్యోగాల కోసం పోటీకి సన్నద్ధమవుతున్న లక్షలాది మందిని ఆ ప్రకటన ఉరకలెత్తించింది. ప్రకటించినవి కొద్దిపాటి పోస్టులే అయినా భవిష్యత్తుపైన ఆశలు పెంచింది. జీవితం పట్ల, కెరీర్ పట్ల ఒక ఆశావహమైన దృక్పథాన్ని కలిగించింది. గతేడాది అక్టోబర్ 16న జరిగిన ప్రిలిమ్స్‌లో వేలాది మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఎట్లయినా సరే ఈసారి గ్రూప్–1 కొట్టాల్సిందేననే పట్టుదలతో రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు. కానీ శుక్రవారం ఒక్క వేటుతో గ్రూప్–1 రద్దయింది. దాంతో పాటు జనవరిలో జరిగిన ఏఈఈ, డీఏఓ పరీక్షలను సైతం ప్రభుత్వం రద్దు చేసింది. ఒక్కడు చేసిన నిర్వాకం వల్ల లక్షలాది మంది అభ్యర్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కోచింగ్‌లు, పుస్తకాలు, స్టడీమెటీరియల్, భోజనం, వసతి, తదితర అవసరాల కోసం రూ.లక్షల్లో వెచ్చించి చదువుకుంటున్న లక్షలాది మంది అభ్యర్థులు పరీక్షల రద్దుతో ఆందోళనలో పడ్డారు. జూన్‌లో మళ్లీ గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. కానీ ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితి వల్ల చాలామంది దానిపైన నమ్మకాన్ని కోల్పోయారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఒక్కడు చేసిన పాపం.. ఎందరికో శాపం

- పిడుగుపాటుగా పోటీపరీక్షల రద్దు
- లక్షలాది మంది అభ్యర్థుల్లో ఆందోళన
- రెండేళ్లుగా పోటీపరీక్షల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు
- గ్రూప్–1, ఏఈఈ, డీఏఓ పరీక్షల రద్దుతో అనిశ్చితి
- కోచింగ్‌లు, వసతి, మెటీరియల్ కోసం రూ.లక్షలు ఖర్చు చేసిన విద్యార్థులు

పరీక్షల రద్దు ప్రకటన వేలాది మందికి అశనిపాతమే అయింది. పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కేరాఫ్‌గా మారిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, అశోక్‌నగర్, తదితర ప్రాంతాలు పరీక్షల రద్దు ప్రకటనతో ఉలిక్కిపడ్డాయి. అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న వేలాది మందిలో గందరగోళం నెలకొంది. ఒక్క సిటీసెంట్రల్ లైబ్రరీలోనే కాదు..అశోక్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని అద్దె గదుల్లో, స్టడీరూమ్‌లలో, కోచింగ్ కేంద్రాల్లోనూ చదువుకుంటున్న లక్షలాది మంది అభ్యర్థులు కొద్ది రోజులుగా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అశోక్‌నగర్ ప్రాంతంలోనే చిన్నవి, పెద్దవి సుమారు 30కి పైగా కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. వయోపరిమితిలో చివరకు చేరుకొన్న అభ్యర్థులు మొదలుకొని, ఈ ఏడాదే డిగ్రీ పూర్తయిన విద్యార్థుల వరకు ఒక్కో అభ్యర్థి కోచింగ్‌కు, మెటీరియల్‌కు, ఇళ్ల అద్దె, భోజనం తదితర సదుపాయాల కోసం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన అభ్యర్థులంతా ప్రస్తుతం హైదరాబాద్‌లోనే మకాంవేసి ఉంటున్నారు.'పరీక్షల రద్దుతో చదవడం మానేసి ఇంటికి వెళ్లాలా లేకపోతే మరో ప్రకటన కోసం ఎదురు చూస్తూ చదువుకోవాలా' తేల్చుకోలేకపోతున్నట్లు పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

పొలం అమ్ముకున్నాడు



బోధన్ సమీపంలోని కోటగిరి ప్రాంతానికి చెందిన శంకర్ కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ఉన్న కొద్దిపాటి భూమిలో అర ఎకరం భూమిని తన చదువుల కోసమే అమ్మేశారు. మరో రూ.6 లక్షలు అప్పు చేయవలసి వచ్చింది. రెండేళ్లుగా కష్టపడి చదువుతున్నాడు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించాడు. మెయిన్స్‌లోనూ విజయం సాధిస్తాననే గట్టి నమ్మకంతో ఉన్నాడు.'ఐదు రూపాయల భోజనం తిని చదువుకుంటున్నాను. స్టడీమెటీరియల్, కోచింగ్, పరీక్షల కోసమే ఎక్కువ ఖర్చు చేస్తున్నా. ఇటీవల ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది. అయినా సరే ఉద్యోగం వస్తే అంతా బాగుంటుందనే ఆశతో ఉన్నాను. కానీ ఇప్పుడు ఇలా అయింది.' అని ఆవేదన వ్యక్తం చేశాడు. హైదరాబాద్‌లో ఉండాలా, వద్దా తేల్చుకోలేకపోతున్నట్లు చెప్పాడు.

ఏం సమాధానం చెప్పాలి



సంగారెడ్డికి చెందిన పద్మావతి ఏడాదిన్నర కాలంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇంటికి, కుటుంబానికి దూరంగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఈసారి ఎలాగైనా జాబ్ గ్యారెంటీ అనే నమ్మకంతో ఉన్నారు. కానీ ప్రస్తుత పరిణామాలు ఆమె నమ్మకాన్ని వమ్ము చేశాయి. 'ఎప్పటి వరకు ప్రిపరేషన్ పూర్తవుతుంది. పరీక్షలు ఎప్పుడు రాస్తావు, మళ్లీ ఇంటికి ఎప్పుడొస్తావు అని నాన్న అడుగుతున్నారు. కానీ ఏం సమాధానం చెప్పాలి?' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



సిటీ సెంట్రల్ లైబ్రరీలో అభ్యర్థులు..

రద్దు మంచిదే



'ఒకవిధంగా రద్దు చేయడం మంచిదే. లీకేజీ వల్ల నిజాయితీగా కష్టపడే వాళ్లకు అన్యాయం జరుగుతుంది. కానీ లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలో ఒక ప్రభుత్వ సంస్థ ఇంత బలహీనంగా ఉండడమే ఆందోళన కలిగిస్తోంది' అని మరో అభ్యర్థిని విజయలక్ష్మి పేర్కొన్నారు.

రద్దు అన్యాయం



నేను గ్రూప్–1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాను. మెయిన్స్‌కు చాలా సీరియస్‌గా ప్రిపేర్ అవుతున్న సమయంలో పేపర్ లీక్ అంటూ రద్దు చేశారు. ఇది చాలా అన్యాయం. ఎవడో తప్పు చేస్తే నిజాయితీగా రాసిన వేలాదిమంది అభ్యర్థులను పరిగణనలోనికి తీసుకోకుండా పరీక్ష పూర్తిగా రద్దు చేయడం అన్యాయం. తప్పు చేసిన వారిని గుర్తించి శిక్షించాలి కానీ అందరికి శిక్ష వేడం సరికాదు. ఈ విషయంలో పునరాలోచించి మాలాంటి వారికి న్యాయం చేయాలని కోరుతున్నా.

– పిట్ల సరిత, డిచ్‌పల్లి, గ్రూప్–1 అభ్యర్థి

సగటున ఒక అభ్యర్థి ఖర్చులు అంచనా..

- నలుగురితో కలిసి ప్రతి నెలా చెల్లించే ఇంటి అద్దె : రూ.3500
- నెల భోజనం ఖర్చు : రూ.2900
- స్టడీరూమ్ (ఏసీ) రూ.1700
- స్టడీరూమ్ (నాన్ ఏసీ) రూ.900
- గ్రూప్–1 కోచింగ్ ఫీజు రూ. 75,000
- గ్రూప్–2, కోచింగ్ ఫీజు రూ.28,000
- స్టడీ మెటీరియల్ రూ.15000
- ఒక అభ్యర్థికి ఏడాదికి అయ్యే ఖర్చు సుమారు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు.
- మరిన్ని అదనపు సదుపాయాలతో చదువుకుంటే రూ.3 లక్షలపైనే ఖర్చవుతుంది.

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు రద్దు

- గెజిట్ జారీ చేసిన కేంద్రం
- సహేతుక కారణాలు వెల్లడించని వైనం
- జనరల్ క్లాసెస్ యాక్ట్–1897 అమలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ సహా దేశ వ్యాప్తంగా కంటోన్మెంట్ ఎన్నికల ప్రక్రియను నిలిచిపోయింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అధికారిక గెజిట్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 57 కంటోన్మెంట్‌లకు ఏప్రిల్ 30న ఎన్నికలు నిర్వహించనున్నట్లు గత నెల 17న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే సదరు ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ కేంద్రం తాజా ఉత్తర్వులు వెలువరించింది. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వినియోగించే జనరల్ క్లాసెస్ యాక్ట్ ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. కేంద్రం నిర్ణయంతో దేశ వ్యాప్తంగా 57 కంటోన్మెంట్‌లలో కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ గురువారమే పూర్తయ్యింది.


కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

ఏమిటీ జనరల్ క్లాసెస్ యాక్ట్?

- ఏదైనా అంశంపై కీలక నిర్ణయం తీసుకునేందుకు సంబంధిత చట్టంలో తగిన వెసులుబాటు లేనప్పుడు ఉపయోగించుకునేందుకు రూపొందించినదే జనరల్ క్లాసెస్ యాక్ట్ 1897.
- బ్రిటీష్ హయాంలోనే రూపొందించిన ఈ చట్టాన్ని కేంద్రం ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వినియోగిస్తుంది.
- కంటోన్మెంట్స్ యాక్ట్ 2006, సెక్షన్ 15 (1) ప్రకారం వెలువరించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేసేందుకు ఈ చట్టంలో ఎలాంటి వెసులుబాటు లేదు.
- కంటోన్మెంట్ ఎలక్టోరల్ రూల్స్ –2007, సెక్షన్ 20 ప్రకారం గరిష్టంగా 40 రోజుల వరకు, అదీ ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఎన్నికలు వాయిదా వేసే అవకాశం ఉంది.
- ఈ నేపథ్యంలో బోర్డు ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ భారీ కసరత్తు చేసి, ఎట్టకేలకు జనరల్ క్లాసెస్ యాక్ట్‌ను వినియోగించినట్లు తెలుస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల తర్వాతే...?

- కంటోన్మెంట్ ఎన్నికల రద్దుకు కేంద్రం సహేతుక కారణం, నిర్దీత వ్యవధిని వెల్లడించలేదు. విశ్వసనీయ సమాచారం మేరకు మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఒత్తిడి నేపథ్యంలోనే నోటిఫికేషన్ రద్దు చేసినట్లు సమాచారం.
- ఈ ఏడాది నవంబర్‌లో జరిగే మధ్యప్రదేశ్ ఎన్నికలు పూర్తయ్యేదాకా బోర్డు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని స్పష్టమవుతోంది.

కోపల్లి ఫార్మా యాజమాన్యంపై కేసు నమోదు

జీడిమెట్ల: కోపల్లి ఫార్మా పరిశ్రమ ఆవరణలో జరిగిన భారీ అగ్నిప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని అధికారులు నిర్ధారించారు. నిబంధనలు పాటించకుండా రసాయనాలు బహిరంగంగా వదిలివేసినందునే ప్రమాదం చోటు చేసుకుందన్నారు. శుక్రవారం సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే వివేకానంద, బీఆర్ఎస్ నాయకులు గుడిమెట్ల సురేష్‌రెడ్డి సందర్శించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకున్న ఎమ్మెల్యే పోలీసు, పీసీబీ అధికారులతో మాట్లాడారు. పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


కోపల్లి పరిశ్రమ ఆవరణలో రసాయన డ్రమ్ములు

మూడు రోజుల్లో రసాయనాలను తరలించాలి

కోపల్లి పరిశ్రమ ఆవరణలో ఉన్న రసాయనాలను డ్రమ్ములతో సహా మూడు రోజుల్లో రాంకీకి తరలించాలని పీసీబీ అధికారి రాజేందర్ పరిశ్రమ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. పరిశ్రమ ఆవరణలో ఎలాంటి రసాయనాలు ఉన్నా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పలు సెక్షన్లపై కేసులు..

నిర్లక్ష్యంగా రసాయనాలు వదిలివేసినందుకుగాను పరిశ్రమ యజమానిపై 336, 285, 286 సెక్షన్ల కింద జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

కుదిపేసిన వరుణుడు..!

- రోడ్లపై విరిగిపడిన చెట్లు
- తెగిన విద్యుత్, కేబుల్‌వైర్లు
- పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పెరిగిన చలితో నగరవాసుల ఇక్కట్లు
- టోలీచౌకీలో అత్యధికంగా 9.5 సెంటీమీటర్లు నమోదు
- మరో మూడు రోజుల పాటు వర్షాలు: వాతావరణశాఖ

నగరంలో వర్షపాతం నమోదు ఇలా

ప్రాంతం	సెంటీమీటర్లు
టోలిచౌకి	9.5
మైలార్‌దేవ్‌పల్లి	6.3
శివరాంపల్లి	5.9
ఖాజాగూడ	5.6
జీడిమెట్ల	5.6
జూపార్క్	5.1

సాక్షి,సిటీబ్యూరో: అకాల వర్షం నగరవాసులను అవస్థల పాలు చేసింది. గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగరంలోని టోలిచౌకీలో అత్యధికంగా 9.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపోవడం, కరెంట్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 330 ఫీడర్ల పరిధిలో కరెంట్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మెట్రో జోన్‌లోని 180 ఫీడర్లు, రంగారెడ్డి జోన్‌లో 150 ఫీడర్లు ట్రిప్పయ్యాయి. బాచుపల్లిలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదర్ నగర్, కూకట్‌పల్లి, శాంతినగర్, రాజేంద్రనగర్, బుద్వేల్‌లోని శివ సాయికాలనీ, రాజేంద్రనగర్, లంగర్ హౌజ్, బండ్లగూడ, సికింద్రాబాద్, తదితర ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

సౌంద్ స్ప్రింగ్ కలెక్షన్స్ ఆవిష్కరణ..

సరికొత్త స్ప్రింగ్ కలెక్షన్‌ను ప్రారంభించిన అనం మీర్జా

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా బంజరాహిల్స్ రోడ్ నంబర్ 10లోని సౌంద్ కలెక్షన్స్ వేదికగా స్ప్రింగ్ సమ్మర్–2023 నూతన కలెక్షన్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూకే హైకమిషనర్ గరేత్ వైన్ ఓవెన్ వరుణ్ మాలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకులు వైభవ్ షరీఫ్, నిరాలి మాట్లాడుతూ..., సంప్రదాయ, ఆధునికత సమ్మేళనంతో ఈ కలెక్షన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్టోర్ డిజైనర్ మహిళల దుస్తుల కేంద్రంగా మారిందని, ట్యూనిక్స్, డ్రెస్, చీరలు, లెహంగాలు తదితర ఫ్యాషన్ వేర్ ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. నగరం వారసత్వాన్ని, ప్రపంచ బ్రాండ్ తత్వాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చినట్లు తెలిపారు. స్ప్రింగ్ కలెక్షన్‌లో భాగంగా దేర్ షీ గోస్ నగరవాసులను అలరించనుందని వారు పేర్కొన్నారు.



కోలుకుంటున్న కానిస్టేబుల్ రవి కుటుంబసభ్యులు

రాంగోపాల్‌పేట : సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో అస్వస్థతకు గురైన కానిస్టేబుల్ రవి కుటుంబసభ్యులు యశోద ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. తుకారంగేట్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న రవి తండ్రి జంగయ్య స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గార్డెనర్‌గా పనిచేస్తూ, ఎనిమిదో అంతస్తులో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ప్రమాద సమయంలో కుటుంబసభ్యులను కాపాడేందుకు వెళ్లిన కానిస్టేబుల్ రవితోపాటు ఇంట్లో ఉన్న అతడి తల్లితండ్రులు జంగయ్య, భారతమ్మ, సోదరుడు రాజు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

ఫైర్ సిబ్బంది వారిని రక్షించి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. వైద్యసేవల అనంతరం వారు కోలుకుంటున్నారని, ప్రాణాపాయం లేదని వైద్యులు పేర్కొన్నారు.

వాకింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్

- పద్మారావునగర్ పార్కులో వ్యక్తి మృతి
- హైటెన్షన్ విద్యుత్ వైరు తెగిపడడంతో ప్రమాదం
- న్యాయం చేయాలని కుటుంబికుల ఆందోళన...


ప్రదీప్ (ఫైల్)

బన్సీలాల్‌పేట్: వాకింగ్ చేస్తున్న ఓ వ్యక్తి విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ముషీరాబాద్ బాపూజీనగర్ ప్రాంతానికి చెందిన ప్రదీప్ ముదిరాజ్ (40) ఇఫ్లూలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రదీప్ రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం వాకింగ్ చేసేందుకు పద్మారావు నగర్ పార్కుకు వచ్చాడు. వాకింగ్ చేస్తున్న అతను గురువారం రాత్రి కురిసిన వర్షం, గాలుల కారణంగా వాకింగ్ ట్రాక్‌పై పడిన హైటెన్షన్ విద్యుత్ వైర్‌ను చూసుకోకుండా దానిపై అడుగు పెట్టాడు. ఒక్కసారిగా కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె శ్రావణి, కుమారుడు జయనరసింహ ఉన్నారు. రోజూ ప్రదీప్ కుమార్తెతో కలిసి వాకింగ్‌కు వచ్చేవాడు. అయితే వర్షం కారణంగా శుక్రవారం శ్రావణి తండ్రితో రాలేదు. సమాచారం అందడంతో విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్, సీబీడీ ఏడీఈ ఆదినారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు బాధితులను పరామర్శించి శాఖ తరపున తగిన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పార్కు ఎదుట మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

ప్రదీప్ కుటుంబీకులు తమకు న్యాయం చేయాలంటూ పార్కు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఇంటి పెద్ద దిక్కు అకాల మరణంతో తాము రోడ్డున పడ్డామని తమను ప్రభుత్వం ఆదుకోవాలని భార్య లక్ష్మీ, కుమార్తె శ్రావణి విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి మద్దతుగా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.


మృతుడి కుటుంబీకులతో కలిసి ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ప్రదీప్ కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పబ్లిక్ ప్లేస్‌లో వాకింగ్ చేస్తున్న వ్యక్తి కరెంట్ షాక్‌తో మృతి చెందడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర మంత్రి తలసాని బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమన్నారు.

రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా : మంత్రి తలసాని

ప్రదీప్ మృతి బాధాకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రదీప్ కుటుంబానికి రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆపద్బంధు కింద మరో రూ. 50వేలు ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కన్నీళ్లు దిగమింగుకుంటూనే పరీక్షకు

ప్రదీప్ మృతదేహం వద్ద అతడి కుమారుడు జయనరసింహ బోరున విలపిస్తుండటం స్థానికులను కంటతడి పెట్టించింది. ఓ వైపు కళ్ల ముందు తండ్రి శవం మరో వైపు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయాల్సి ఉండటంతో అతడి బాధ వర్ణనాతీతం. బంధువుల ఒత్తిడి మేరకు జయసింహ కన్నీళ్లు దిగమింగుకుంటూ పరీక్షకు బయలుదేరి వెళ్లాడు.

కాంటినెంటల్ ఆసుపత్రిలో అరుదైన రోబోటిక్ సర్జరీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కాంటినెంటల్ హాస్పిటల్స్‌లో 60 ఏళ్ల మహిళా రోగికి రోబోటిక్ థైమెక్టమీ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. మస్తెనియా గ్రావిస్ అనే నాడీ సంబంధిత సమస్యతో బాధపడుతూ ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉన్న రోగికి ఈ రోబోటిక్ ప్రక్రియను నిర్వహించామన్నారు. దీనికి కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రదీప్ రాచకొండ సారథ్యం వహించినట్లు ఆసుపత్రి ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సమస్యకు సంప్రదాయ శస్త్రచికిత్సలో స్టెర్నమ్ (రొమ్ము–ఎముక) విచ్ఛిన్నం చేయాల్సి ఉంటుందని, అయితే రోబోటిక్ విధానం వల్ల తక్కువ గాయం కావడంతో రోగి వేగంగా కోలుకున్నట్లు వారు వివరించారు.



రేషన్ బియ్యం సక్రమంగా అందుతోందా..?

- రేషన్ షాపుల్లో కొనసాగుతున్న సోషల్ ఆడిట్
- కార్డుదారుల నుంచి సలహాలు స్వీకరించిన అధికారులు

బంజారాహిల్స్: రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా.? లేదా..? అనే విషయాలు తెలుసుకునేందుకు ఖైరతాబాద్ సర్కిల్–7 రేషనింగ్ అధికారులు రేషన్ షాపుల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రతినెలా సర్కిల్ పరిధిలో పది శాతం రేషన్ షాపుల్లో ఈ సోషల్ ఆడిట్ నిర్వహించి సరుకుల కోసం వచ్చిన కార్డుదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడతారు. వారిచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ప్రొఫార్మాలో నమోదుచేసి చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌కు పంపిస్తారు. ప్రతినెలా సర్కిల్ పరిధిలోని ఎనిమిది షాపుల్లో వారంలో రెండు చొప్పున రేషన్ షాపులను ఎంపిక చేసుకొని అక్కడ వినియోగదారులతో మాట్లాడి వారి సలహాలు, సూచనలు సేకరిస్తారు. రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో మొత్తం 81 రేషన్ షాపులు ఉండగా ఇందులో 83,127 తెల్ల రేషన్ కార్డుదారులున్నారు. ఒక అన్నపూర్ణ కార్డు, 3,368 అంత్యోదయ, అన్నయోజన కార్డులు ఉన్నాయి. ఈ కార్డులన్నింటిలో కలిపి 2,85,267 మంది వినియోగదారులు ప్రతి నెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నారు. సర్కిల్‌పరిధి కిందకువచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్,



భగత్‌సింగ్ కాలనీలోని రేషన్ షాపులో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న రేషనింగ్ అధికారులు...

వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ప్రతినెలా జరిగే ఈ సోషల్ ఆడిట్‌లో ప్రజాప్రతినిధులతో పాటు బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాల నేతలు పాల్గొంటూ రేషనింగ్ అధికారులకు తాము ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేయడంతో పాటు సూచనలు కూడా అందిస్తుంటారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడటానికే ఈ సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటారు. తమ రేషన్ షాపు వద్దకే రేషనింగ్ అధికారులు తనిఖీల కోసం వస్తుండటంతో వినియోగదారులు కూడా తమ ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్ళేందుకు ఆస్కారం ఏర్పడుతున్నది. రేషన్ డీలర్ నుంచి స్పందన సరిగ్గా లేకపోయినా, సమయానికి షాపు తెరవకపోయినా, సక్రమంగా రేషన్‌బియ్యం పంపిణీ చేయకపోయినా, వినియోగదారుల పాలిట సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఎంతో పారదర్శకంగా జరిగే ఈ సోషల్ ఆడిట్‌లో ప్రొఫార్మాలో రికార్డ్ చేసిన నివేదికను సీఆర్‌వోకు పంపించడం, అక్కడి నుంచి ప్రభుత్వానికి వెళ్ళడం జరుగుతున్నది.

సోషల్ ఆడిట్‌ను పరిశీలించిన కార్పొరేటర్...

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఎమ్మార్సీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీలలో ఉన్న రేషన్ షాపు నెంబర్ 814, 768లలో శుక్రవారం జరిగిన సోషల్ ఆడిట్‌ను స్థానిక కార్పొరేటర్ వెంకటేష్ పరిశీలించారు. ఇక్కడికి వచ్చిన వినియోగదారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రేషన్ బియ్యం పంపిణీలో ఏవైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని అధికారుల ముందే ప్రశ్నించారు. బియ్యం పంపిణీలో అవకతవకలు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. రేషన్ షాపుల్లో సోషల్ ఆడిట్ నిర్వహించడం వల్ల వినియోగదారుల సమస్యలు తెలుసుకోవడానికి వీలుంటుందని ఇదొక మంచి ప్రక్రియ అని ఆయన వెల్లడించారు. ఈ ఆడిట్‌లో రేషనింగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

యువతితో అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్: మాట్లాడదామని ఇంటికి పిలిచి ఓ యువతిని గదిలో బంధించి దుస్తులు తొలగించి అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఇష్టానుసారంగా దాడి చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న ఈవెంట్ వర్కర్(22)కు ఈ నెల 15వ తేదీన అంజి అనే వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడటానికి బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లో ఉన్న తన ఇంటికి రావాల్సిందిగా సూచించాడు. కొద్దిసేపట్లోనే అంజి తన భార్యతో బైక్‌పై నేరుగా హాస్టల్‌కు వచ్చి ఆమెను ఎక్కించుకొని ఇందిరానగర్‌లోని తన ఇంటికి తీసుకొచ్చాడు. రావడంతోనే బాధిత యువతిని దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా ఆమె తల్లిని అప్రతిష్టపాలు చేసే రీతిలో మాట్లాడాడు. ఈ విషయంలోనే ఈవెంట్ వర్కర్‌కు, అంజి, ఆయన భార్య మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలోనే అంజి సదరు ఈవెంట్ వర్కర్‌పై దాడి చేశాడు. పొత్తి కడుపులో పొడిచాడు. ఆమె తప్పించుకునేందుకు యత్నించగా గది తలుపులు వేసి గడియ వేసి ఆమె ఒంటిపై ఉన్న దుస్తులు తొలగిస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తుండగా ఇందుకు ఆయన భార్య కూడా సహకరించింది. కొద్దిసేపట్లోనే వారి నుంచి తప్పించుకొని బయటికి వచ్చిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసులు అంజిపై క్రిమినల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్

ఖైరతాబాద్: ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడే వారికోసం ఈ నెల 19న ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్థోపెడిక్ సర్జన్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కుశాల్ శుక్రవారం తెలిపారు. బర్కత్‌పురా పరిధిలోని సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ క్లినిక్‌లో ఈ శిబిరం ఉంటుందన్నారు. వివరాలకు 88972 12907 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

అరుదైన వ్యాధులపై అవగాహన కల్పించాలి

సనత్‌నగర్: జన్యుపరమైన సమస్యలతో వచ్చే అరుదైన వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప పేర్కొన్నారు. రేర్ డిసీజెస్ డే సందర్భంగా శుక్రవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ అండ్ హాస్పిటల్స్ ఫర్ జెనిటిక్ డిసీజెస్, క్యూర్ ఎస్ఎంఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సుకు బీరప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధులపై చాలామందికి అవగాహన లేకపోవడంతో ప్రారంభ దశలో వాటిని గుర్తించలేకపోతున్నారన్నారు. దీంతో వారికి సరైన వైద్యం అందించలేకపోతున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులకు సైతం రేర్ డిసీజెస్ పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అశ్విందలాల్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏడు వేలకు పైగా రేర్ డిసీజెస్ ఉన్నాయని, వాటిలో 80 శాతానికి పైగా జన్యుపరమైన సమస్యలతో వచ్చేవేనని చెప్పారు. 20 శాతం వ్యాధులకు మాత్రమే ప్రస్తుతం వైద్యం అందించగలుగుతున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ కలిగిన వారి కుటుంబాలకు ఈ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం


హిమాయత్‌నగర్‌లోని క్లియర్ విజన్ ఆసుపత్రిలో బండి సంజయ్

హిమాయత్‌నగర్: పేదలకు ఉచితంగా కంటికి సంబంధించిన అన్ని వ్యాధులకు చికిత్స అందించడం అభినందనీయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని క్లియర్ విజన్ ఐ ఆసుపత్రిలో గ్లకోమా అవగాహన సదస్సులో భాగంగా వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బండి సంజయ్ సందర్శించారు. శిబిరంలో డాక్టర్ ఎన్.నవీనా(ఐ సర్జన్) చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు.

సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

పంజగుట్ట: సైబర్ నేరాల విషయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని విపణి గ్రూప్ సీఈఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. గత ఎనిమిది సంవత్సరాలుగా తమ సంస్థ సుమారు 500 కంపెనీలతో బిజినెస్ టు బిజినెస్ చేస్తున్నామన్నారు. అయితే తమ సంస్థకు ఉన్న మంచిపేరును ఇటీవల కొంతమంది సైబర్ నేరగాళ్లు డబ్బు వసూలు చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ విషయమై సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న సిల్క్ గ్యాలరీ



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన సంప్రదాయ, సమ్మర్ స్పెషల్ కలెక్షన్ ఎగ్జిబిషన్ మహిళలను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈనెల 21 వరకు సుమారు 80స్టాల్స్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శిస్తున్నారు. దేశంలోని ప్రముఖ చేనేతకళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలు మగువల మనసుదోచుకుంటున్నాయి. చేనేత కళాకారులకు చేయూతను అందించడానికి ఈ ప్రదర్శనను ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్ తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లేని వాహనదారులకు జరిమానా

బంజారాహిల్స్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా దూసుకుపోతున్న స్కూటరిస్టులకు నాంపల్లిలోని పదో ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్‌పోలీసులు వేర్వేరు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో 13 మంది ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా చిక్కారు. వీరిపై కేసులు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపర్చారు. వీరందరికీ రూ.12100 జరిమానా విధించినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



రహమత్‌నగర్: బోరబండలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం 15వ (పంచదశ) వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం పడిపూడి మహోత్సవం వైభవంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్త లక్ష్మణ్‌గౌడ్, కమిటీ సభ్యులు బాలక్రిష్ణ పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు



రహమత్‌నగర్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో జూబ్లీహిల్స్ నియోజక వర్గం బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రహమత్‌నగర్ కూడలిలో శుక్రవారం విజయోత్సం నిర్వహించి మిఠాయిలు పంచారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ కన్వీనర్ కుంభాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు


జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఐరన్ గేట్

బంజారాహిల్స్: అత్యవసర పరిస్థితుల్లో చుట్టూ తిరిగే వెళ్ళే అవసరం లేకుండా వాహనాలు నేరుగా ముందుకు వెళ్ళే విధంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 జంక్షన్‌లో ఎమర్జెన్సీ ఐరన్ గేట్‌ను జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలల క్రితం ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్ళింపులు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి, గవర్నర్, ఇతర వీవీఐపీల రాకపోకల సందర్భంగా ఈ బారికేడ్లను జరపడం, మళ్ళీ యదాతథ స్థితికి తీసుకురావడం ఇదంతా పెద్ద తతంగంగా మారిన నేపథ్యంలో పర్మినెంట్‌గా ఆధునిక హంగులతో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఐరన్ గేట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తలుపులు ఏర్పాటు చేసి తాళం కూడా వేశారు. వీవీఐపీల రాకపోకల సందర్భంలో, హెల్త్ ఎమర్జెన్సీ సమయంలో గ్రీన్ ఛానెల్ కోసం, అత్యవసరంగా ఆస్పత్రులకు వెళ్ళే అంబులెన్స్‌ల కోసం తెరిచేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. ఇలాంటి ఐరన్ గేట్ కేవలం ప్రగతి భవన్, రాజ్‌భవన్ ముందు మాత్రమే ఉండగా తాజాగా జూబ్లీహిల్స్ బాలకృష్ణ ఇంటి చౌరస్తాలో ఏర్పాటు చేశారు.

సమాజాభివృద్ధిలో మాతృభాష కీలకం


సదస్సులో పాల్గొన్న అజీజ్ బానో తదితరులు..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కళల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన భాషా సాహిత్య ఫోరమ్‌లో భాగంగా మాతృభాషా ఉర్దూ ప్రాముఖ్యత అనే అంశంపై శుక్రవారం వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మౌలానా అజాద్ జాతీయ ఉర్దూవిశ్వవిద్యాలయం కళాశాల డీన్ ప్రొ. అజీజ్ బానో ముఖ్య అతిథిగా పాల్గొని మాతృభాష–ఉర్దూ ప్రాముఖ్యత అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ సమాజాభివృద్ధిలో మాతృభాష ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. భారత ఉపఖండంలో సంక్లిష్ట సాహితీ చరిత్రలో ఉర్దూ గొప్ప సాంప్రదాయ భాష అని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి కే. సీతారామారావు, రిజిస్ట్రార్ డా.ఏవీఎన్.రెడ్డి, డా.షకీలా ఖానం, డా. సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న పేదలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారనే ఫిర్యాదులతో పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సర్కిల్–17 టౌన్‌ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం పంజగుట్ట నుంచి సోమాజిగూడ యశోదా ఆస్పత్రికి వెళ్ళే రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. పంజగుట్ట ప్రధాన రహదారి నుంచి యశోదా ఆస్పత్రి వరకు రోడ్డుకు రెండువైపులా పెద్ద ఎత్తున డబ్బాలు, తోపుడు బండ్లను, షాపుల ముందు నిర్మించిన షెడ్లను తొలగించారు. దీంతో పోలీసులకు, చిరు వ్యాపారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మూడుగంటల పాటు జరిగిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో పెద్ద సంఖ్యలో ఆక్రమణలు తొలగించినట్లు అధికారులు తెలిపారు.


రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విజయారెడ్డి

ఇదిలా ఉండగా సమస్య తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి వచ్చి అధికారులపై తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయరహదారిపై బైఠాయించారు.

'మహిళా బిల్లును అడ్డుకుంటున్నది ఎవరో అర్థం కావడం లేదు'

పంజగుట్ట: నాటి ఇందిరాగాంధీ మొదలు, ప్రస్తుతం కవిత వరకు అందరూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటున్నారని, కాని అమలు కాకుండా అడ్డుకుంటున్నది ఎవరో అర్థం కావడంలేదని బహుజన రాజ్యం పార్టీ పూలే అంబేడ్కర్ జాతీయ అధ్యక్షులు లాలు నాయక్ రమావత్ ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజా పరిరక్షణ రాజకీయ వేదిక / తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సుమారు 30 పార్టీలు కలిసి చట్టసభల్లో మహిళలకు 33 శాతం, బీసీ లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు పి.అశోక్, రైతు రాజ్యం పార్టీ అధ్యక్షులు ఎం.బి.బాలకృష్ణ, సమైఖ్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ అధ్యక్షులు కుమార్ చౌదరీ యాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ .. మహిళలకు 33 శాతం, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఇప్పటికే అన్ని పార్టీలు కలిసి ఎన్నో పోరాటాలు చేశామని, అన్ని ప్రధాన రాజకీయపార్టీలకు వినతులు ఇచ్చామని అయినా స్పందన లేదన్నారు.

ప్రాచీన కళలకు ప్రాధాన్యత ఇవ్వాలి


కార్యక్రమంలో పాల్గొన్న సాలర్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి

హిమాయత్‌నగర్: ప్రాచీన కళలను ప్రోత్సహించి, వాటికి మరింత ప్రాధాన్యతను ఇస్తూ వాటి ఉనికిని కోల్పోకుండా అందరూ కృషి చేయాలని సాలర్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్లో 'హ్యాండ్ షాడో పప్పెట్రీ' ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, స్ఫూర్తి థియేటర్ సంయుక్తంగా 7రోజుల పాటు పప్పెట్‌షోను నిర్వహించారు. ముగింపు సందర్భంగా పలు ప్రదర్శనలు నిర్వహించడంతో విద్యార్థులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

రుణం ఎగ్గొట్టిన ఇద్దరిపై కేసు నమోదు

ఈఎంఐలు కట్టకుండా పరారవ్వడంతో కేసు నమోదు

హిమాయత్‌నగర్: వాహనం కోసం ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం తీసుకున్న ఇద్దరు వ్యక్తులు ఆ లోనును చెల్లించకుండా పరారయ్యారు. పలు మార్లు ఇంటి అడ్రస్‌ను ఫైనాన్స్ కంపెనీ చెక్ చేయగా వారు కనిపించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో నారాయణగూడ పోలీసులకు నాంపల్లి 9వ మెట్రోపాలిటియన్ కోర్టు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలంటూ సూచించింది. వివరాలిలా ఉన్నాయి.. ఓల్డ్ మలక్‌పేటకు చెందిన మహ్మద్ జంహంగీర్, సయ్యద్ సముద్దీన్ ఖలీల్‌లు వెహికల్ లోన్ కోసం చెన్నైకు చెందిన శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను 2019లో ఆశ్రయించారు. హిమాయత్‌నగర్ స్ట్రీట్–6లో ఉన్న ఫైనాన్స్ కార్యాలయానికి వెళ్లి డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయడంతో రూ.32.20లక్షల లోన్ ఆ ఇద్దరికీ మంజూరైంది. ఆ మొత్తానికి 63 నెలల పాటు ప్రతి నెలా ఈఎంఐ చెల్లించాల్సి ఉండగా..కొన్ని నెలలు చెల్లించి ఆ తర్వాత చెల్లించకుండా ఆపేశారు. దీనిపై ఆ ఇద్దరి ఇళ్లకు ఫైనాన్స్ కంపెనీ పలు మార్లు నోటీసులు జారీ చేసింది. నోటీసులకు జవాబు ఇవ్వకపోవడంతో ఫీల్డ్ ఆఫీసర్లు ఇంటివద్దకు వెళ్లి తనిఖీలు చేయగా..వారిచ్చిన అడ్రస్‌లు తప్పుగా నిర్ధారించారు.

దీంతో తమ ఫైనాన్స్ కంపెనీని మోసం చేసిన వారిని శిక్షించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు సూచనల మేరకు నారాయణగూడ పోలీసులు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ చేసిన ఆటోతో చిక్కిన దొంగ

బంజారాహిల్స్: దొంగిలించిన ఆటోలో తిరుగుతూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు.ఈ ఘటన జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ శుక్రవారం ఉదయం నీరూస్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా టీఎస్ 34 టీ 5868 నెంబర్ ఆటోను ఆపి పత్రాలు పరిశీలించాడు. అయితే సరైన పత్రాలు చూపించకుండా పొంతనలేని సమాధానాలు చెప్పడమే కాకుండా సదరు ఆటో డ్రైవర్ ఆటోను వదిలేసి తప్పించుకునేందుకు యత్నించాడు. గమనించిన ట్రాఫిక్ ఎస్ఐ ఆరా తీయగా సదరు ఆటో డ్రైవర్ మాదావత్‌సురేష్(23) కూకట్‌పల్లి ప్రగతి నగర్‌లో నివాసం ఉంటాడని, 2019 నవంబర్ 9న కేపీహెచ్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోను దొంగిలించినట్లు తేలింది. కేపీహెచ్‌బీ పీఎస్‌లో మేరకు ఐపీసీ 379 కింద చోరీ కేసు నమోదు అయినట్లు తేలింది. దీంతో ఈ విషయాన్ని గురించి సంబంధిత పోలీసులకు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. కేపీహెచ్‌పీ పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీతో జూబ్లీహిల్స్‌ట్రాఫిక్ పోలీసులను సంప్రదించి ఆటోతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకువెళ్లాడు. మొత్తానికి నాలుగేళ్లుగా చోరీ చేసిన ఆటోను పోలీసుల కళ్లుగప్పి తిప్పుతూ ఇన్నాళ్లకు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు.

ఆక్రమణ గురించి ప్రశ్నించినందుకు దాడి

బంజారాహిల్స్: పబ్లిక్ రోడ్డును ఆక్రమించి ఇంటికి మెట్లు నిర్మించడం నిబంధనలకు విరుద్ధమని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నేతపై దాడికి దిగిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీరాంనగర్‌లో మహ్మద్ అబ్దుల్ రహీం అనే వ్యక్తి పబ్లిక్ రోడ్డును ఆక్రమించి నూతనంగా నిర్మిస్తున్న తన ఇంటికి మెట్ల నిర్మాణం చేపట్టాడు. స్థానిక బీఆర్ఎస్ నేత మహ్మద్ అతర్ ఇదే విషయాన్ని సదరు ఇంటి యజమానిని ప్రశ్నించాడు. ఆగ్రహం వ్యక్తం చేసిన రహీం అక్కడే ఉన్న కర్రతో తనను ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో అతర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బెదిరించడమే కాకుండా తనపై దాడి చేసి తీవ్రంగా కొట్టి గాయపరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు రహీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు.. పరుగు..


పంజగుట్ట ప్రధాన దారిలో పొంగుతున్న మురుగు

బంజారాహిల్స్: అకాల వర్షానికి ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో ఉన్న మ్యాన్‌హోళ్లు పొంగుతూ మురుగంతా రోడ్లపై ప్రవహిస్తోంది. పంజగుట్ట ప్రధాన రహదారిలో విజయ డయాగ్నస్టిక్స్ వద్ద, నిమ్స్ ప్రధాన గేటు వద్ద పెద్ద ఎత్తున వరద నీరు, మురుగు నీరు నిలవడంతో ఆస్పత్రికి వచ్చిపోయే వారితో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో కూడా పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది. వరద నీరు వెళ్ళే మార్గాలు మూసుకుపోవడంతో నీరు రోడ్లపైనే తిష్టవేసింది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శలు వినిపించాయి.

క్లుప్తంగా...

కోతుల దాడిలో ఉపాధ్యాయినికి తీవ్ర గాయాలు



ఖానాపూర్: కోతుల దాడిలో ఒక ఉపాధ్యాయిని తీవ్రంగా గాయపడ్డారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో తెలుగు ఉపాధ్యాయిని మంజులపై ఒక్కసారిగా రెండు కోతులు దాడి చేశాయి. ఆమె పక్కనే ఉన్న బండపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై రక్త స్రావం జరిగింది. హుటాహుటిన ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు తలపై నాలుగు కుట్లు వేశారు. ఇటీవల వాచ్‌ఉమన్ పోశమ్మపై కూడా కోతులు దాడి చేశాయి. రోజూ పిల్లలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధ్యాయులపై దాడి చేస్తున్న కోతుల బెడదను నివారించాలని ప్రధానోపాధ్యాయిని మమత కోరారు.

వీధి కుక్కలను షెల్టర్లకు తరలించండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వీధి కుక్కలను షెల్టర్ హౌస్‌లకు తరలించడం లాంటి చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా స్టెరిలైజ్(సంతతి నియంత్రణ) ప్రక్రియను కొనసాగించాలని జీహెచ్ఎంసీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. పెద్ద ఎత్తున వీధి కుక్కలు తిరుగుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుంటే ఏం చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది. హైదరాబాద్‌లో కుక్కల దాడి చేయడం, బాలుడి మృతి ఘటనను హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనికి సంబంధించి మీడియాలో వచ్చిన వార్తను సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. జీహెచ్ఎంసీ కౌన్సిల్ కటిక రవీందర్ వాదనలు వినిపిస్తూ, వీధి కుక్కలను తరలించేందుకు షెల్టర్ హౌస్‌లు సిద్ధం చేశామని చెప్పారు. అలాంటప్పుడు ఇంకా కుక్క కాటు ఘటనలు ఎలా చోటుచేసుకుంటున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. కాగా, ఇందులో న్యాయవాది మామిడి వేణుమాధవ్ ఇంప్లీడ్ అయ్యారు. కుక్కల సంతతి నియంత్రణకు అధికారులు రూ.కోట్లు వెచ్చించారన్నారు. అయినా సత్ఫలితాలు రాలేదని, అధికారులు డబ్బులు మాత్రం స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. వీధి కుక్కలను హౌస్‌కు తరలించడంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీని ధర్మాసనం ఆదేశించింది.

కాలక్షేపానికా మంత్రుల పర్యటన?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రులు పంట నష్టం అంచనా వేసేందుకు వెళ్లారా? లేక గాలిమోటార్ ఎక్కి కాలక్షేపం చేసేందుకు వెళ్లారా? అని టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి ప్రశ్నించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు హెలికాప్టర్ ఎక్కి హైదరాబాద్‌కు కూతవేటు దూరంలోని వికారాబాద్ జిల్లా మర్పల్లి, మొమిన్‌పేటలకు వెళ్లి హంగామా చేయడ మేమిటని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గత ఏడాది వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు కూడా గాలిమోటార్‌లోనే మంత్రులు వెళ్లివచ్చినా ఇంతవరకు రూపాయి పరిహారం ఇవ్వలేదని గుర్తు చేశారు.



ఈ చిత్రంలో విరిగిన చేయితో, పక్కనే కర్ర, గులేర్ పెట్టుకుని పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడి పేరు ధనుంజయ్. నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని ఎల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో టీచర్. రోజూ మధ్యాహ్న భోజన సమయంలో కోతులు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి. వంటలు, భోజనం చేసేప్పుడు ఒకరిద్దరు విద్యార్థులు పొడవాటి కర్రలను పట్టుకుని కాపలా ఉండాల్సి వస్తోంది. ఇటీవల అలా వచ్చిన కోతుల గుంపును తరిమేసేందుకు ధనుంజయ్ ప్రయత్నించారు. కానీ అవి ఒక్కసారిగా ఆయనపై దాడికి రావడంతో కిందపడ్డారు. చేయి విరిగింది. ఇప్పటికీ ఇలా భయంభయంగానే పాఠాలు బోధిస్తున్నారు.



ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు చాతరబోన నర్సవ్వ (70). కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఆమె ఈనెల 2న మధ్యాహ్నం ఇంట్లోనే వంట పాత్రలు కడుగుతోంది. అక్కడ పడేసిన అన్నం మెతుకులను చూసిన కోతుల మంద ఒక్కసారిగా ఆమెపై దాడిచేసింది. ఇష్టారీతిన ముఖం, గొంతు, మెడ, నడుము భాగంలో రక్కాయి. చుట్టుపక్కల ఉన్న ఒకరిద్దరు మహిళలు భయపడి ఇళ్లలోకి వెళ్లిపోయారు. కోతుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ నర్సవ్వను ఆస్పత్రికి తీసుకెళ్లినా బతకలేదు.



.. ఇలాంటి ఒకటి రెండు ఘటనలు కాదు. రాష్ట్రంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి. "అరె.. ఇవేం కోతులు పొద్దున లేచినప్పటి నుంచే పరేషాన్ చేస్తున్నయ్. బయటికి అడుగు పెట్టనిస్తలేవు. పిల్లలను బడికి పంపుదామంటే మందలకు మందలు తిరుగుతున్నాయ్. ఏమైనా అంటే మీదికి వస్తున్నయ్.."అనుకుంటూ జనం పరేషాన్ అవుతున్నారు. గుంపుగా మీదపడి రక్కుతుండటంతో భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. కుక్కల దాడులపై అంతంత మాత్రమైనా స్పందిస్తున్న ప్రభుత్వం.. కోతుల బాధను మాత్రం అసలే పట్టించుకోవడం లేదని జనం వాపోతున్నారు. ఊరిపైకి కోతులదండు వచ్చిందని తెలిస్తే.. పనులు మానుకొని మరీ, ఇళ్లలో తలుపులు వేసుకుని ఉండిపోతున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. - నిర్మల్

కోతుల కథ.. జనం వ్యథ!

- మందలు మందలుగా జనావాసాలపైకి వానరాలు
- ఇళ్లలో, దుకాణాల్లో చొరబడి ఆహార పదార్థాల తస్కరణ
- నియంత్రణ కోసం 'హిమాచల్'తరహా ప్రయోగం మొదలుపెట్టిన సర్కారు
- ట్యూబెక్టమీ, వేసెక్టమీ ఆపరేషన్లు చేసి సంతతిని నియంత్రించే యత్నం
- ఇందుకోసం నిర్మల్‌లో 'మంకీ రిహాబిలిటేషన్ సెంటర్'
- ఏర్పాటు చేసి రెండున్నరేళ్లయినా.. నామ్‌కే వాస్తేగా చర్యలు
- కోతుల దాడులతో పరేషాన్ అవుతున్న జనం



విపరీతంగా సంతతి..

అడవుల్లో పండ్ల చెట్లు తగ్గడం, కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో జనావాసాలపై పడుతున్నాయి. దాదాపు 25–30 ఏళ్లు జీవించే ఆడ కోతి మూడేళ్ల వయసు నుంచే గర్భం దాలుస్తుంది. ఏడాదికోసారి చొప్పున తన జీవితకాలంలో అటూఇటూగా 20–22 పిల్లలను కంటుంది. ఇలా వాటి సంతతి వేగంగా పెరుగుతోంది. ఒకప్పుడు అటవీ ప్రాంతాలున్న జిల్లాలకే పరిమితమైన కోతులు.. ఇప్పుడు మైదాన ప్రాంతాల్లోనూ గుంపులుగా ఉంటున్నాయి. ఆహారం, నీళ్ల కోసం జనావాసాలపైకి దండెత్తుతున్నాయి. ఎవరైనా వాటిని అదిలిస్తే.. వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తే గుంపులుగా దాడికి పాల్పడుతున్నాయి.

'హిమాచల్'ప్రయోగం మొదలుపెట్టినా..

ఇంతగా ఇబ్బందిపెడుతున్న కోతులను చంపేందుకు చట్టాలతోపాటు నమ్మకాలు కూడా అడ్డువస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితే ఉండటంతో.. ఆ రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేసింది. కోతులను పట్టుకుని ట్యూబెక్టమీ, వేసెక్టమీ ఆపరేషన్లు చేసి వదిలేసి.. వాటి సంతతిని నియంత్రణలో ఉంచేందుకు చర్యలు చేపట్టింది. దీనిని స్టడీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని గండిరామన్న హరితవనంలో 2020 డిసెంబర్‌లో 'మంకీ రిహాబిలిటేషన్ సెంటర్'ను ఏర్పాటు చేసింది. ఇందులో కోతులకు ట్యూబెక్టమీ, వేసెక్టమీ ఆపరేషన్లు చేయడం మొదలుపెట్టారు.



ఎల్లారెడ్డిపేట పాఠశాలలో భోజన సమయంలో కోతులు రాకుండా నిల్చున్న ఉపాధ్యాయుడు, పిల్లలు

నామ్‌కే వాస్తేగానే చర్యలు..

మంకీ రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఒక పశు వైద్యాధికారి, ఒక అసిస్టెంట్‌తోపాటు నలుగురు అటవీశాఖ సిబ్బంది ఉన్నారు. ఈ కేంద్రానికి తీసుకువచ్చిన కోతులకు వారు ఆపరేషన్లు చేస్తున్నారు. కానీ ఇక్కడికి కోతులను తీసుకురావడం దగ్గరే సమస్య నెలకొంది. ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కోతులను పట్టుకుని ఇక్కడి తీసుకువచ్చే బాధ్యతను స్థానిక సంస్థలకే అప్పజెప్పింది. మొదట్లో కొన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు అలా కోతులను తెచ్చాయి. అయితే కోతులను పట్టుకోవడం, వాటిని అంతదూరం తరలించడం ఇబ్బందిగా మారిందంటూ తర్వాత పట్టించుకోవడం మానేశారు.



నిర్మల్‌లో కోతుల పునరావాస కేంద్రం

దీనితో ఇప్పటివరకు 1,176 కోతులకు మాత్రమే ఆపరేషన్లు చేయడం గమనార్హం. కోతుల బెడద నివారణలో ఎంతోకొంత ఫలితమిచ్చే ఈ అంశాన్ని సర్కారు నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. అంతేకాదు హిమాచల్‌ప్రదేశ్ 8 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. రాష్ట్రంలో ఒక్కటే పెట్టి వదిలేశారు.

ఇక కోతుల బెడదను తప్పించేందుకు పండ్ల చెట్లతో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. ఆ దిశగా పెద్దగా చర్యలు లేవని జనం వాపోతున్నారు.

కోతులను తేవాలన్నా.. స్పందన తక్కువగానే..



మా కేంద్రానికి తెచ్చిన కోతులకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేస్తున్నాం. ఇప్పటివరకు దాదాపు 528 ఆడ కోతులకు ఆపరేషన్ చేశాం. అవి మరో పదేళ్ల వరకు పిల్లలు కనే వయసు ఉన్నవే. అంటే దాదాపు 5,280 కోతులు పుట్టకుండా చేయగలిగాం. గ్రామాల్లో కోతులను పట్టి తీసుకురావాలని సూచిస్తూనే ఉన్నాం. కానీ స్పందన తక్కువగానే ఉంటోంది. – డాక్టర్ శ్రీకర్‌రాజు, మంకీ రిహాబిలిటేషన్ సెంటర్



వికారాబాద్ జిల్లా మర్పల్లిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

లక్ష ఎకరాల్లో పంట నష్టం!

- రైతుకు కడగండ్లు మిగిల్చిన వడగళ్లు
- పలు జిల్లాల్లో దెబ్బతిన్న వరి, మిర్చి, మొక్కజొన్న పంటలు
- కూరగాయలు, ఉద్యాన పంటలకూ అపార నష్టం
- వికారాబాద్ జిల్లాలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబిత, ఎమ్మెల్సీ పల్లా ఏరియల్ సర్వే
- దెబ్బతిన్న పంటల పరిశీలన.. రైతులను ఆదుకుంటామని హామీ

సాక్షి, హైదరాబాద్/నల్లగొండ అగ్రికల్చర్/మర్పల్లి/ వికారాబాద్: రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్లు అన్నదాతలను నిండా ముంచాయి. సుమారు లక్ష ఎకరాల్లో పంటలను దెబ్బతీశాయి. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన వడగండ్ల వానలతో వరి, మామిడి, నిమ్మ, బత్తాయి, పుచ్చ, టమాటా, బీరకాయ, మొక్కజొన్న, పచ్చిమిర్చి, బొబ్బర్లు, మినుము పంటలకు భారీ నష్టం వాటిల్లింది. అనేక చోట్ల వరి నేలవాలగా కొన్ని ప్రాంతాల్లో మక్కలు తడిసి ముద్దయ్యాయి. అలాగే మామిడి, బత్తాయి, నిమ్మ తోటల్లో పిందెలు, కాయలు రాలిపోయాయి. పచ్చిమిరప చేన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వికారాబాద్ జిల్లాలో అత్యధిక పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నల్లగొండ జిల్లాలో 1,060 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదించారు. వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి, మొమిన్‌పేట మండలాల్లో దెబ్బతిన్న ఉద్యాన, వ్యవసాయ పంటలను మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. వడగండ్ల వాన తీవ్రత ఎక్కువగా ఉందని మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాబేజీ, ఉల్లి, మొక్కజొన్న, పుచ్చకాయ, క్యాప్సికం పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో రెండు వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చామని మంత్రి పేర్కొన్నారు.

సాగు విధానంలో మార్పు అవసరం

మన దేశంలో వ్యవసాయానికి ఓ విధానమంటూ లేదని, దీనిని సరిచేసే విషయమై కేంద్రం చొరవ తీసుకోవాలని మంత్రి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని అనేకసార్లు కేంద్రాన్ని కోరినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 72 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని వివరించారు. మార్చి, ఏప్రిల్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందని, ఈలోగా పంటలు చేతికి వచ్చేలా సాగువిధానంలో మార్పులు రావాలన్నారు. నిజామాబాద్, బోధన్, కామారెడ్డి, సూర్యాపేట ప్రాంతాల్లో రైతులు పంటలు నష్టపోకుండా సీజన్‌లో మార్పులు చేసుకుంటున్నారని, ఈ ప్రాంత రైతులు కూడా ఆ దిశగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు, ఉద్యానవన శాఖ సంచాలకులు హన్మంతారావు, కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు వ్యవసాయ వర్సిటీ సూచనలు...

రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో చాలాచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్న నేపథ్యంలో ఆరుతడి పంటలు, కూరగాయలు పండించే రైతులు పొలాల్లో అధిక వర్షపు నీరు బయటకు పోవడానికి వీలుగా మురుగు కాల్వలు ఏర్పాటు చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటరమణ సూచించారు. చీడపీడలు, తెగుళ్ల ఉధృతి అధికం కాకుండా ఉండేందుకు నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

35 ఎత్తిపోతల పథకాలకు ప్రతిపాదనలు

టీఎస్ఐడీసీ సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఎత్తిపోతల పథకాల ఏర్పాటుకు వచ్చిన 35 ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లిన తర్వాత చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఐడీసీ) నిర్ణయించింది. శుక్రవారం ఐడీసీ కార్యాలయంలో చైర్మన్ వేణుగోపాలాచారి అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) నాగేంద్రరావు, భూగర్భ జలశాఖ డైరెక్టర్ పండిత్ మద్నూరే, టీఎస్ఐడీసీ ఎండీ విద్యాసాగర్, బోర్డు మెంబర్లు లత, వినోద్, ఇతర అధికారులు ఎత్తిపోతల పథకాల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం వేణుగోపాలాచారి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 538 ఎత్తిపోతల పథకాల ద్వారా 4.69 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని, రూ.743.19 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 37 పథకాల పనులు కొనసాగుతున్నాయని, అవి పూర్తయితే మరో 65 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇవి కాకుండా పలు ప్రాజెక్టుల పరిధిలోని ఎత్తైన ప్రాంతాల్లో ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందడం లేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు 35 పథకాలను నిర్మించాలని ప్రతిపాదనలు అందజేశారని తెలిపారు. ఈ ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి దళిత, గిరిజన రైతులు అధికంగా ఉండే ఆయకట్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

సాక్షి రియల్టీ

10% పెరిగిన ధరలు

- గత ఐదేళ్లలో నగరంలో పెరిగిన ప్రాపర్టీ రేట్లు
- అయినా నేటికీ అందుబాటు ధరలే
- చ.అ.కు సగటున రూ.4,620
- అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెన్సీ నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో స్థిరాస్తి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. కరోనా తర్వాత నుంచి గృహాలకు డిమాండ్ పెరగడంతో ధరలూ అదే రీతిలో పెరిగాయి. 2018లో హైదరాబాద్‌లో చ.అ.కు ధర సగటున రూ.4,128గా ఉండగా.. 2022 నాటికి రూ.4,620లకు చేరింది. గత ఐదేళ్లలో గరిష్టంగా 10 శాతం మేర ధరలు పెరిగాయని.. అయినప్పటికీ దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే భాగ్యనగరంలో రేట్లు తక్కువగానే ఉన్నాయని ప్రాపర్టీ కన్సల్టెంట్ అనరాక్ నివేదిక వెల్లడించింది.

- ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, పుణే, హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో సగటు స్థిరాస్తి ధరలను అనరాక్ పోల్చింది. ఇతర మెట్రోలతో పోలిస్తే గృహాలను కొనుగోలు చేసేందుకు అత్యంత సరసమైన నగరంగా హైదరాబాద్ నిలిచింది. నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలే స్థిరాస్తి ధరల వృద్ధికి ప్రధాన కారణమని సీనియర్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ తెలిపారు. 2022లో బెంగళూరులో సగటు ఆస్తి ధరలు రూ.5,570కి చేరుకోగా.. ముంబైలో రూ.11,875, పుణేలో రూ.6 వేలుగా ఉన్నాయి. మెరుగైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ పెరగడం, ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు హైదరాబాద్ స్థిరాస్తి రంగం వృద్ధికి చోదక శక్తి లాగా పనిచేస్తున్నాయి. ఐటీ, ఫార్మా కంపెనీలకు కేంద్ర బిందువుగా మారింది.

ఆఫీసు స్పేస్‌కు ఆదరణ

సాక్షి, హైదరాబాద్: ఐటీ హబ్‌గా పేరొందిన గచ్చిబౌలిలో వాణిజ్య స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. వచ్చే 3–4 త్రైమాసికాలలో హైదరాబాద్‌లో అదనంగా 1.5 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ అందుబాటులోకి రానుండగా.. ఇందులో 70–80 లక్షల చ.అ. స్థలం గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లోనే రానుందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ వెల్లడించింది.

- 2022 చివరి ఆర్థిక త్రైమాసికంలో నగరంలో 11.5 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లీజు లావాదేవీలు జరిగాయి. ఇది క్రితం క్వార్టర్‌తో పోలిస్తే 25 శాతం క్షీణత. అయితే 2021 వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 13 శాతం ఎక్కువ. స్టార్టప్స్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల డిమాండ్ కారణంగా నగరంలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ ఆదరణ పెరుగుతుంది. 60 శాతం వార్షిక వృద్ధి రేటుతో ప్రస్తుతం నగరంలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ సీట్లు 19 వేలకు చేరాయి. మాదాపూర్‌లో కొన్ని లావాదేవీలు తుది దశలో ఉన్నాయని.. ఈ త్రైమాసికంలో పూర్తయ్యే అవకాశాలున్నాయి.
- హైదరాబాద్‌లో వాణిజ్య సముదాయాల అభివృద్ధి శరవేగంగా సాగుతుంది. దీంతో ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చే భూ యజమానులపై ఒత్తిడి పెరిగిందని, పెద్ద సైజు లేదా దీర్ఘకాలిక స్థల అవసరాలు ఉన్న అద్దెదారులు అద్దె పొదుపు కోసం గచ్చిబౌలి లేదా ఓఆర్ఆర్ వెంట అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో అన్వేషించాలి.

జీవో 58, 59 దరఖాస్తు గడువు పొడిగింపు

- ఏప్రిల్ 1 నుంచి 30 వరకు మరో అవకాశం
- సింగరేణిలో 3 నెలలు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: జీవో 58, 59కి సంబంధించిన దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. అభ్యంతరాల్లేని ప్రభుత్వ భూములు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) పరిధిలోకి వచ్చే భూములు, వివిధ కార్పొరేషన్లు, సంస్థల ఆధ్వర్యంలోని భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి యాజమాన్య హక్కులు కల్పించేందుకు గాను గతంలో ప్రభుత్వం ఈ జీవోలను జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ జీవోల్లోని నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు గాను ఈ ఏడాది ఏప్రిల్1 నుంచి 30 వరకు మరోమారు అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జీవోల ప్రకారం క్రమబద్ధీకరణకోసం దరఖాస్తు చేసుకునేందుకు 2014, జూన్2 నాటికి ఉన్న నిర్మాణాలకు మాత్రమే గతంలో అవకాశం ఉండగా, ఇప్పుడు ఆ కటాఫ్ తేదీని జూన్2, 2020 వరకు పొడిగిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సింగరేణి పరిధిలో మూడు నెలలు : కాగా, జీవోనం.76 ప్రకారం సింగరేణి కాలరీస్ లిమిటెడ్‌కు చెందిన భూముల్లో చేపట్టిన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునే దరఖాస్తు గడువును పెంచుతూ ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఇచ్చిన ఈ ఉత్తర్వుల ప్రకారం 2023, ఏప్రిల్1 నుంచి జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అదే విధంగా నిర్మాణాలుండాల్సిన తేదీని కూడా జూన్ 2, 2014 నుంచి జూన్ 2, 2020 వరకు పొడిగించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లోని సింగరేణి కాలరీస్ భూముల్లో నిర్మాణాలకు ఈ గడువు వర్తిస్తుందని, తాజా జీవో ప్రకారం క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మీ వ్యక్తిత్వమేంటో ఫేస్‌బుక్ చెప్పేస్తుంది

- ప్రపంచంలో అత్యధిక జనాభా ఎఫ్‌బీలోనే..
- ఎస్‌సీఎస్‌సీ 5వ ఉమెన్స్ కాన్‌క్లేవ్‌లో డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: 'మీ వ్యక్తిత్వమేంటో తెలియాలంటే మీతో మాట్లాడాల్సిన పన్లేదు. మీ ఫేస్‌బుక్కే చెప్పేస్తుంది'అని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం చైనానో, ఇండియానో కాదని, అది ఫేస్‌బుక్(ఎఫ్‌బీ) అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎఫ్‌బీలో 2.4 బిలియన్ల మంది ఖాతాదారులుగా ఉన్నారని, ప్రతి ఒక్క డేటా ఎఫ్‌బీ వద్ద ఉందని, ఇది ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం '5 వ ఉమెన్స్ కాన్‌క్లేవ్'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సాంకేతికతను భద్రంగా వాడుకుంటే మంచి సేవకుడిలా పనిచేస్తుందని, సాంకేతికత వల్ల వైద్యశాస్త్రంలో అద్భుతాలు జరుగుతున్నాయని, ఇదే తరహా అభివృద్ధి అన్నిరంగాల్లోనూ రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ మహిళల హక్కుల విషయంలో ఇప్పటికీ చాలా సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిల్లో ఆర్థిక స్థిరత్వం ప్రధానమని పేర్కొన్నారు. విద్యే మహిళా సాధికారతకు మూలమని గుర్తుచేశారు. అనంతరం పలువురు మహిళలకు 'షీ ఎంపవర్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, కాంటినెంటల్ ఆసుపత్రి సీఎండీ డాక్టర్ గురునాథ్ రెడ్డి, ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ కృష్ణ ఏదుల, డీసీపీలు నితికా పంత్, శిల్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ఎత్తిపోతల ఆయకట్టు ఎంత?

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఎంత ఆయకట్టుకు నీరందిస్తున్నారో తెలపాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కోరింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి బోర్డు ఎస్ఈ సి.అశోక్‌కుమార్ శుక్రవారం లేఖ రాశారు. ఈ ఎత్తిపోతల కింద ఆయకట్టు సామర్థ్యాన్ని పెంచుతూ జారీ చేసిన జీవోను వివరాలతో పాటు.. కల్వకుర్తి ఆయకట్టు వివరాలను సమర్పించాలని కేంద్ర జలశక్తి శాఖ కోరిన నేపథ్యంలో కేఆర్ఎంబీ తెలంగాణకు ఈ మేరకు లేఖలో ప్రస్తావించింది.

ఆ బిల్లును గవర్నర్ ఆపడం ఉన్నత విద్యకు అవరోధం

- ప్రతీ వర్సిటీలోనూ అధ్యాపకుల కొరత
- యూజీసీ, మండళ్ల మధ్య సమన్వయం అవసరం
- జాతీయ ఉన్నత విద్యా మండళ్ల సదస్సులో ప్రొఫెసర్ లింబాద్రి



సదస్సులో ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న అధ్యాపకుల కొరత ఉన్నత విద్య ప్రమాణాల పెంపునకు అవరోధంగా మారిందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనివర్సిటీల అధ్యాపక నియామక బోర్డు బిల్లును గవర్నర్ పెండింగ్‌లో ఉంచడమే ఈ పరిస్థితి కారణమని ఆయన వ్యాఖ్యానించారు. అఖిల భారత ఉన్నత విద్యా మండళ్ళ రెండు రోజుల సమావేశం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ, 1960 నుంచి బీహార్‌లో అధ్యాపక రిక్రూట్‌మెంట్ బోర్డు పనిచేస్తోందనీ అస్సాంలో కూడా ఈ తరహా బోర్డు ఉందని తెలిపారు. తెలంగాణలో ఈ బోర్డు బిల్లును పెండింగ్‌లో ఉంచడంతో నియామకాలు జరగడం లేదన్నారు. మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి వెంకటరమణ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఇచ్చిన ఐఐఎం హామీ కూడా కేంద్ర ప్రభుత్వం ఇంకా నెరవేర్చలేదన్నారు.

తెలంగాణ ఆదర్శం..

ఉన్నత విద్యామండళ్ళ బలోపేతానికి తెలంగాణను ఆదర్శంగా తీసుకోవాలని ఉన్నత విద్య, పాలసీ పరిశోధనా సంస్థ (సీపీఆర్‌హెచ్ఈ), జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలనా సంస్థ (నీప్) డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ మిశ్రా అన్నారు. ఉన్నత విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల్లో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ముందంజలో ఉందన్నారు. జాతీయ విద్యావిధానం 2020 అమలు చేసేందుకు మరింత విస్తృత చర్చ అవసరమని కర్ణాటక ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ప్రొఫసర్ తిమేగౌడ అభిప్రాయపడ్డారు. ఎన్ఈపి అమలు కోసం మూడు కమిషన్లను ఏర్పాటు చేశామని... నివేదికల ఆధారంగా చర్యలు చేపడతామని కేరళ ఉన్నత విద్యామండలి ప్రతినిధి పేర్కొన్నారు. యూజీసీ నుంచి ఉన్నత విద్యామండలికి నేరుగా సమాచారం ఉండాలని, అప్పుడే రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యామండళ్లు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరైన సమన్వయం సాధ్యమని పలు రాష్ట్రాలు అభిప్రాయపడ్డాయి. జాతీయ విద్యావిధానం, సీబీసీఎస్ విషయంలో ఉన్న అన్ని అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు త్వరలోనే ఓ సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. కాగా, దేశంలోని అన్ని రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లకు దిశానిర్దేశం చేసేలా, వారికి సలహాలు, సూచనలు ఇచ్చేలా న్యూస్‌లెటర్ రూపొందించే బాధ్యతను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తీసుకోవాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

కుర్రాళ్లు వినరు.
బైక్ ఎక్కి తుర్రుమంటారు.
భర్తలకు నిర్లక్ష్యం.
హెల్మెట్ లేకుండానే బయలుదేరుతారు.
ఇంటి మగవారి అసురక్షిత ప్రయాణం
స్త్రీలకు ఎప్పుడూ ఆందోళనకరమే.
ప్రతి ఇంట్లోని స్త్రీలు
ఆ ఇంటి మగవారికి రాఘవేంద్ర కుమార్‌ను చూపాలి.
స్నేహితుణ్ణి ప్రమాదంలో కోల్పోయిన అతను
సొంత డబ్బుతో ఇప్పటికి 56,000 హెల్మెట్లు పంచాడు.
పురుషులైనా స్త్రీలైనా హెల్మెట్ లేకుండా బండెక్కారంటే
ఇంటి మీదకు ముప్పు తెచ్చినట్టే అంటాడు రాఘవేంద్ర.
అతను చెప్పేది వినండి.


రాఘవేంద్ర

● హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

మీ పిల్లలకు ఇతన్ని చూపండి

'ఒంటి మీద ఎక్కడా దెబ్బ లేదు. తల ఒక్క దానికే తగిలింది' అని అయినవారిని కోల్పోయి ఏడ్చేవారు ఎందరో ఉన్నారు. ఆ తలకు దెబ్బ తగలని రీతిలో జాగ్రత్త తీసుకుని ఉంటే వారంతా బతికేవారు. హెల్మెట్ వాడితే బతికేవారు.

చట్టాలు ఎన్ని చెప్పినా, నిబంధనలు విధించినా జీవితాన్ని సీరియస్‌గా తీసుకోని వారు ఎప్పుడూ ఉంటారు. వారు ఎక్కడో వేరే కుటుంబాలలో ఉంటారనుకోవద్దు. మన కుటుంబాల్లో కూడా ఉంటారు. కాలేజీకి వచ్చిన కొడుకు, ఉద్యోగానికి వెళ్లే భర్త, ట్రయినింగ్‌లో ఉన్న కూతురు.. వీరు కూడా 'ఆ.. ఏముందిలే' అనుకుని హెల్మెట్ వాడకుండా ఉండొచ్చు.

అలాంటి వారు తన కంట పడితే ఊరుకోడు రాఘవేంద్ర కుమార్ (36). ఇతణ్ణి అందరూ ఇప్పుడు 'హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అంటారు. నోయిడాలో నివాసం ఉండే ఇతను ఉద్యోగం వదిలేశాడు. ఇతర పనులు మానేశాడు. కేవలం హెల్మెట్‌కు సంబంధించిన చైతన్యం కోసం పని చేస్తున్నాడు. అతడు రోజూ చేసే పని కారు వేసుకుని, అందులో కొన్ని హెల్మెట్లు పడేసుకుని నోయిడా ఆగ్రాల మధ్య ఉండే ఆరు లేన్ల యమునా ఎక్స్‌ప్రెస్‌కు చేరుకుంటాడు. ఆ దారి మీద బైక్ వేసుకుని హెల్మెట్ లేకుండా ఎవరైనా వెళుతుంటే వారిని వెంబడించి ఆపుతాడు. హెల్మెట్ వాడకపోతే ఉండే ప్రమాదం గురించి చెప్పి ఉచితంగా హెల్మెట్ ఇచ్చి పంపుతాడు.

'2014 నుంచి నుంచి నేను హెల్మెట్‌లు పంచుతున్నాను. ఇప్పటికి 56 వేల హెల్మెట్లు పంచాను. నేను పంచిన రోజునో ఆ తర్వాత ఐదారు రోజుల్లోనో ప్రమాదానికి గురై నేనిచ్చిన హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకున్న వారు 30 మంది ఉన్నారు. వారంతా ఎంతో సంతోషంతో కృతజ్ఞతతో నాకు ఫోన్ చేసి తాము ప్రాణాలతో ఉండటానికి కారణం నేనేనని చెబుతారు. చాలా మందికి భారీ యాక్సిడెంట్లు అయ్యి కాళ్లు చేతులు విరిగినా తల మాత్రం ఏమీ కాకపోవడంతో బతికిపోయారు' అంటాడు రాఘవేంద్ర కుమార్.

అయితే అతనికి కూడా హెల్మెట్ విలువ ప్రాణ స్నేహితుడు మరణించాకే తెలిసింది. బిహార్‌కు చెందిన రాఘవేంద్ర కుమార్ 2009లో నోయిడా వచ్చి లా కోర్సులో



చేరాడు. అదే బిహార్ నుంచి ఇంజినీరింగ్ చేయడానికి వచ్చి కృష్ణకుమార్ అతని రూమ్మేట్ అయ్యారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు అయ్యారు. కాని 2014లో కొత్తగా వేసిన యమున ఎక్స్‌ప్రెస్ వే మీద హెల్మెట్ లేకుండా వెళుతూ కృష్ణకుమార్ యాక్సిడెంట్‌కు లోనయ్యాడు. ఒంటి మీద ఒక్క దెబ్బ లేదు. తలకే తగిలింది. మరణించాడు. 'వాళ్లింట్లో వాళ్లకి నా స్నేహితుడు ఒక్కగానొక్క కొడుకు కావడంతో వాడి అమ్మానాన్నల గుండెలు పగిలి పోయాయి. హెల్మెట్ ఉంటే బతికేవాడు కదా అన్న బాధ ఇప్పటికీ వదల్లేదు నన్ను' అంటాడు రాఘవేంద్ర.

అప్పటి నుంచి అతడు ఒక ఉద్యమంగా హెల్మెట్లు పంచుతున్నాడు. భార్య కొత్తల్లో సహకరించింది. కాని రాఘవేంద్ర కుమార్ దాదాపు తన ఆస్తులన్నీ అమ్మి ఇప్పటికి రెండు కోట్ల వరకు ఖర్చు చేసి హెల్మెట్లు పంచాడు. 'ఉన్నదంతా ఊడ్చేశాను. పర్వాలేదు. బిహార్‌లోని నా సొంత పల్లెకు వెళ్లిపోతాను' అని ఇటీవల అతను ప్రకటించాడు.

కాని అది పైమాటే. తనకు సరైన ప్రోత్సాహం లభిస్తే దేశంలో హెల్మెట్ల బ్యాంకులు తెరవాలని ఎవరైనా సరే అరువు తీసుకుని వెళ్లి వాడుకునేలా హెల్మెట్లు అందుబాటులో ఉంచాలని అతని కోరిక. '4 ఏళ్లు పైబడిన పిల్లలకు హెల్మెట్లు తప్పనిసరి చేయాలని నేను సుప్రీం కోర్టులో పిల్ వేశాను. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిశాను' అంటాడు రాఘవేంద్ర. 'ప్రాణం పోతే ఏం చేసినా తిరిగి రాదు' అంటాడు.

హెల్మెట్‌ను వాడటానికి ఇష్టపడని ప్రతి ఒక్కరికి రాఘవేంద్ర చెబుతున్న విషయం అర్థం కావాలి. ప్రాణం ఉంటే లోకం ఉంటుంది. ●

హ్యాపీ పేరెంటింగ్

వసపిట్ట పాఠాలు


కృష్ణమాధురి

తల్లిదండ్రులుగా పిల్లలను చూసుకోవాల్సిన విధానాన్ని, తల్లిగా తన అనుభవాన్ని కళ్లకు కడుతూ యూ ట్యూబర్‌గా రాణిస్తోంది హైదరాబాద్ కొండాపూర్‌లో ఉంటున్న చిలుకూరి కృష్ణ మాధురి, నాలుగు, ఏడాదిన్నర వయసున్న పిల్లలతో కలిసి, తన స్వీయ అనుభవాలను షేర్ చేస్తుంటుంది. మాధురి మూడేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నాలు... పిల్లల పెంపకంలో తను తీసుకునే జాగ్రత్తలు ఎంతోమంది తల్లులకు పాఠాలు అవుతున్నాయి. ఈ విషయాల గురించి మాధురి మాట్లాడుతూ ...

''నేను పుట్టి పెరిగింది రాజమండ్రిలో. మావారిది గుంటూరు. మా వారి ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉండేవాళ్లం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న నేను పిల్లల పుట్టడంతో ఇంటి దగ్గరే ఉండిపోయాను. పిల్లలపై తపన, వారి ఆరోగ్య జాగ్రత్తలు, పెంపకం విషయాలన్నీ తల్లిగా నాకు ప్రతిరోజూ ఓ పాఠమే. వీటిని నలుగురితో పంచుకుంటే కొంత మంది తల్లులకైనా ఉపయోగపడుతుంది కదా అని సరదాగా వీడియోలు తీసి, యూ ట్యూబ్‌లో పోస్ట్ చేసేదాన్ని.

వాయిస్ ఆఫ్ వసపిట్ట

పిల్లల అల్లరి మాటలకు పెద్దవాళ్లు ముద్దుగా పెట్టే పేరు వసపిట్ట. నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలని చిన్నప్పటి నుంచి కాస్త ఎక్కువగా మాట్లాడేదాన్ని. అందుకే, అందరూ నన్ను వసపిట్ట అని పిలిచేవారు. దీంతో ఛానెల్‌కి ఇదే పేరు బాగుంటుందని ఎంచుకున్నాను. మూడేళ్లు అవుతోంది ఇది స్టార్ట్ చేసి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చాక నా పోస్టులు మరిన్ని పెరిగాయి.

పెంపకాన్ని పరిచయం చేస్తూ..

అమ్మ తన పిల్లలను ఏ విధంగా పెంచుతుందనే విషయాల గురించి వెతికితే తెలుగులో ఎక్కువ బ్లాగర్స్ లేరు. ఉన్నా, వివరంగా చెప్పేవారు లేరు. పిల్లల పెంపకం అనగానే చాలా వరకు డాక్టర్లు, డైటీషియన్లు కనిపిస్తారు. వాళ్లు చెప్పేవి అందరూ ఆచరణలో పెడుతున్నారో లేదో తెలియదు. నేను డాక్టర్ దగ్గరకు పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అక్కడ వారిచ్చిన మందులు, జాగ్రత్తల నుంచి అన్నీ నా ఛానెల్ ద్వారా పరిచయం చేస్తుంటాను.



రోజువారి పనులు

చిన్న పిల్లలున్న ఇల్లు ఎలా ఉంటుందో తల్లులందరికీ అనుభవమే. ఇల్లు పీకి పందిరేస్తారు అంటుంటారు. ఇలాంటప్పుడు చిన్నపిల్లలకు క్రమశిక్షణ ఎలా అలవాటు చేయాలి, దుమ్ము, కాలుష్యం నుంచి వారిని ఎలా కాపాడాలి, టీవీ చూడకుండా తినడం ఎలా అలవాటు చేయాలి, స్క్రీన్ టైమ్ ఎందుకు తగ్గించాలి.. ఇలాంటివి పిల్లలను ఇన్‌వాల్వ్ చేసి చెప్పడం వల్ల చాలా మంది కనెక్ట్ అయ్యారు. అంతేకాదు, వాళ్లంతట వాళ్లు పనులు చేసుకోవడం, వంటలో సాయం చేయడం.. వంటివి పిల్లలకు పెద్దవాళ్లు అలవాటు చేయాలి. వీటిని మా పిల్లలను చూపిస్తూ 'హ్యాపీ పేరెంటింగ్' అనేది తెలియజేయాలనుకున్నాను. అదే చేస్తున్నాను.

ఆనందకరమైన లక్ష్యం

మదర్ హుడ్, ఫాదర్ హుడ్ ఎంజాయ్ చేస్తూ పిల్లలు కూడా మంచి ఫీలింగ్‌తో పెరగాలనేది నా ఆలోచన. మేం సమస్యలను ఎలా అధిగమిస్తున్నామో కూడా చూపిస్తున్నాను. వీటిని చూడటానికి నాలుగు లక్షలకు పైగా వీక్షకులున్నారు. వీరిలో పిల్లలున్నవారు 70 శాతం మంది ఉన్నారు. నా వీడియోలు చూసి తాము కూడా బ్లాగ్స్ చేస్తున్నామని కొందరు చెబుతుంటారు.

ఆరోగ్య జాగ్రత్తలు...

వీక్షకులలో చాలా మంది డాక్టరు చెప్పే జాగ్రత్తలు, కిడ్స్ ఫుడ్ గురించి సలహాలు సూచనలు అడుగుతుంటారు. పిల్లలు సరిగా తినరు అనేది పెద్దలు ప్రతిసారి చెబుతుంటారు. కానీ, ఎందుకు తినరు, ఎలా తింటారు.. అనే వివరాలను మా పిల్లలను ఉదాహరణగా చూపిస్తూ వివరిస్తుంటాను. వివిధ సమయాలలో పిల్లల ప్రవర్తన, మనం వారితో మాట్లాడటం, ప్రాక్టికల్‌గా చేస్తూ చెబుతుంటాను. పిల్లలు కూడా ఈ విధానాన్ని బాగా ఇష్టపడుతున్నారు. మా పిల్లలకు ఓ సారి ర్యాషెష్ వచ్చాయి. వాటిని ప్రాక్టికల్‌గా చూపించి, డాక్టరు చెప్పిన సూచనలతో పాటు, నేను స్వయంగా ఎలాంటి కేర్ తీసుకుంటున్నానో చూపించాను. అలాగే.. డెంటల్ ట్రీట్‌మెంట్, గర్భిణిగా ఉన్నప్పుడు, తల్లిపాల ప్రాముఖ్యత.. ఆ సమయాల్లో నేనెలాంటి జాగ్రత్తలు తీసుకున్నాను.. మరికొన్ని ఇతరుల ద్వారా సేకరించిన సూచనలూ ఇస్తుంటాను. మా నాన్న రైల్వేలో ఉద్యోగి. చిన్నప్పటి నుంచి కుటుంబంలో ప్రతి విషయంలో నా అభిప్రాయాన్ని కూడా అడిగేవారు. అలా వారి నుంచే నాకు నా పిల్లల పెంపకాన్ని మరింతగా నలుగురికి తెలియజేయాలనే ఆలోచన పెరుగుతూ వచ్చింది'' అని తల్లిగా తన అనుభవ పాఠాలను ఆనందంగా వివరించారు మాధురి.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్



● టేబుల్ స్పూన్ పెసలను రాత్రంతా నానబెట్టి ఉదయం మెత్తగా గ్రైండ్ చేసి అందులో అర టీ స్పూన్ నెయ్యి లేదా పాలు వేసి కలిపి ముఖానికి పట్టించి మర్దన చేసి పది నిమిషాల సేపు మిశ్రమాన్ని ముఖం మీద ఉంచాలి. ఈ ప్యాక్ పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇలా చేస్తే పొడిబారిన చర్మం ఆరోగ్యంగా, నునుపుగా మారుతుంది. ఆయిల్ స్కిన్ వాళ్లయితే పెసర పేస్ట్‌లో కొద్దిగా మజ్జిగ లేదా పన్నీరు కలుపుకోవాలి.

● ఎండకు కమిలిపోయిన చర్మం తిరిగి మామూలు కావాలంటే... పైన చెప్పుకున్న పెసల పేస్టులో చల్లటి పెరుగు లేదా కలబంద పేస్టు కలిపి ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆరిపోయిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేయాలి.





● హెయిర్ ఫాల్ తగ్గాలంటే... రాత్రంతా నానబెట్టిన పెసలను గ్రైండ్ చేసి అందులో కోడిగుడ్డు సొన, టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు కలిపి చిక్కటి పేస్టు చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి 15నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఈ మూంగ్‌దాల్ ప్యాక్‌ను నూనె రాసిన జుట్టుకు పట్టించకూడదు. షాంపూతో తలస్నానం చేసి ఆరిన తర్వాత మాత్రమే వేయాలి.

● 'ఆడపిల్ల'కు స్వాగతం

మా ఇంటి మహాలక్ష్మి

ఆడపిల్లపుట్టిందని సంబరం చేశారు.
ఇంట్లోకి పూలతో రహదారి పరిచారు.
చిట్టి పాదాల పారాణి ముద్రలు వేశారు.
అమ్మాయి పుడితే ఇలా స్వాగతం పలకండి.


పాపాయితో అమ్మానాన్నలు సంహిత, సాయికిరణ్


నట్టింట పాదముద్రలు వేయిస్తూ...

పాపాయిని ఎత్తుకున్న నానమ్మ



'ఆడదే ఆధారం... మన కథ ఆడనే ఆరంభం...' అంటూ పాడుకునే నేల మనది. ఆడపిల్ల పుట్టగానే గొంతులో వడ్ల గింజలు వేసిన నేల కూడా ఇది. తల్లి గర్భంలోనే శిశువును గుర్తించి పుట్టకముందే ప్రాణం తీస్తున్న పాపాలకూ కొదవలేదు. ఇక ఆడపిల్లను కన్న తల్లికి ఎదురయ్యే కష్టాలను ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆడపిల్ల పుట్టింది... అనగానే కోడలిపై చిర్రుబుర్రులాడే అత్తలు, భార్య–బిడ్డల ముఖం చూడని మగవాళ్లు ఉన్న సమాజం మనది. ఇన్ని దారుణాల మధ్య ఓ సంతోషవీచిక వెల్లివిరిసింది. పుట్టింది ఆడపిల్ల అని తెలియనే పండుగ చేసుకున్నారు. ఊరూ వాడా అందరినీ పిలిచి వేడుక చేసుకున్నారు. అమ్మమ్మగారింట్లో రెండు నెలలు పూర్తి చేసుకున్న బిడ్డ మూడవ నెల నానమ్మ దగ్గరకు ప్రయాణమైంది. ఆ బిడ్డనెత్తుకుని అత్తగారింటికి వచ్చిన తల్లికి పూలబాట పరిచారు అత్తింటివాళ్లు. పాపకు ఘన స్వాగతం పలికారు. ఆడబిడ్డ పుట్టడం అంటే ఇంట్లోకి లక్ష్మీదేవి రావడమేనన్నారు. ఆదర్శంగా నిలిచిన కుటుంబం తెలంగాణ, మహబూబాబాద్ జిల్లాలో ఉంది. కే సముద్రం మండలం, తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన పొడగంటి శ్రీనివాసాచారి, భద్రకాళి దంపతుల ఆదర్శవంతమైన ఆత్మీయత ఇది.

పాపాయి కోసం పూజలు

కోడలు గర్భిణి అని తెలియగానే మగ పిల్లవాడు పుట్టాలని అనుకుంటారు. కానీ భద్రకాళి కుటుంబీకులు మాత్రం ఆడపిల్ల కావాలని పూజలు చేశారు. వాళ్ల పెద్దకొడుకు సాయి కిరణ్‌కు సిరిసిల్ల పట్టణానికి చెందిన సంహితతో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. సంహిత నెలతప్పినప్పటి నుంచి భద్రకాళితోపాటు ఆమె తోడికోడలు సుమ, మరదలు రమ్య కూడా ఆడపిల్లలు పుట్టాలని వ్రతాలు, పూజలు చేశారు. వాళ్లందరికీ మగపిల్లలే. ఈ తరంలోనైనా ఇంట్లో ఆడపిల్ల కావాలని వాళ్ల కోరిక. ప్రసవం రోజు వరంగల్‌లో ఆసుపత్రికి ఇంటిల్లిపాది తరలి వెళ్లారు. ఆడపిల్ల పుట్టిందని తెలియగానే సంతోషంగా కేకలు వేస్తూ, హాస్పిటల్‌లో అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

అపూర్వ స్వాగతం

కోడలు పుట్టింటికి వచ్చిన రోజు ఇంటిని పూలతో అలంకరించారు. ముత్తయిదువలతో స్వాగతం పలికారు. చిన్న పాప కాళ్లకు పారాణి రాసి తొలి అడుగుల గుర్తులు నట్టింట్లో ముద్రించుకున్నారు. ఆ అడుగులను కళ్లకు అద్దుకున్నారు. ఆ జ్ఞాపకం కలకాలం నిలిచి ఉండడానికి ఫొటోలు తీశారు.

నా కోరిక తీరింది

నాకు చిన్నప్పటి నుండి ఆడపిల్లలంటే ఇష్టం. మా వారు కూడా ఆడపిల్ల ఉన్న ఇంటి అందమే వేరు అంటూ ఉంటారు. అందుకోసమే మా ఇంటి చుట్టుపక్కల ఉన్న ఆడ పిల్లలను ప్రతి పండుగకు పిలుస్తాం. వారు చేసే సందడి చూసి సంబుర పడుతాం. మా ఇంట్లో ఆడపిల్ల ఉండాలనే కోరిక నెరవేరింది. అందుకోసమే అలా స్వాగతం పలికాం.

- భద్రకాళి,
పాపాయి నానమ్మ

– ఈరగాని భిక్షం, సాక్షి, మహబూబాబాద్


● సృజన

అలా అడవి దారి పట్టింది

'గరిమ పుర ఎవరు?' అనే ప్రశ్నకు చాలా మంది జవాబు చెప్పలేకపోవచ్చు.
ఆస్కార్ అవార్డ్ గెలుచుకున్న 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' గురించి తెలియని వారు తక్కువ మంది ఉండవచ్చు.
27 సంవత్సరాల గరిమ ఈ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్‌కు స్క్రిప్ట్‌రైటర్...


గరిమ పుర

పంజాబ్‌లోని పటియాలాలో పుట్టిన గరిమ హైస్కూల్ చదువు పూర్తికాగానే కళాశాల విద్య కోసం మహారాష్ట్రలోని పుణెకు వచ్చింది. అక్కడే తనకు ప్రపంచ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలపై ఆసక్తి ఏర్పడింది. 'సింబియాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మీడియా'లో పట్టా పుచ్చుకున్న తరువాత డాక్యుమెంటరీలపై మరింత ఆసక్తి పెరిగింది.



డాక్యుమెంటరీలు తీయాలనుకొని ముంబైలో అడుగు పెట్టిన గరిమ ఒక మీడియా సంస్థలో చేరింది. 'వృత్తి జీవితం బాగానే ఉందిగానీ తాను వచ్చింది ఇందు కోసం కాదు కదా!' అని ఆలోచించింది. ఎనిమిది నెలల తరువాత ఉద్యోగాన్ని వదులుకొని స్క్రిప్ట్ రైటర్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఆ ప్రయత్నాలు ఫలించి వెబ్ సిరీస్‌కు రాయడం మొదలుపెట్టింది.

నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'లిటిల్ థింగ్స్'తో రైటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది గరిమ.

పట్టణ ప్రజల జీవనశైలిపై తీసిన ఈ సిరీస్ కోసం తొలిసారిగా ఇతర రచయితలతో కలిసి పనిచేసింది.

ఒంటరిగా కూర్చుని, నిశ్శబ్ద వాతావరణంలో రాసే అలవాటు ఉన్న గరిమ ఇతర రచయితలతో కలిసి చర్చలు చేస్తూ రాయాల్సి వచ్చింది.

'ఇతరులతో కూర్చొని చర్చిస్తూ రాయడం వల్ల మనల్ని మనం ఎంతో మెరుగు పరుచుకోవచ్చు. ఇలా కూడా ఆలోచించవచ్చా అనిపిస్తుంది. స్థూలంగా చెప్పాలంటే కలానికి కొత్త మెరుపు వస్తుంది' అంటుంది గరిమ.

2019లో వైల్డ్‌లైఫ్ డైరెక్టర్ గుంజన్ మీనన్ గరిమను డైరెక్టర్ కార్తికీ గోంజాల్వేజ్‌కు పరిచయం చేసింది. కార్తికీ దగ్గర ఒక మంచి కథ ఉంది. ఆమె మంచి రైటర్ కోసం వెదుకుతోంది. కట్ చేస్తే...

2020లో గరిమను వెదుక్కుంటూ కార్తికీ వచ్చింది. ఇక అప్పటి నుంచి స్క్రిప్ట్ రైటింగ్ పనుల్లోకి దిగింది గరిమ. అయితే ఇదేమీ కాల్పనిక స్క్రిప్ట్ కాదు. నాలుగు గోడల మధ్య ఏకాంతంగా రాసుకునే స్క్రిప్ట్ కాదు. అడవి దారి పట్టాలి. అనాథ ఏనుగుల కళ్లలోకి చూసి మౌనంగా మాట్లాడాలి. వాటిని సొంత పిల్లల్లా ఆదరించిన దంపతుల మనసు పొరల్లోకి వెళ్లాలి. తెలుసుకున్నదానికి సృజన జోడించాలి.

'30 ఏళ్లు కూడా దాటని ఈ అమ్మాయి ఇంత పనిచేయగలదా?' అనే సందేహం ఎప్పుడూ కార్తికీ గోంజాల్వేజ్‌కు రాలేదు. తనపై కార్తికీ పెట్టిన నమ్మకాన్ని గరిమ వృథా చేసుకోలేదు. స్క్రిప్ట్‌కు జవసత్వాలు ఇచ్చింది.

'కాలం మారింది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల పుణ్యమా అని యువతరం చిత్రపరిశ్రమలోకి వెల్లువలా వస్తోంది. ఇప్పుడు ఒకరి సృజనాత్మక శ్రమను దోచుకోవడం అనేది కష్టం. కష్టపడే వారికి విజయం త్వరగా చేరువయ్యే కాలం ఇది' అంటోంది గరిమ.

అలనాటి పుస్తకాల నుంచి తాజాగా విడుదలైన పుస్తకాల వరకు ఎన్నో పుస్తకాలు చదువుతుంటుంది గరిమ.

1973లో వచ్చిన ఎరిక జోంగ్ 'ఫియర్ ఆఫ్ ఫ్లైయింగ్' పుస్తకం అన్నా, అందులో జోంగ్ రాసిన వాక్యం...'ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుంది. అయితే అరుదైన ప్రతిభ అనేది మనం ఎంత సాధన చేస్తున్నాం, ఎంత కష్టపడుతున్నాం అనేదానిపైనే ఆధారపడి ఉంటుంది' అనే వాక్యం అన్నా ఆమెకు చాలా ఇష్టం. ●

కిచెన్ టిప్స్

● ఒక్కోసారి ఇంట్లో చీమలు పుట్టలు పెడుతుంటాయి. వాటిని వదిలించుకోవడం చాలా కష్టం.



ఎండాకాలం వచ్చిందంటే నల్లచీమల బెడద ఎక్కువ. ఇవి కుట్టవు కానీ చికాకు పెడతాయి. వాటిని వదిలించుకోవాలంటే బట్టల సబ్బు లేదా స్నానపు సబ్బును తురిమి అవి వచ్చే దారిలో వేయాలి. పుట్ట దగ్గర వేస్తే వాటికి సబ్బు ఘాటు పడదు కాబట్టి వెంటనే పారిపోతాయి.

● అల్లం వెల్లుల్లి ముద్ద చేసి పెట్టుకుంటాం కదా.. వాటిని మిక్సీలో వేసేటప్పుడు కాస్తంత



నూనె వేస్తే అల్లం వెల్లుల్లి పేస్టు మృదువుగా రావడమే కాకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది కూడా.

● ధనియాలను వేయించి చల్లార్చి డబ్బాలో నిల్వ చేస్తే పురుగు పట్టకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.



● ఒకోసారి ఎక్కువ మొత్తంలో కరేపాకు తెచ్చుకుంటాం. ఎంత జాగ్రత్త చేసినా అది ఎండిపోతుంటుంది. అదేవిధంగా ఒకోసారి కూరలో వెయ్యాలంటే కాసింత కూడా కరేపాకు దొరకదు. అలాంటప్పుడు కరివేపాకును నూనెలో వేయించి చల్లారాక సీసాలో నిల్వ ఉంచుకుంటే ఏదైనా కూర చేసుకున్నప్పుడు ఈ కరేపాకు కలిపితే మంచి రుచి వస్తుంది.



● కేరెంటింగ్

లాలన... పాలన



ఈ రోజుల్లో పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కూడా ఒత్తిడితో జీవిస్తున్నారు ముఖ్యంగా పెద్దలు డిప్రెషన్ లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో చిన్న పిల్లలు కూడా తీవ్రస్థాయిలో ఈ ఒత్తిడికి గురవుతున్నారు కాబట్టి తల్లిదండ్రులు పిల్లలు పెంచే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కోసం...

సాధారణంగా ప్రతి తల్లీ తండ్రీ చేసే పొరపాటు ఇతరులతో తతమ పిల్లల్ని పోల్చడం. అలా పోల్చని వాళ్లని వేళ్ళ మీద లెక్క పెట్టచ్చు. పక్కింటి చింటూ చూడు. ఎంత బుద్ధిగా ఉంటాడో. నువ్వే ఇంత అల్లరి చేస్తున్నావు అనో. ఫలానా వాళ్ల పాప చూడు. ఎంత బాగా చదువుతుందో. నువ్వసలు పుస్తకం ముట్టవు అనో... ఇలా మరొకరితో మీ పిల్లలకి పోలిక చెప్పడమంటే వాళ్ళని లెక్కలేకుండా చూడడమేనని. దానివల్ల వారు తమ ప్రవర్తనను మార్చుకోకపోగా. మరింత దూకుడుగా. అల్లరిగా ప్రవర్తిస్తారని చైల్డ్ సైకాలజిస్టులు చెబుతున్నారు. పోల్చి చెప్పడం వల్ల వారిలో అనవసరమైన ఈర్ష్య, అసూయలు పెరుగుతాయనీ, అందుకే పోలికల జోలికి పోకూడదని చెబుతారు.

పెద్దవాళ్ల దగ్గర ఉంచడం మేలు

పిల్లలను ఇంట్లో ఒంటరిగా ఉంచకుండా వారి అమ్మమ్మలు. తాతయ్యలతో కలిపి ఉంచడం మేలు. దీంతో వారు పెద్దల నుంచి ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంటారు. ఇక పిల్లల భద్రత గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మరేం చేయాలి?

మన బంగారాలని వాళ్లతో వీళ్లతో పోల్చి చెప్పడానికి బదులు మీకు వాళ్ళెంత ప్రత్యేకమో, వాళ్ళంటే ఎంత ఇష్టమో చెప్పండి. మీ పిల్లలు వాళ్ళల్లో వాళ్ళు కూడా ఎలాంటి పోలికలూ పెట్టుకోకుండా చూడటం కూడా ముఖ్యం.

సరదాగా గడపండి

మీకు సమయం దొరికినప్పుడు, పిల్లలతో సరదాగా గడపండి. ఆ సమయంలో మీరు ఉద్యోగాలు చేస్తూ ఎందుకు కష్టపడుతున్నారో పిల్లలకు వివరించండి. దీనివల్ల మీ పిల్లల భావోద్వేగాలు మీకు బాగా తెలుస్తాయి. తద్వారా పిల్లలు కూడా మీకు మద్దతు ఇవ్వడానికి తమ వంతు ప్రయత్నం చేస్తారు. మీరు ఆఫీస్ నుండి తిరిగి వచ్చాక, మీ పిల్లలతో సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని కేటాయించండి. ఇక వారంతాల్లో పూర్తి సమయాన్ని వారికే కేటాయించండి. పిల్లలతో విభిన్న పనులు ప్లాన్ చేయండి. వారికి ఇష్టమైన పనులు, వంటలు చేసి పెట్టండి. పిక్నిక్‌కి, పార్క్‌కి, సినిమాలకు తీసుకెళ్లండి.

బ్రహ్మాస్త్రం వేయకండి

కొంతమంది తల్లిదండ్రులు పిల్లల విషయంలో అతి జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు ఇది మాత్రం అంత మంచి పద్ధతి కాదు. ఎందుకంటే పిల్లలు తప్పు చేయడం సహజం. అలా తప్పు చేశారన్న కోపంతో వారిని కఠినంగా దండించామనుకోండి, ఆ తప్పును కప్పి పుచ్చడం కోసం ఇంకా అనేక తప్పులు చేస్తారు. అందువల్ల వారు ఏదైనా తప్పు చేసినప్పుడు ఒకటికి రెండుసార్లు ఓపిగ్గా చెప్పి చూడండి. అలా చెప్పినప్పటికీ మారకపోతే అప్పుడు దగ్గర కూర్చోబెట్టుకుని స్వరం పెంచి మాట్లాడండి. అంతే కానీ చిన్న తప్పు చేసినా పిల్లలపై మీ ప్రతాపం చూపించడం వల్ల వారు తీవ్ర అభద్రతా భావానికి లోనవుతారు.

టైమ్ టేబుల్ సెట్ చేయండి...

పిల్లలు ఒక వయసుకు వచ్చిన తర్వాత ఇంట్లో ఒంటరిగా వదిలివెళుతున్నప్పుడు వారికి ఒక నిర్దిష్టమైన టైమ్ టేబుల్‌ను సెట్ చేయాలి. ఎప్పుడు చదవాలి? ఎప్పుడు తినాలి? ఎప్పుడు ఆడుకోవాలి? ఎప్పుడు పడుకోవాలి... తదితర విషయాలకు వారితో మాట్లాడి అన్నిటికీ టైం ఫిక్స్ చేయండి. పిల్లలు కచ్చితంగా ఈ టైం టేబుల్‌ను పాటించేలా చూడండి. ఇక వారి వస్తువులను వారే సర్దిపెట్టుకునేలా, వారి పనులు వారే చేసుకునేలా అలవాటు చేయండి. ఇక ఆఫీసుకు వెళ్లినా ఇంట్లోని పిల్లల పరిస్థితి గురించి అడగడానికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉండండి.

ప్లే గ్రౌండ్‌కు పంపండి

పిల్లలకు కాసిని మార్కులు తక్కువ వచ్చాయని వారిని వత్తిడి చేయద్దు. ఎందుకంటే కేవలం మార్కుల కోసం చదివే చదువుల వల్ల పిల్లలు అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ర్యాంక్స్ కోసం ఐదో తరగతి నుంచే ప్లే గ్రౌండ్ కి దూరంగా టాబ్లెట్స్, కంప్యూటర్స్ ముందు కూర్చో పెట్టి కంప్యూటర్ కోడింగ్ సైతం నేర్పిస్తున్నారు. దీనివలన పిల్లల భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. పిల్లలు చిన్నప్పటినుంచి ప్లే గ్రౌండ్ లో ఆటలు ఆడుకునే విధంగా ప్రోత్సహించాలి. ప్లే గ్రౌండ్‌లో ఆడుకోకుండా ఇంట్లో కూర్చుని కంప్యూటర్ గేమ్స్ ఆడుకునేలా మాత్రం వారిని ఎంకరేజ్ చేయద్దు. కంప్యూటర్ గేమ్స్ ఎప్పుడైనా ఆడుకుంటే ఫరవాలేదు కానీ, వారికి శారీరక వ్యాయామం, ఉత్సాహం కావాలంటే మాత్రం ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి. శారీరకంగా చురుగ్గా ఉంటే మానసికంగా కూడా చురుగ్గా ఉంటారు.

ఇచ్చి పుచ్చుకోవడం నేర్పండి

చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు పిల్లలకు ఆత్మాభిమానంతో జీవించడం, పెద్దలకు గౌరవం ఇవ్వడం నేర్పించాలి. గౌరవం గానీ, ప్రేమ కానీ మనం ఇతరులకు ఇస్తేనే మనకు తిరిగి వస్తాయని చెప్పాలి. తద్వారా వారు భవిష్యత్తులో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడమే కాకుండా సమాజం పట్ల మంచి ప్రేమను కనబరుస్తారు. అదేవిధంగా తోటి పిల్లలతో వ్యత్యాసాలు చూసుకోకుండా సమానంగా నడుచుకునే విధంగా విలువలతో జీవించడం నేర్పాలి. సాధారణంగా చాలామంది పిల్లలు మనం చెప్పే మాటలు వినరు, కానీ మనం చేసేవి చూసి అలానే చేస్తారు. అందువల్ల మన పిల్లల ముందు మన నడవడిక బాగుండాలని గుర్తుంచుకోండి.

● ఆరోగ్యాహారం

ఒత్తిడిని తినేయండి



మానసిక ఆరోగ్యం బాగుండాలంటే కొన్ని రకాల పోషకాలను తప్పకుండా తీసుకోవాలి. దానికి పిల్లలు, పెద్దలు అనేం లేదు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలలో మానసికంగా చురుగ్గా ఉంచే కొన్ని కారకాలు ఉన్నట్లు పోషకాహార నిపుణులు గుర్తించారు. వాటిని తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి చురుగ్గా ఉండగలం. అవేమిటో చూద్దాం.

మానసిక ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు, డిప్రెషన్.. పేరు ఏదైనా వచ్చిన తర్వాత బాధ పడేకంటే రాకుండా చూసుకోవడం చాలా మేలు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలు తీసుకోండి. శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆరోగ్యంగా ఉండండి.



పొద్దుతిరుగుడు గింజలు... వీటిలో విటమిన్ 'ఇ' అధిక స్థాయిలో ఉంటుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది.



వెల్లుల్లి... వెల్లుల్లిలో సల్ఫర్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గ్లటాథియోన్ అనే యాంటీ ఆక్సిడెంట్‌ను ఉత్పత్తిచేస్తాయి. ఇది ఒత్తిడిని ఎదుర్కొనే రక్షణ ఛత్రంలో మొదటి మూలకంగా పనిచేస్తుంది.

గుడ్లు... గుడ్లలో పోషకాలు పుష్కలం అనే విషయం తెలిసిందే. వీటిలో విటమిన్లు, మినరల్స్, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్స్ సంతృప్త స్థాయిలో లభిస్తాయి. ప్రత్యేకంగా ఇందులో చోలిన్ అనే పోషకం పుష్కలంగా ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుందని, అలాగే ఒత్తిడి నివారణకు సమర్థంగా పనిచేస్తుందని వైద్యులు గుర్తించారు.

నువ్వులు... నువ్వులతో తయారుచేసే పదార్థాలలో ఎల్-ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం పాళ్లు ఎక్కువ. ఇది మనసును ఉల్లాసంగా ఉంచే డోపమైన్, సెరటోనిన్ ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది. అలాగే ఒత్తిడిని తగ్గించేందుకు తోడ్పడుతుంది. 25 మంది యువకులకు నాలుగు రోజుల పాటు నువ్వుల ఉండలను తినిపించి పరిశీలించినప్పుడు వారిలో ఆందోళన, ఒత్తిడి స్థాయిలు గణనీయంగా తగ్గినట్లు ఓ సర్వేలో తేలింది.



నువ్వులతో రకరకాల స్నాక్స్ తయారు చేసుకోవచ్చు. ఏదైనా పదార్థాన్ని రుచిగా ఉండేలా తయారు చేసుకోవడం వల్ల వాటిని తినే విధంగా మెదడు కూడా మనల్ని ప్రోత్సహిస్తుంది.

రుచికే కాదు.. ఆరోగ్యానికి కూడా...

ఆరోగ్యాన్ని ఇచ్చే పండ్లు అంటే ఎక్కువ మంది యాపిల్ గురించి మాట్లాడతారు. కానీ దానితో సమానంగా దానిమ్మ కూడా ఆరోగ్యాన్ని ఇస్తుందనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. దీనివల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

చాట్, స్వీట్ డిష్, ఐస్ క్రీమ్, స్మూతీస్ ఇలా ఏది చేసినా దాని మీద తప్పనిసరిగా గార్నిషింగ్ కోసం దానిమ్మ గింజలను ఉపయోగిస్తారు. ఎందుకంటే ఏదోవిధంగా దానిమ్మను తీసుకోవడం వల్ల ధమనుల్లో కొవ్వు చేరకుండా చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని అనుకుంటే తప్పకుండా దానిమ్మ పండ్లు తినడం అలవాటు చేసుకోండి.

దానిమ్మ వల్ల ప్రయోజనాలు...



- దానిమ్మ మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పోషకాలతో నిండి ఉంటుంది. తక్కువ కేలరీలు, కొవ్వు ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వ్యాధులను నిరోధించేందుకు సహాయపడతాయి. వృద్ధాప్యానికి దారి తీసే ఫ్రీ రాడికల్స్ నుంచి మనలని రక్షిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ ని తగ్గిస్తుంది. శరీరం నుంచి అదనపు కొవ్వుని తొలగించడంలో సహాయపడుతుంది.
- రక్తాన్ని పలుచన చేసి రక్తం గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలను మెరుగుపరిచి రక్తప్రసరణకి ఎటువంటి హాని కలగకుండా చూస్తుంది.
- జీర్ణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూస్తుంది. ప్రతిరోజు ఒక దానిమ్మ పండు తింటే మలబద్ధకం సమస్య దరి చేరదు.
- దానిమ్మలోని గుణాలు ధమనుల్లో ఆక్సీకరణ ఒత్తిడిని, వాపును తగ్గిస్తాయి. దానిమ్మ రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. గుండె పోటు, స్ట్రోక్ రాకుండా అడ్డుకుంటుంది.
- అధిక రక్తపోటుతో బాధపడే వాళ్ళు కనీసం మూడు నెలల పాటు ప్రతి రోజు మూడు దానిమ్మ పండ్లు తింటే చాలా మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కార్డియో వాస్కులర్ డిసీజ్ బారిన పడకుండా కాపాడుతుంది.
- రక్తహీనత సమస్య ఉన్న వాళ్ళు మందులు వాడే ముందు రోజూ దానిమ్మను తిని చూడటం ఉత్తమం. ఎందుకంటే దానిమ్మ ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచుతుంది.
- దానిమ్మ పండులోనే కాదు తొక్కల్లో కూడా విటమిన్ ఏ, సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి6 పోషకాలు ఉన్నాయి. అందుకే దానిమ్మ గింజలు తిన్నతర్వాత తొక్కలు పడేయకుండా వాటిని ఎండబెట్టి పొడి చేసుకుని పెట్టుకోండి.
- కీళ్ల నొప్పులతో బాధపడే వాళ్ళు దానిమ్మ తొక్కలు ఎండబెట్టుకుని చేసుకున్న పొడిని నీళ్ళలో వేసి మరిగించి తాగితే మంచిది.
- దానిమ్మ తొక్కల పొడిని వేడి నీళ్లలో కలిపి పేస్ట్ లా చేసుకుని ముఖానికి రాసుకుంటే మొటిమల సమస్యను అధిగమించవచ్చు.

సినిమా

నాటు నాటు ప్రజల పాట

\- రామ్‌చరణ్

లాస్ ఏంజిల్స్‌లో ఇటీవల జరిగిన 95వ ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవంలో 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డులను అందుకున్న విషయం తెలిసిందే. ఈ అవార్డు వేడుక కోసం లాస్ ఏంజిల్స్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి, కాస్ట్యూమ్ డిజైనర్ రమా రాజమౌళి, తనయుడు కార్తికేయ, సంగీత దర్శకుడు కీరవాణి, గాయకుడు కాలభైరవ, నటుడు శ్రీ సింహా తదితరులు శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. కాగా ఆస్కార్ అవార్డు సాధించడం గురించి రాజమౌళిని స్పందించమని విలేకర్లు అడగ్గా.. ఆయన 'జైహింద్' అన్నారు. ఇక ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు లాస్ ఏంజిల్స్ నుంచి శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు రామ్‌చరణ్. 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడం గురించి స్పందిస్తూ– ''భారతీయ అభిమానులందరూ 'ఆర్ఆర్ఆర్'ను ఆదరించారు. 'నాటు నాటు' పాటను సూపర్ హిట్ చేశారు. 'నాటు నాటు' పాట మాది కాదు.. ప్రజల పాట. ప్రేక్షకుల అభిమానమే ఆస్కార్‌కి దారి వేసింది, అవార్డు వరించేలా చేసింది. వారితో పాటు కీరవాణి, చంద్రబోస్, రాజమౌళిగార్లకి కూడా థ్యాంక్స్ చెబుతున్నాను'' అని పేర్కొన్నారు రామ్‌చరణ్.



● రామ్‌చరణ్

తప్పుగా అర్థం చేసుకున్నారు: కాలభైరవ

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను పాడినందుకు ఆనందంగా ఉందంటూ ఓ నోట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు కాలభైరవ. ''ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను ప్రదర్శించినందుకు గర్వపడుతున్నాను. నాకు ఈ విలువైన క్షణాలు దక్కడానికి రాజమౌళి బాబా, నాన్న (కీరవాణి), కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ మాస్టర్, కార్తికేయ అన్న, అమ్మ, పెద్దమ్మ... ఇలా మరి కొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణమయ్యారు. యూఎస్ టీమ్ కూడా హెల్ప్ చేసింది. వీరి సహకారం, ప్రోత్సాహం లేకపోతే ఆస్కార్ వేదికపై నా ప్రదర్శన వీలయ్యేది కాదు'' అని ఆ నోట్‌లో చెప్పు కొచ్చారు కాలభైరవ. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల పేర్లను కాలభైరవ ప్రస్తావించకపోవడంతో ఈ ఇద్దరి హీరోల అభిమానులు, కొందరు నెటిజన్లు తప్పుబడుతూ కామెంట్స్ చేశారు. దీంతో ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా కాలభైరవ స్పందించారు. ''ఆర్ఆర్ఆర్ సినిమా, ఇందులోని 'నాటు నాటు' పాట సక్సెస్‌కు తారక్ అన్న, చరణ్ అన్న ముఖ్యులు. అందులో సందేహం లేదు. అయితే నేను ఆస్కార్ వేదికపై నా ప్రదర్శనకు సంబంధించిన విషయం గురించి మాత్రమే ఆ నోట్‌లో ప్రస్తావించాను. అది తప్పుగా అర్థమైనట్లుంది. అయినప్పటికీ నా మాటలను క్షమించమని అడుగుతున్నాను'' అని కాలభైరవ పేర్కొన్నారు.



● కాలభైరవ

ఆస్కార్ వేదికపై షాక్ అయ్యా: గునీత్ మోంగా

'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో ఆస్కార్ అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీ నిర్మాత గునీత్ మోంగా శుక్రవారం ముంబై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మామూలుగా ఆస్కార్ అవార్డు అందుకున్నవారు తమ యాక్సెప్టెన్సీ స్పీచ్‌ను 45 సెకన్లలో పూర్తి చేయాలి. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' దర్శకురాలు కార్తీకి అన్ని సెకన్లలోనే పూర్తి చేశారు. కానీ నిర్మాత గునీత్ మోంగా కాస్త ఎక్కువ టైమ్ తీసుకుని మాట్లాడుతుండగా స్పీచ్ ఆపాలన్నట్లుగా వెనకనుంచి మ్యూజిక్ ప్లే చేశారు ఆస్కార్ నిర్వాహకులు. అలాగని నిర్వాహకులు ఈ 45 సెకన్ల నియమంలో కఠినంగా ఏమీ లేరు. బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు గెల్చుకున్న చార్లీ మాక్సే, మ్యాథ్యూ ఫ్రాండ్‌లు 45 సెకన్ల కన్నా ఎక్కువగా మాట్లాడినా, నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఈ విషయంపై గునీత్ మోంగా స్పందించారు. ''ఇండియాకు తొలి ఆస్కార్ అవార్డును సాధించామనే గొప్ప విషయం గురించి చాలా మాట్లాడాలనుకున్నాను. కానీ నా స్పీచ్‌ను కట్ చేశారు. షాక్ అయ్యాను. ఇండియా తరపున నేను మాట్లాడే అవకాశాన్ని నా నుంచి ఎవరో లాగేసుకున్నట్లుగా అనిపించింది. నేను మళ్లీ ఆస్కార్‌కు వెళతాను. అప్పుడు తప్పకుండా నా గొంతు మళ్లీ వినిపిస్తాను'' అని పేర్కొన్నారు గునీత్.



● గునీత్ మోంగా

ఆర్ఆర్ఆర్... నెంబర్ 3

భారతీయ చిత్రాల్లో అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన జాబితాలో 'ఆర్ఆర్ఆర్' మూడోస్థానంలో నిలిచింది. ఇదివరకు ఈ స్థానంలో 'కేజీఎఫ్: చాప్టర్ 2' ఉండేది. తొలుత అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన ఇండియన్ చిత్రాల జాబితాలో వరుసగా 'దంగల్' (దాదాపు రూ. 1900 కోట్లు), 'బాహుబలి: ది కన్‌క్లూజన్'(రూ. 1800 కోట్లు), 'కేజీఎఫ్: చాప్టర్ 2' (రూ. 1230 కోట్లు), 'ఆర్ఆర్ఆర్' (దాదాపు రూ. 1150 కోట్లు), 'పఠాన్' (రూ. 1050 కోట్లు.. ఇంకా ప్రదర్శితమవుతోంది) ఉన్నాయి. అయితే గత ఏడాది అక్టోబరులో జపాన్‌లో విడుదలైన 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికీ ప్రదర్శితమవుతోంది. జపాన్ బాక్సాఫీస్ వద్ద 'ఆర్ఆర్ఆర్' ఇప్పటివరకు రూ. 80 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. అలాగే 'ఆస్కార్' ప్రచారంలో భాగంగా అమెరికాలో ఈ నెల 3న, తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 10న 'ఆర్ఆర్ఆర్'ను రీ రిలీజ్ చేశారు. దీంతో మరికొన్ని కలెక్షన్స్ వచ్చాయి. ఈ వసూళ్లు మొత్తాన్ని కలిపితే 'కేజీఎఫ్: చాప్టర్ 2' గ్రాస్ కలెక్షన్స్‌ను 'ఆర్ఆర్ఆర్' దాటిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

అందుకే విశ్వక్ డైరెక్షన్ మానేయాలి

\- ఎన్టీఆర్



● కరాటే రాజు, ఎన్టీఆర్, విశ్వక్‌సేన్, నివేదా పేతురాజ్

''సినిమా పట్ల విశ్వక్ సేన్‌కి ఎంతో పిచ్చి ఉంది. ఆ పిచ్చి తగ్గిపోకూడదు. ఇలాంటివాళ్లను ప్రోత్సహిస్తేనే పరిశ్రమ ఇంకా ముందుకెళుతుంది. 'దాస్ కా ధమ్కీ' హిట్ అవ్వాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. కరాటే రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన 'దాస్ కా ధమ్కీ' ఈ నెల 22న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''ఒకే చట్రంలో ఇరుక్కుపోతున్నానని చాలా కాలం తర్వాత రియలైజ్ అయిన నేను, మీరు (అభిమానులు) కాలర్ ఎత్తుకునే సినిమాలు చేస్తానని మాట ఇచ్చాను.. ఆ మాట అన్నప్పుడే నటుడిగా నేను మళ్లీ పుట్టాను. వైవిధ్యమైన నటన కోసం నేను తాపత్రయపడుతున్నాను కాబట్టే మిమ్మల్ని కాలర్ ఎగరేసుకునేలా చేస్తున్నానని అనుకుంటున్నాను. విశ్వక్ కూడా ఒకే తరహా పాత్రల నుంచి బయటికొచ్చి, కొత్తగా చేస్తున్నాడు. 'దాస్ కా ధమ్కీ' బ్లాక్ బస్టర్ అవ్వాలి. ఆ తర్వాత తను దర్శకత్వం మానేయాలి. ఎందుకంటే కొత్త యువ దర్శకులకు నీలాంటి వాళ్లు అవకాశాలు ఇవ్వాలి. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచ చిత్ర పటంలో ఆల్‌టైమ్ టాప్‌లో ఉంది. 'ఆర్ఆర్ఆర్' ఈ రోజు ప్రపంచ చిత్రపటంలో నిలబడిందంటే, ఆస్కార్ అవార్డుని సొంతం చేసుకుందంటే దానికి మా యూనిట్‌తో పాటు యావత్ తెలుగు, భారతదేశ చిత్రపరిశ్రమ, ప్రేక్షక దేవుళ్లు కూడా కారణం. కీరవాణి, చంద్రబోస్‌గార్లు ఆస్కార్ అవార్డు తీసుకుంటున్నప్పుడు నాకు వాళ్లు కనిపించలేదు.. ఇద్దరు భారతీయులు కనిపించారు.. ఇద్దరు తెలుగువాళ్లు కనిపించారు'' అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఇండియాలో బెస్ట్ యాక్టర్ ఎవరంటే ఎన్టీఆర్ అన్న అని నేను ఎప్పుడో చెప్పాను. నా సినిమాని ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ వచ్చాడు. ఆయన రాకతో నా సినిమా బ్లాక్‌బస్టర్ స్టార్ట్ అయిపోయినట్లే''అన్నారు. ''ఫలక్‌నుమా దాస్' తీసినప్పుడు మా అబ్బాయి విశ్వక్ ఎవరికీ తెలియదు. ఎంతో పబ్లిసిటీ చేసి, సినిమా విడుదలకి ముందే స్టార్‌డమ్ తెచ్చుకున్నాడు. 'దాస్ కా ధమ్కీ' కోసం 15 నెలలు కష్టపడ్డాడు'' అన్నారు కరాటే రాజు.


మా నమ్మకం నిజమైంది



● హర్షిత్ రెడ్డి, హన్షిత

''ప్రతి ఊరిలో, ప్రతి కుటుంబంలో జరిగే కథే 'బలగం'. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని వేణు కథ చెప్పినప్పుడే నమ్మాం. అది నిజమైంది'' అని నిర్మాతలు హర్షిత్ రెడ్డి, హన్షిత ('దిల్' రాజు కుమార్తె) అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా వేణు ఎల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా హన్షిత మాట్లాడుతూ– ''శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నాన్నగారు ('దిల్' రాజు) తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో భారీ సినిమాలు నిర్మిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించడంతో పాటు ప్రయోగాత్మక, వైవిధ్యమైన కథలను చిన్న సినిమాల ద్వారా ప్రేక్షకులకు అందివ్వాలనే 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్‌ని స్థాపించాం. 'బలగం'ని ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో చూశాక నాన్నగారు 'మీరు ఎన్ని సినిమాలు తీసినా 'బలగం' మాత్రం గుర్తుండిపోతుంది' అని అభినందించారు'' అన్నారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ– ''బలగం' చిత్రానికి రోజు రోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి. మా తొలి సినిమాకే ఇంత మంచి పేరు రావడం హ్యాపీ. ప్రస్తుతం యష్ మాస్టర్ హీరోగా శశి అనే కొత్త డైరెక్టర్‌తో ఓ సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు.

బికిలి అంటే..?



● విజయ్ ఆంటోని

'వీళ్లే బికిలి బికిలి బిలి బిలి.. బికిలి బికిలి బిలి బిలి...' అంటూ పాడారు విజయ్ ఆంటోని. 2016లో విజయ్ ఆంటోని హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'పిచ్చైక్కారన్' తెలుగులో 'బిచ్చగాడు'గా విడుదలై ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. శశి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఇప్పుడు 'బిచ్చగాడు'కు సీక్వెల్‌గా 'బిచ్చగాడు 2' వస్తోంది. విజయ్ ఆంటోని నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బికిలి' అనే పాట మ్యూజిక్ వీడియోను రిలీజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన ఈ పాటకు మ్యూజిక్ కంపోజింగ్, సింగర్ విజయ్ ఆంటోనీయే కావడం విశేషం. ఇక పేదవాళ్ల పేదరికాన్ని ఉపయోగించుకుని తన ధనబలంతో వారిని బానిసలుగా చేసి, డబ్బు ఉందన్న అహంకారంతో తిరిగే వాళ్లకు తాను బికిలీ అని పేరు పెట్టినట్లు విజయ్ ఆంటోని పేర్కొన్నారు.

కామెడీ.. యాక్షన్



● యోగేశ్వర్, సుమన్, జీవీవీ గిరి

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారీ'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్ లీడర్ అంజన్ కుమార్ యాదవ్, నటుడు సుమన్, నిర్మాత ప్రసన్న కుమార్ ట్రైలర్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ చంద్ర మహేష్, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, ప్రతాని రామకృష్ణ గౌడ్ థియేట్రికల్ ప్రోమోను, నటి కవిత సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ''మంచి కథ, కథనాలతో నిర్మించిన మా 'పరారీ' అందర్నీ మెప్పిస్తుంది'' అన్నారు జీవీవీ గిరి. ఈ చిత్రానికి సంగీతం: మహిత్ నారాయణ్.

వైరానికి సిద్ధం



● మోనాల్, ప్రణమ్

నటుడు దేవరాజ్ తనయుడు ప్రణమ్ దేవరాజ్ హీరోగా నటించిన చిత్రం 'వైరం'. సాయి శివం జంపాన దర్శకత్వం వహించిన ఈ మూవీలో మోనాల్ హీరోయిన్. యువాన్స్ నాయుడు సమర్పణలో తెలుగు, కన్నడ భాషల్లో జె. మల్లికార్జున నిర్మించారు. నటులు దేవరాజ్, చంద్ర దేవరాజ్ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, నటులు బెనర్జీ, కాశీ విశ్వనాథ్ 'వైరం' టీజర్‌ను విడుదల చేశారు. దేవరాజ్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులు నన్నెంతో ఆదరించారు. హీరోగా వస్తున్న నా కుమారుడు ప్రణమ్‌ని కూడా ఆదరించాలి'' అన్నారు. ''త్వరలో మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు జె. మల్లికార్జున. ''ఈ సినిమా బాగా వచ్చింది'' అన్నారు సాయి శివన్ జంపాన. ఈ చిత్రానికి సహనిర్మాత: శీలం త్రివిక్రమ్ రావు, అరిపిరాల కళ్యాణ్ శాస్త్రి, సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: సామల భాస్కర్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	355	57,990
నిఫ్టీ ▲	114	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,650	▽ 66
డోజోన్స్	31,923	▽ 323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▽ 75
డాక్స్	14,768	▽ 199
షాంఘై	3,251	▲ 24
నికాయ్	27,334	▲ 323

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,882 ▽ 121
బంగారం (22 క్యారెట్)	58,646 ▽ 120
వెండి (కిలో)	71,576 ▽ 523

బిస్లెరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
18-2-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20-25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15-20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ



బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.

ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రాపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్‌ఎస్ సిరీస్

హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్‌ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్‌ఎస్ 160, ఎన్‌ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో



ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్‌ఎస్ 200 మోడల్ 18.75 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్‌ఎస్ 160 మోడల్ 14.6 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.

బిగ్'సి' ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. "ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.



ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.



ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు

ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్ధంలో కనిష్టస్థా



యిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అర శాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్‌ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్‌ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్‌ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1-5, 2-77, 3-129, 4-139, 5-169, 6-174, 7-184, 8-184, 9-188, 10-188. **బౌలింగ్:** షమీ 6-2-17-3, సిరాజ్ 5.4-1-29-3, పాండ్యా 5-0-29-1, శార్దుల్ 2-0-12-0, జడేజా 9-0-46-2, కుల్దీప్ 8-1-48-1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1-5, 2-16, 3-16, 4-39, 5-83. **బౌలింగ్:** స్టార్క్ 9.5-0- 49-3, స్టొయినిస్ 7-1-27-2, అబాట్ 9-0-31-0, గ్రీన్ 6-0-35-0, జంపా 6-0-37-0, మ్యాక్స్‌వెల్ 2-0-7-0.



గాయత్రి-ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి - ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21-14, 18-21, 21-12 స్కోరుతో లీ వెన్ మీ - ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి - ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి - ట్రెసా 6-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6-6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11-8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18-12కు దూసుకెళ్లి



ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి - ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8-1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11-4..13-5..15-8..18-10...ఇలా సాగింది. 20-12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా - లీ సో హితో గాయత్రి - ట్రెసా తలపడతారు.

జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) ద్వారా ఎన్ యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5-0 స్కోరుతో ఎంవాంగి టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0-5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.



ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.

క్లుప్తంగా...

మార్గదర్శి మోసాలపై పూర్తిస్థాయి ఆడిట్

సాక్షి, అమరావతి: చిట్టీల ముసుగులో భారీ అవకతవకలకు పాల్పడిన మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పూర్తిస్థాయి ఆడిటింగ్ నిర్వహించాలని ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. ఇందుకోసం 1982 చిట్‌ఫండ్ చట్టం సెక్షన్ 61(2) ప్రకారం చిట్ ఆడిటర్‌ను నియమించారు. రాష్ట్రంలో మార్గదర్శికి చెందిన 37 బ్రాంచ్‌ల్లో చిట్ ఆడిటర్ పూర్తి స్థాయి ఆడిటింగ్ నిర్వహించి రిజిస్ట్రేషన్ల శాఖకు నివేదిక సమర్పించనున్నారు. మార్గదర్శిలో జరిగిన అవకతవకలు, మోసాలపై ఇప్పటికే చార్టెడ్ అకౌంటెంట్‌తో ఆడిటింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న మార్గదర్శి ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్, బ్యాంక్ ఖాతాలను పరిశీలించాక చిట్‌ఫండ్ నిధుల్ని చట్ట విరుద్ధంగా అనుబంధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించారు. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీలు, ఈక్విటీ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పెట్టుబడులు పెట్టినట్లు నిర్ధారించారు. ఇంకా పలు తీవ్ర ఉల్లంఘనలను గుర్తించడంతో పూర్తి స్థాయి ఆడిటింగ్ నిర్వహణకు చార్టెడ్ అకౌంటెంట్ సిఫారసు చేశారు. అప్పుడే మార్గదర్శిలో జరిగిన మోసాలన్నీ బయట కొచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీంతో పూర్తిస్థాయి ఆడిటింగ్ నిర్వహణకు వీలుగా చిట్ ఆడిటర్‌ను నియమిస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవంలేదు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు జరగదు
- పులివెందులలో టీడీపీకి అధిక ఓట్లు వచ్చాయని అసత్య ప్రచారం
- ట్విట్టర్‌లో ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం వెల్లడి

సాక్షి, అమరావతి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పులివెందులలో అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంటే టీడీపీ అభ్యర్థికి అధిక ఓట్లు వచ్చాయని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం శుక్రవారం ట్విట్టర్‌లో తెలిపింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ వాదన పూర్తిగా నిరాధారమని పేర్కొంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ.. ఎమ్మెల్యే ఎన్నికల మాదిరిగా నియోజకవర్గాల వారీగా జరగదని గుర్తుచేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విడివిడిగా కాకుండా పోలైన ఓట్లన్నీ కలిపే లెక్కింపు చేస్తారని స్పష్టంచేసింది. త్వరలో ఎన్నికల సంఘం తుది వివరాలను ప్రకటిస్తుందని.. ఈలోగా ఎలాంటి అసత్య వార్తలను నమ్మవద్దని కోరింది.

హామీలు అమలు చేయండి

పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలను పరిష్కరించండి

- రిసోర్స్ గ్యాప్ కింద ఇవ్వాల్సిన రూ.36,625 కోట్లు చెల్లించేలా ఆదేశాలివ్వండి
- పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తికి రూ.10 వేల కోట్లు ఇవ్వండి
- కడప స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించండి
- ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్ వినతి
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని పునరుద్ఘాటన


శుక్రవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ : రాష్ట్ర విభజన హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు కావొస్తున్నా, అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు ద్వైపాక్షిక అంశాలు పరిష్కారానికి నోచుకోలేదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటినీ పరిష్కరించి రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర విభజన అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ సహా ఇతర కేంద్ర మంత్రులకు విన్నవించేందుకు గురువారం రాత్రి ఢిల్లీకి వచ్చిన వైఎస్ జగన్.. శుక్రవారం ఉదయం మోదీతో పార్లమెంట్‌లోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధానికి వినతులు అందజేశారు. ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై కేంద్రం ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ పలు దఫాలుగా చర్చలు జరిపి కొంత పురోగతి సాధించినా, కీలక అంశాలన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయనే విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

రుణ పరిమితి పెంచండి

2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం వైఎస్ జగన్ ప్రధానిని కోరారు. రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ చేస్తామంటూ పార్లమెంట్ సాక్షిగా కేంద్రం చెప్పిందని, దీనిపై సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇదే సమయంలో గత ప్రభుత్వం పరిమితికి మించి రుణాలు తీసుకుందన్న కారణంతో ఇప్పుడు రాష్ట్ర రుణాల పరిమితులపై ఆంక్షలు విధించారని వివరించారు. ఈ ప్రభుత్వం తప్పు లేకపోయినప్పటికీ నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారని చెప్పారు. 2021–22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి తదుపరి కాలంలో దానిని రూ.17,923 కోట్లకు తగ్గించారన్నారు. కోవిడ్ సృష్టించిన ఆర్థిక విపత్తు సమయంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ విషయంలో జోక్యం చేసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

పోలవరానికి రూ.10 వేల కోట్లు

పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతోందని, ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా ప్రాజెక్టు నిర్మాణం సాగిస్తోందని సీఎం.. ప్రధానికి వివరించారు. ఈ ప్రాజెక్టు విషయంలో కేంద్రం తగిన సహకారం అందిస్తే కొద్ది కాలంలోనే ఇది వాస్తవ రూపంలోకి వచ్చి ప్రజలకు ఫలితాలు అందుతాయన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖజానా నుంచి రూ.2,600.74 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. గత రెండేళ్లుగా ఈ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను వెంటనే చెల్లించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ నిర్ధారించిన ప్రాజెక్టు అంచనాలు రూ.55,548 కోట్లను ఆమోదించాలని విన్నవించారు. తాగునీటి సరఫరా అంశాన్నీ ప్రాజెక్టులో భాగంగా చూడాలని, ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్‌వారీగా నిబంధనలు సడలించాలని కోరారు. ముంపు బాధితులకు త్వరగా పరిహారం ఇవ్వాలని అడిగారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగంగా చేపట్టేందుకు రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన ఇతర అంశాలు ఇలా...

- తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు రావాల్సిన బకాయిలు అలానే ఉన్నాయి. 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. వీటిని వెంటనే ఇప్పించాలి.
- రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంట్ సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. దీనివల్ల రాష్ట్రానికి గ్రాంట్లు, పన్ను రాయితీలు లభిస్తాయి. భారీగా పరిశ్రమలు రావడమే కాకుండా సేవా రంగం విస్తరిస్తుంది. స్వయం శక్తి దిశగా రాష్ట్రం అడుగులేసేందుకు తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాలో సుమారు 18 లక్షల మంది జనాభా ఉన్నారు. కొత్తగా కేంద్రం మంజూరు చేసిన 3 మెడికల్ కాలేజీలతో కలిపి మొత్తంగా 14 మాత్రమే ఉన్నాయి. మిగిలిన కాలేజీలకు వీలైనంత త్వరగా అనుమతులు ఇవ్వాలి.
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో కేంద్రం హామీ ఇచ్చింది. ఈ ప్లాంట్ నిలదొక్కుకోవాలంటే ఏపీఎండీసీకి గనులు కేటాయించాలి.

విభజన అంశాలపై అమిత్ షాకు వినతి

ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఏపీ సీఎం వైఎస్ జగన్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. పార్లమెంట్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాలను ప్రస్తావించారు. ప్రత్యేక హోదా, తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలు, పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాల ఆమోదం వంటి అంశాలపై మాట్లాడారు. తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు అంశం గురించి ప్రస్తావించినట్లు తెలిసింది.


సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఆరుగురి మృతి

బత్తలపల్లి: ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం పోట్లమర్రి సమీపంలో ధర్మవరం–బత్తలపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బత్తలపల్లి నుంచి ధర్మవరానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో.. ధర్మవరం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఆటో నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న బత్తల మల్లేశు (48), దాసరి ఈశ్వరయ్య (45), హాజీపీరా (52), గాలి నారాయణస్వామి (49), నరసింహులు (41) అక్కడికక్కడే మృతిచెందారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి (49) తీవ్రగాయాలతో ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. గాయపడిన వారిలో ఐదేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది.

జైకొట్టిన టీచర్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా


ఎంవీ రామచంద్రారెడ్డి


విజయ చిహ్నం చూపుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, అమరావతి/సాక్షి, తిరుపతి/ చిత్తూరు కలెక్టరేట్/సాక్షి ప్రతినిధి, అనంతపురం : రాష్ట్రంలో స్థానిక సంస్థల కోటాలో తొమ్మిది ఎమ్మెల్సీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన వైఎస్సార్‌సీపీ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రభంజనం సృష్టించింది. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి 169 ఓట్ల ఆధిక్యంతో ఏపీటీఎఫ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డిపై విజయం సాధించారు. టీడీపీ మద్దతుతో పోటీ చేసిన పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి మూడో స్థానంలో నిలవడం గమనార్హం. తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి 1043 ఓట్ల ఆధిక్యంతో టీడీపీ మద్దతుతో పోటీ చేసిన పీడీఎఫ్ అభ్యర్థి పాక్కిరెడ్డి బాబురెడ్డిపై ఘన విజయం సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో.. విభజన తర్వాత రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ఇదే ప్రథమమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 13న ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించింది. ఓట్ల లెక్కింపును గురువారం ప్రారంభించింది.

టీడీపీ కట్టల్లోకి వైఎస్సార్‌సీపీ ఓట్లు!

- 8వ రౌండులో ఆరు ఓట్లు టీడీపీ ఖాతాలోకి
- తీవ్ర అభ్యంతరం చెప్పిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు
- మొత్తం ఓట్లు తిరిగి లెక్కించాలని అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి డిమాండ్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో తీవ్ర తప్పిదం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వేసిన ఓట్లను తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బండిల్స్‌లో కలిపారు. 8వ రౌండ్ ఓట్ల లెక్కింపులో 19వ టేబుల్ వద్ద ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని గమనించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ ఓట్లను తిరిగి లెక్కించగా ఆరు ఓట్లు టీడీపీ కట్టలో కలిశాయని స్పష్టమైంది. దీనిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా ఎన్ని ఓట్లను ఇలా కలిపారోనన్న అనుమానం ఉందని, మొత్తం ఓట్లను తిరిగి లెక్కించాలని రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ కూడా రాశారు. ఇంతమంది కౌంటింగ్‌లో ఉన్నప్పుడే ఇలా తమ ఓట్లను టీడీపీ ఖాతాలో కలిపేయడం దారుణమన్నారు. తొలి, రెండో రౌండులో వెయ్యి ఓట్లకు పైగా మెజారిటీ వస్తే, మూడో రౌండు నుంచి 20, 30 ఇలా తూకమేసినట్టు మెజారిటీ రావడం పైనా అనుమానాలున్నాయ న్నారు. కాగా, ఒకసారి కౌంటింగ్ పూర్తయి బండిల్స్‌ను కలిపేస్తే తిరిగి లెక్కించడం కుదరదని, అభ్యంతరం వ్యక్తం చేసిన ఏ బాక్స్ అయినా తిరిగి లెక్కిస్తామని రిటర్నింగ్ అధికారి చెప్పారు.

కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు

మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్

చిత్తూరు కలెక్టరేట్/సాక్షి, విశాఖపట్నం/సాక్షి ప్రతినిధి, అనంతపురం : తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరూ గెలుపునకు సరిపడా ఓట్లు సాధించకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లే గెలుపును నిర్ణయించనున్నాయి. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొదటి ప్రాధాన్యతా ఓట్లలో టీడీపీ అభ్యర్థి శ్రీకాంత్ ముందంజలో ఉన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యతతో కొనసాగుతున్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు ముందంజలో ఉన్నారు. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి శనివారం తుది ఫలితం వెలువడే అవకాశం ఉంది.

నగర వార్తలు

మల్కాజిగిరికి లెఫ్టినెంట్ కల్నల్ పార్థివ దేహం




విలపిస్తున్న కల్నల్ వీవీబీ రెడ్డి భార్య

మల్కాజిగిరి: అరుణాచల్ ప్రదేశ్‌లో ఆర్మీకి చెందిన చేతక్ హెలికాప్టర్ కూలిన ఘటనలో మృతిచెందిన మల్కాజిగిరి దుర్గానగర్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి(ఉప్పల వినయ్‌భానురెడ్డి) పార్థివ దేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో బేగంపేట విమానాశ్రయానికి తీసుకువచ్చి..అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన మిలటరీ వాహనంలో ఊరేగింపుగా మల్కాజిగిరి దుర్గానగర్‌లోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు. శనివారం ఉదయం యాదాద్రి జిల్లా బొమ్మలరామారం గ్రామానికి తరలించి అక్కడ మిలటరీ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

5,986 మంది విద్యార్థులు డుమ్మా

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థుల గైర్హాజరు సంఖ్య పెరుగుతోంది. శుక్రవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లిష్ పేపర్–1 పరీక్షకు సుమారు 5,986 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. హైదరాబాద్ పరిధిలో 2,967, రంగారెడ్డి జిల్లాలో 1,762, మేడ్చల్ మల్కాజిగిరి పరిధిలో 1,257 మంది గైర్హాజరయ్యారు. ఇప్పటి వరకు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు వెల్లడించారు. పరీక్ష కేంద్రాలపై గట్టి నిఘా పెట్టడంతోపాటు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాలను సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు డీఐసీ, హైపవర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

పకడ్బందీగా ‘పది’ పరీక్షల ఏర్పాట్లు

జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత సమీక్ష



టెన్త్ పరీక్షల నిర్వహణపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీఆర్ఓ సూర్యలత

సాక్షి, సిటీబ్యూరో : పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. వచ్చే నెల 3 నుంచి 13 వరకు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో నిర్వహణ ఏర్పాట్లపై విద్య, వైద్య, పోలీసు, జలమండలి, విద్యుత్, ఆర్టీసీ పోస్టల్ శాఖాధికారులతో సమీక్షలు నిర్వహించి ఆదేశాలు జారీ చేస్తోంది. హైదరాబాద్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ప్రభుత్వ విద్యా సంస్థల కేంద్రాలతో పాటు ప్రైవేటు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా చర్యలకు ఉపక్రమించారు. పరీక్షలన్నింటినీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతీ పరీక్ష కేంద్రాల్లో 3 మెగా పిక్సెల్, 30 మీటర్ల రేంజ్, 180 డిగ్రీల వరకు కవర్‌చేసేలా సీసీ కెమెరాలను అమర్చే విధంగా చర్యలు చేపట్టారు. సీల్ చేసిన ప్రశ్నపత్రాలను ఓపెన్ చేసినప్పటి నుంచి తిరిగి జవాబు పత్రాలను ప్యాక్ చేసే ప్రక్రియనంతా సీసీ కెమెరాలలో రికార్డు చేయాలని సూచించింది. హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో డీఈఓ రోహిణి, జీహెచ్‌ఎంసీ సీఎంఓహెచ్ కె.పద్మజా తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి కార్పొరేటర్లకు క్రీడా పోటీలు

హిమాయత్‌నగర్: కార్పొరేటర్లకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రెండు రోజుల పాటు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, క్యారమ్స్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్స్ తదితర క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో క్రీడను ఒక్కో మైదానంలో నిర్వహిస్తున్నారు. ఆయా క్రీడలకు డీసీలను ఇన్‌చార్జిలుగా కమిషనర్ లోకేష్‌కుమార్ నియమించారు. ఫతుల్లాగూడ డీఆర్‌ఎఫ్ ట్రెనింగ్ సెంటర్‌లో క్రికెట్, ఉప్పల్ స్టేడియంలో కబడ్డీ, చార్మినార్ ఖులికుతుబ్‌షా స్టేడియంలో వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్‌లు చందానగర్ స్టేడియంలో, ఖైరతాబాద్ జోన్‌లోని విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ మ్యూజికల్ చైర్స్ క్రీడలను నిర్వహిస్తారు. పోటీల్లో కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ పాల్గొని విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ కోరింది.

ఈబీఆర్ కేఫ్‌ను ప్రారంభించిన సానియా



బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని ఎఫ్‌ఎన్‌సీసీలో నూతనంగా తీర్చిదిద్దిన ఈబీఆర్ కేఫ్‌ను ప్రముఖ టెన్నిస్ తార సానియా మీర్జా, అండర్–19 ఉమెన్ క్రికెట్ టీమ్ కెప్టెన్ ప్రణవి చంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎన్‌సీసీ అధ్యక్షుడు జి.ఆదిశేష గిరిరావు, ఉపాధ్యక్షుడు వి.రంగారావు, కార్యదర్శి ముళ్లపూడి మోహన్, కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌కు వచ్చే సభ్యులకు ఇదొక మంచి కాలక్షేప కేంద్రంగా మారుతుందని ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. అన్ని హంగులతో సభ్యులకు చక్కని వేదికగా ఈ కాఫీ షాప్‌ను తీర్చిదిద్దామన్నారు.

ప్రగతి భవన్ ముట్టడికి యత్నం



పంజగుట్ట: టీఎస్‌పీఎస్సీలో పరీక్షాపత్రాల లీకేజీ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రగతిభవన్ ముట్టడికి యత్నించారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించి ఉన్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులకు పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్,రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఇటిక్యాల రామకృష్ణ, గ్యార నరేష్, గర్ల్స్ కన్వీనర్ నాగజ్యోతి, రఘురాం, రాజు, శివ, చైతన్య తదితరులు ఉన్నారు.

నేడు జేఎన్‌టీయూహెచ్ స్నాతకోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ 11వ స్నాతకోత్సవం శనివారం ఉదయం 11 గంటలకు ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ చాన్సలర్, తెలంగాణ గవర్నర్, డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అధ్యక్షత వహించనున్నారు. స్నాతకోత్సవం సందర్భంగా రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్ డా.కృష్ణస్వామి కస్తూరిరంగన్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా కస్తూరి రంగన్ స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. స్నాతకోత్సవం సందర్భంగా 92 వేల మందికి యుజీ,పీజీ డిగ్రీ పత్రాలను అందించనున్నారు.

ఏప్రిల్ 11 నుంచి వన్‌టైం ఛాన్స్ డిగ్రీ పరీక్షలు


ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఏప్రిల్ 11 నుంచి వన్‌టైం డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు శుక్రవారం తెలిపారు. బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల్లో 2016 నుంచి 2019 వరకు చదివి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు వన్‌టైం ఛాన్స్ అవకాశం కల్పించిన విషయం విదితమే. మే వరకు జరిగే డిగ్రీ పరీక్షల టైం టేబుల్‌ను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు అన్నారు.

‘రియల్’ లాభాల పేరిట మోసం

- కోర్టును ఆశ్రయించిన బాధితుడు
- దర్యాప్తు చేపట్టిన నారాయణగూడ పోలీసులు

హిమాయత్‌నగర్: రియల ఎస్టేట్ వెంచర్‌లో లాభాలు ఇస్తానంటూ ఓ వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని రాంకోఠికి చెందిన ఓ వ్యాపారి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు రిఫర్ కేసు కావడంతో నారాయణగూడ పోలీసులు ప్రస్తుతం మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే..రాంకోఠికి చెందిన జనక్ పటేల్, బంజారాహిల్స్‌కు చెందిన నరెడ్ల రమాకాంత్‌రెడ్డిలు ఫైనాన్స్ చేసుకునేందుకు స్నేహితుల ద్వారా పరిచయమయ్యారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య ఓ ఎంఓయూ రాసుకుని జనక్ పటేల్.. రమాకాంత్‌రెడ్డి రూ.50లక్షలు ఇచ్చాడు. ఈ రూ.50లక్షలు రమాకాంత్‌రెడ్డికి చెందిన ట్రేడ్ సమ్మిట్ అనే కంపెనీకి జనక్ పటేల్ చెల్లించారు. తొలుత ఫైనాన్స్ అని చెప్పిన రమాకాంత్‌రెడ్డి ఆ తర్వాత బెంగుళూరు తదితర ప్రాంతాల్లో రియల్ వెంచర్లలో పార్టనర్‌షిప్ వ్యాపారం చేద్దామంటూ జనక్‌పటేల్‌కు తెలిపాడు. ఇదంతా 2015లో జరిగింది. రియల్ వెంచర్‌లో పెట్టుబడి పెట్టేందుకు జనక్ పటేల్‌కు రూ.30కోట్లు రుణం అందిస్తానంటూ రమాకాంత్‌రెడ్డి చెప్పాడు. ముందుగా తీసుకున్న రూ.50లక్షలను రియల్ వెంచర్‌లో కలుపుతున్నట్లు చెప్పిన రమాకాంత్‌రెడ్డి అందుకు సంబంధించిన లాభాలను జనక్ పటేల్‌కు ఇవ్వలేదు. తన వద్ద నుంచి పలు డాక్యుమెంట్లతో పాటు, తనని నమ్మించి రూ.50లక్షలు డబ్బు తీసుకున్నాడంటూ 2015 నుంచి జనక్ పటేల్ న్యాయపోరాటం చేస్తున్నాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న రమాకాంత్‌రెడ్డిపై తాజాగా కోర్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని నారాయణగూడ పోలీసులకు సూచించడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళా విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్‌గా వారిజా రాణి



సుల్తాన్‌బజార్: ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో పని చేస్తున్న డాక్టర్ వారిజా రాణి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మపురికి చెందిన డాక్టర్ వారిజా రాణి ఉస్మానియా విశ్వ విద్యాలయం సెంటర్ ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జర్నలిజంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ పట్టా పొందారు. మహిళా కళాశాల విద్యార్థుల వికాసమే ధ్యేయంగా పనిచేస్తానని ఆమె అన్నారు.

ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ అధికారిగా సుజాత


డాక్టర్ సుజాత

సుల్తాన్‌బజార్: తెలంగాణ మహిళా యూనివర్శిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ అధికారిణిగా డాక్టర్ సుజాత బాధ్యతలు చేపట్టారు. సుజాత గత 16 సంవత్సరాలుగా అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థుల కు బోధిస్తున్నారు. అనేక పరిశోధనలు చేసిన ఈమె ను తెలంగాణ మహిళా యూనివర్సిటీ ప్రత్యేక అధికారిణిగా సుజాతను వీసీ విజ్జుల నియమించారు.

మోడల్స్ సందడి





బంజారాహిల్స్: సంప్రదాయానికి ఆధునికతను జోడించి తీర్చిదిద్దిన అరుదైన డిజైన్లతో కూడిన దుస్తులతో జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36 పెద్దమ్మగుడి చౌరస్తాలో కోస్కి పేరుతో దుస్తుల షోరూం ఏర్పాటైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీ నటి శ్రీలేఖ, రితికా చక్రవర్తి, కృతికా రాయ్, నిషత్ షేక్ హాజరై కలర్‌ఫుల్ కాంబినేషన్‌లో తీర్చిదిద్దిన డిజైనరీ దుస్తులను ఆవిష్కరించారు. పలువురు మోడల్స్ ఈ దుస్తులను ధరించి విశేషంగా ఆకట్టుకున్నారు. ఫ్యాషన్ ప్రియులకోసం కోస్కిలో ప్రత్యేకతతో కూడిన డిజైనరీ దుస్తులు అందుబాటులోకి తీసుకొచ్చామని షోరూం సీఈవో ఉమర్ అక్తర్ వెల్లడించారు.


SMART BAZAAR
SMART SUPERSTORE
Reliance
కనీసం 5% అదనపు ఎమ్ఆర్‌పి పై + ప్రతిరోజు అదనపు డిస్కౌంట్
*కిరాణా సరుకులన్నిటిపై
చక్కెర 1 kg ₹9* ప్రతిరోజు
*₹1499 మరియు అంతకంటే మించిన షాపింగ్‌పై
స్మార్ట్ కానుక ఈ ఉగాది వేడుక
11TH – 22ND MARCH
SMART BAZAAR
హైదరాబాద్: అరిహంత్ టవర్, సంతోష్ నగర్ క్రాస్ రోడ్ దగ్గర. • కొంపల్లి: రస్వీ 9 దగ్గర, కుత్బుల్లాపూర్, కొంపల్లి రోడ్. • గుడిమల్కాపూర్: కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ ప్రక్కన, గుడిమల్కాపూర్ రోడ్. • తిరుమలగిరి: మిలిటరీ డైరీ ఫార్మ్ రోడ్, సుభాష్‌నగర్ బస్ స్టాప్. • కార్ఖానా: ఇన్నర్ రింగ్ రోడ్, ఆరాధన 70 ఎమ్ఎమ్ థియేటర్ ఎదురుగా. • కూకట్‌పల్లి: సిఎమ్ఆర్ కాంప్లెక్స్, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్. • పంజాగుట్ట: నెక్స్ట్ గల్లెరియా మాల్, పంజాగుట్ట మెట్రో స్టేషన్ • మాదాపూర్: ఇనార్బిట్ మాల్ రోడ్, ఏపిఐఐసి సాఫ్ట్‌వేర్ లేఅవుట్. • అబిడ్స్: ఎం పీ ఎం మాల్, జీపీఓ ఎదురుగా, అబిడ్స్ ఎక్స్ రోడ్. • మియాపూర్: మియాపూర్ బస్ స్టాప్, మియాపూర్ ఎక్స్ రోడ్. • అమీర్‌పేట: జిఎస్ 24 క్యారెట్ బిల్డింగ్, మెయిన్ రోడ్, అమీర్‌పేట్. • కాచిగూడ: మహేశ్వరి పరమేశ్వరి టవర్స్, కాచిగూడ రోడ్.
SMART SUPERSTORE
హైదరాబాద్ • మహబూబ్ నగర్ • నిజామాబాద్ • బోధన్ • నల్గొండ • జహీరాబాద్ • పాల్వంచ • మిర్యాలగూడ • నస్పూర్ • ఆర్మూర్ • భువనగిరి • హన్మకొండ • కరీంనగర్ • ఖమ్మం • నిర్మల్ • సంగారెడ్డి • సిద్దిపేట • వేములవాడ • వనపర్తి • వరంగల్
బిగ్ కోకోనట్ 1 యూనిట్ మార్కెట్ ధర ₹30 మా ధర ₹21
బనానా కర్పూరవల్లి 1 kg మార్కెట్ ధర ₹55 మా ధర ₹45
మస్క్‌మెలన్ 1 యూనిట్ మార్కెట్ ధర ₹34 మా ధర ₹29
ఆరెంజ్ 1 kg మార్కెట్ ధర ₹79 మా ధర ₹69
రా మ్యాంగో 1 kg మార్కెట్ ధర ₹59 మా ధర ₹49
ఇండియా గేట్ బాస్మతి రైస్ రోజానా 5 kg + సన్‌రిచ్ సన్ ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ 5 ℓ కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1577 ఆదా చేసుకోండి ₹498 మా ధర ₹1079
మైదా / శనగపిండి / బొంబాయి రవ్వ 500 g / 1 kg ఎమ్ఆర్‌పి ₹45 మొదలుకుని BUY 1 GET 1 FREE
పార్థ్ బెల్లం 450 g ఎమ్ఆర్‌పి ₹48 ఆదా చేసుకోండి ₹13 మా ధర ₹35
శెనగపప్పు 1 kg మార్కెట్ ధర ₹70 మా ధర ₹63
కందిపప్పు 1 kg మార్కెట్ ధర ₹125 మా ధర ₹118
లూస్ సోనా మసూరి బియ్యం ప్రీమియమ్ / లూజ్ (ఐడి) హైదరాబాదీ బిరియానీ రైస్ 1 kg మార్కెట్ ధర ₹54 / ₹120 మా ధర ₹52/ ₹105
లూజ్ షుగర్ ఎస్ 1 kg మార్కెట్ ధర ₹45 మా ధర ₹37
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g ఎమ్ఆర్‌పి ₹549 / ₹499 ఆదా చేసుకోండి ₹228 / ₹100 మా ధర ₹321/ ₹399
ఫార్చ్యూన్ సన్‌లైట్ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ 1 ℓ ఎమ్ఆర్‌పి ₹149 ఆదా చేసుకోండి ₹20 మా ధర ₹129
హెరిటేజ్ అగ్మార్క్ నెయ్యి (గ్రేడ్ స్పెషల్) 1 ℓ ఎమ్ఆర్‌పి ₹730 ఆదా చేసుకోండి ₹120 మా ధర ₹610
హెరిటేజ్ టోటల్ కర్డ్ 500 g ఎమ్ఆర్‌పి ₹48 ఆదా చేసుకోండి ₹7 మా ధర ₹41
నెస్లే మిల్క్‌మెయిడ్ కండెన్స్‌డ్ మిల్క్ 380 g ఎమ్ఆర్‌పి ₹139 ఆదా చేసుకోండి ₹15 మా ధర ₹124
ఎమ్‌టిఆర్ వెర్మిసెల్లి 850 g ఎమ్ఆర్‌పి ₹87 మొదలుకుని మా ధర ₹59 మొదలుకుని ఆదా చేసుకోండి ₹28
మిరిండా ఆరెంజ్ / 7 అప్ / పెప్సి 2.25 ℓ (సెలెక్ట్ వేరియంట్స్) ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹99 మొదలుకుని BUY 2 GET 1 FREE
మీరాబెల్లె షీట్ మాస్క్ / నీతా మెహందీ కోన్ / గ్లిమ్మర్ కాజల్ / నివియా / ఎంగేజ్ డియో (సెలెక్ట్ రేంజ్) (సెలెక్ట్ వేరియంట్స్) ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని BUY 1 GET 1 FREE
పూజా సామాగ్రి రేంజ్ (సెలెక్ట్ వేరియంట్స్) ఎమ్ఆర్‌పి ₹25 మొదలుకుని BUY 1 GET 1 FREE
లూస్ స్టీల్ డిన్నర్ వేర్ (సెలెక్ట్ రేంజ్) ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని BUY 1 GET 1 FREE
Pigeon క్లాసిక్ లైట్ ఐవరీ మిక్సర్ గ్రైండర్ 550W ఎమ్ఆర్‌పి ₹3015 మా ధర ₹1299
Prestige డెకోర్ బ్లాక్ 3 పీసెస్ నాన్ స్టిక్ కుక్ వేర్ సెట్ ఎమ్ఆర్‌పి ₹3740 మా ధర ₹1599
HAPPY LIVING WELSPUN DREAMLINE TRIDENT డబుల్ బెడ్ షీట్ (సెలెక్ట్ రేంజ్) ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని BUY 1 GET 2 FREE
మెన్స్ వేర్ ప్రారంభం నుండి ₹299
ఉమెన్స్ వేర్ ప్రారంభం నుండి ₹199
కిడ్స్ వేర్ ప్రారంభం నుండి ₹129
వద్ద కూడా లభ్యం
SMART POINT
fresh Signature
Pay with MobiKwik GET FLAT ₹40 CASHBACK
*T&C Apply : Min Transaction of ₹750 | Valid Once Per User Valid from 1st to 31st March 2023
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి
నియమ నిబంధనలు వర్తిస్తాయి. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్‌లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు/ఫోటోగ్రాఫులు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. హోమ్‌వేర్ మరియు అపరెల్ ఆఫర్లు ఎంపిక చేయబడిన స్మార్ట్ బజార్ మరియు స్మార్ట్ సూపర్ స్టోరులలో మాత్రమే వర్తిస్తాయి. ఉత్పాదనలన్నిటి యొక్క ఎమ్ఆర్‌పి అన్ని పన్నులతో కూడి ఉంటుంది. పళ్లు మరియు కూరగాయలు యొక్క ఆఫర్‌లన్నీ 19 మార్చి 2023 వరకు చెల్లుతాయి. ఇతర ఆఫర్‌లన్నీ 22 మార్చి 2023 వరకు చెల్లుతాయి. ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టులో ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.

● వాన కురిసింది.. యాదాద్రి మెరిసింది



మండుటెండల్లో అకాల వర్షం పలకరించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. నిలిచిన వర్షపు నీటిలో ఆలయ గోపుర ప్రతిబింబం ఇలా కనువిందు చేసింది. - యాదగిరిగుట్ట

20 లక్షల కరోనా వ్యాక్సిన్లు ఇవ్వండి

● కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ విన్నపం... లేఖ రాయాలని నిర్ణయం
● కరోనాపై ఉన్నతాధికారులతో మంత్రి హరీశ్‌రావు సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా నియంత్రణకు అవసరమైన 20 లక్షల కరోనా వ్యాక్సిన్లను సరఫరా చేయాలంటూ కేంద్రానికి విన్నవిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ఈ మేరకు లేఖ రాయాలని నిర్ణయించామన్నారు. కరోనా కేసుల పెరుగుదల, కేంద్రం అప్రమత్తం చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జూమ్ ద్వారా జరిగిన సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేత మహంతి, డీఎంఈ రమేశ్ రెడ్డి, ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాసరావు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి: ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని హరీశ్ చెప్పారు. దగ్గు, జ్వరం, గొంతు నొప్పి వంటి కోవిడ్ లక్షణాలు ఉన్న వారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకొని, అవసరమైన వారు చికిత్స పొందాలని సూచించారు. కోవిడ్ వ్యాక్సినేషన్లో తెలంగాణ దేశానికి ఆదర్శవంతంగా నిలిచిందని, ముఖ్యంగా ప్రికాషన్ డోసు పంపిణీ చేయడంలో మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఇప్పటివరకు 7.75 కోట్ల వ్యాక్సిన్లను అర్హులైన వారికి అందించనున్నారు. 1.35 కోట్ల ప్రికాషన్ డోసులు పంపిణీ చేయగా, 1.62 కోట్ల ప్రికాషన్ డోసు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలు, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందని, ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అర్హులైన వారు తమ వంతుగా వ్యాక్సిన్ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఏఐ అకడమిక్ చాలెంజ్ విజేతలు వీరే

విజేతలకు రూ.10 లక్షలు చొప్పున సీడ్‌ఫండింగ్

సాక్షి, హైదరాబాద్: 'వాతావరణ మార్పు'పై జాతీయ స్థాయిలో నిర్వహించిన అకడమిక్ గ్రాండ్ చాలెంజ్ విజేతలను తెలంగాణ ఏఐ మిషన్ శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో ఈ అకడమిక్ గ్రాండ్ చాలెంజ్‌ను తెలంగాణ ఏఐ మిషన్ ప్రకటించింది. కాప్‌జెమిని, నాస్కామ్ సహకారంతో తెలంగాణ ఏఐ మిషన్ ఈ గ్రాండ్ చాలెంజ్‌లో దేశవ్యాప్తంగా 700కు పైగా కళాశాలల నుంచి 20వేల విద్యార్థులతో కూడిన 7,500 బృందాలు ఎంట్రీలను పంపించాయి. ఈ చాలెంజ్‌లో భాగంగా తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం పట్టణాల్లో వడగాలుల సంభావ్యత, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌పై ఈ పోటీలో పాల్గొనే బృందాలు పరిష్కారాలు సూచించాల్సి ఉంటుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ ఓపెన్ డేటా పోర్టల్, కాలుష్య నియంత్రణ మండలి సమాచారాన్ని ఉపయోగించుకునేలా అవకాశం కల్పించారు. ఎంట్రీల పరిశీలన తర్వాత వీఐటీ వెల్లూరు, వీఐటీ భోపాల్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ నయాపూర్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఇందిరా గాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ వుమెన్, గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, చెన్నై శివనాడార్ యూనివర్సిటీ, బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పూర్ణిమా కాలేజీ జైపూర్, ఐఐటీ మద్రాస్, జాదవ్‌పూర్ యూనివర్సిటీ బృందాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థి బృందాలు తమ ఆవిష్కరణలకు వాణిజ్యరూపం ఇచ్చేందుకు రూ.10లక్షల చొప్పున సీడ్ ఫండింగ్ అందజేస్తారు. విజేతలను ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, క్యాప్‌జెమిని వైస్ ప్రెసిడెంట్ అనురాగ్ ప్రతాప్ అభినందించారు.

రాష్ట్రంలో కొత్తగా 25 కరోనా కేసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం కరోనా టెస్టులు నిర్వహించారు. మొత్తం 4,517 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా.. ఇందులో 25 మంది వైరస్ బారిన పడినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.42 లక్షలకు చేరింది. ఒక్కరోజులోనే కరోనా నుంచి 38 మంది కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 268 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.